శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రము

వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

4వ భాగము

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

Volume-4

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

This work is published under

Creative Commons Non-Commercial License

The above license applies only to my translation, which is done with permission from the original author, Sri N. Krishnamachari.

Excerpts from other works reproduced in this work are not covered in the above license. Main examples of such reproductions are

(a) Telugu Translation of Bhagavdgitha Slokas, which are taken from the publication of Gita Press, Gorakhpur

(b) Excerpts from book of Sri Pemmaraju Rajarao (Especially translation of Purva Peethika)

(c) Excerpts from the book of Dr. Krovi Partha Saradhi

(d) Excerpts from other works which are mentioned in appropriate places.

All Photographs and pictures are by me (Kaja Sudhakara Babu) or taken from free sources such as Wikipedia.

<u>Cover Photo:</u>

Sculpture at Dwaraka Thirumala, West Godavari District, Andhra Pradesh.

అమృతాంశూద్భవో భానుః శశబిందుః సురేశ్వరః |
ఔషధం జగతః సేతుః సత్యధర్మపరాక్రమః || (31)

284. అమృతాంశూద్భవః

- అమృత కిరణ్మయుడగు చంద్రుని జననమునకు కారణము.
- జలములను వ్యాపింపజేసి జీవులను సృష్టించువాడు.

ఓం అమృతాంశూద్భవాయ నమః

సర్వతాప హరస్త్వైవ మృత సంజీవనస్య చ

అమృతాంశో హి తజ్జత్వా దమృతాంశూద్భవ స్మృతః

అమృత – తాపహరములు, మృత్యునివారణములు, జీవదాయకములు.

అంశుః – కిరణములు (కలిగిన చంద్రుని)

ఉద్భవః – జన్మకు కారణము (సృష్టించినవాడు).

అమృతాంశుః ఉద్భవతి అస్మాదితి అమృతాంశూద్భవః

అమృతాంశుడనగా చంద్రుడు. క్షీరసాగర మథన సమయమున చంద్రుని ఉద్భవమునకు మూల కారణమైన శ్రీకూర్మమూర్తియే అమృతాంశూద్భవుడు. సంసార సాగరమునుండి, కర్మ భారముల నుండి, మాయామోహముల బంధమునుండి అందరను ఉద్ధరించువాడు. ఇందుకు శ్రీ చిన్మయగారు గీత 15.13 నుండి చెప్పిన ప్రమాణము – **పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః** – అమృతమయుడనైన చంద్రుడనై వనస్పతులను పోషించుచున్నాను.

చంద్రమానుసనోజతః – ఆ విరాట్పురుషుని మనస్సునుండి చంద్రుడు జన్మించెను (పురుషసూక్తము).

నక్షత్రాణామహం శశీ – నక్షత్రములలో చంద్రుడను (గీత).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారు తక్కిన భాష్యకారులకంటె స్వతంత్రమైన భావమును వివరించారు. 'అమృత' అనగా పానీయము, జలము. 'అంశు' అనగా పంచుట, విభజించుట. ప్రాణాధారమైన జలములను అన్నియెడల పంచి ప్రాణుల మనుగడకు ఆధారమైనాడు గనుక భగవానుడు అమృతాంశూద్భవుడు. తల్లి గర్భమున శిశువు నీటిలో తేలుచుండును. నీరు లభించినపుడే విత్తనములనుండి మొలకలు బయటపడును. వృక్షములు పెరుగును. సస్యములు ఫలించును. వానిని ఆహారముగా స్వీకరించి అన్ని జీవులును ప్రాణములను నిలుపుకొనును. నీరే అమృతము. శ్రీమన్నారాయణుని ప్రసాదము.

285. భానుః

- ప్రకాశించువాడు. కిరణ్మయుడు. సూర్యుడు.
- సూర్యునకు కూడ వెలుగు ప్రసాదించువాడు.

ఓం భానవే నమః

భాతి ఇతి భానుః – ప్రకాశించువాడు భానుడు.

రవేస్తేజస్వర త్వాచ్చ భానురిత్యభిధీయతే – తేజస్సు కలిగినందున సూర్యుని భానుడు అందురు.

యస్యాదిత్యో భా ముపయుజ్య భాతి – ఎవనివలన సూర్యుడు ప్రకాశించుచున్నాడో అతడు.

ముండకోపనిషత్తు 2.2.10 – **తమేవ భాంతమ్ అనుభాతి సర్వమ్ తస్య భాసా సర్వమిదమ్ విభాతి** – ఆయన స్వయముగా ప్రకాశించును. అంతటిని ప్రకాశింపజేయును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – అన్ని శరీరములందు చైతన్యము, అగ్ని భగవంతుని ప్రసాదము. వానివల్లనే ప్రాణము నిలబడును.

ధర్మచక్రము రచయిత – సూర్యుని కాంతివలన బయటి వస్తువులు మాత్రమే కనిపించును. ఆ పరమేశ్వరుని కాంతివలన ఆత్మజ్ఞానము కలుగును.

286. శశబిన్దుః / శశవిన్దుః

- దుర్మార్గులను విడనాడువాడు, దుర్మార్గులను శిక్షించువాడు.
- చంద్రుడు (కుందేలువంటి మచ్చ గలవాడు).
- నక్షత్రముల, గ్రహముల గతులను నియంత్రించువాడు.

ఓం శశబిన్దవే నమః

ఓం శశవిన్దవే నమః

శశప్లుత గతిః ప్రోక్తో బిన్దుస్తస్య నివర్తకః
కౌటిల్య గతి విధ్వంసీ శశబిన్దు రుదాహృతః

శ్రీ భట్టుల వ్యాఖ్యానము ప్రకారము –

శశ – ప్లుతగతౌ – వక్రమార్గమున నడచువారు.

బిన్దు – బిది – దూరముగానుండుట.

శశానాం కుటిల గతీనాం బిందుః అపలపితా ఇతి శశబిందుః – వక్రమార్గమున సంచరించు దుష్టులను, అన్యాయవర్తనులను నశింపజేయువాడు శశబిన్దువు. కంసుని పాలిటి వజ్రము. నరకుని పాలిటి యముడు. హిరణ్యకశిపుని చీల్చిన వజ్రనఖుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'శశ' అనగా కుందేలు. 'బిందు' అనగా మచ్చ. చంద్రునిపైని మచ్చ కుందేలువలె నుండును. శశబిందువు అనగా చంద్రుడు. భగవంతుని చంద్రునిగా పెక్కు సందర్భములలో చెప్పడమైనది. **'చంద్రాంశుః'**, **'అమృతాంశూద్భవో భానుః'**, **'నక్షత్రాణామహం శశీ'**, **'సోమో భూత్వా రసాత్మకః'**.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారు ఈ నామమును **'శశవిన్దుః'** అని గ్రహించారు.

శశ – ప్లుతగతౌ – అటూ ఇటూ తిరిగేవి (గ్రహములు).

విందః – వేదనాశీలః – తెలిసినవాడు, అదుపు చేయువాడు.

సకల గ్రహ నక్షత్రముల గతులను అదుపు చేయువాడు గనుక శ్రీమహావిష్ణువు శశవిందువు.

287. సురేశ్వరః

దేవతలకు ప్రభువు. సన్మార్గమున నడచువారికి అండ.

ఓం సురేశ్వరాయ నమః

సురాణాం ఋజుగతీనాం దేవానాం ఈశ్వరః నిర్వాకః సురేశ్వరః
ధర్తా ఋజుగతీనాం యః సః సురేశ్వర ఈరితః

సు (శోభన) – రా (దానః) – మంచి పనులు చేయువారు, సన్మార్గమున నడచువారు సురులు. వారికి ప్రభువు సురేశ్వరుడు. దుష్టులను శిక్షించి, శిష్టులను బ్రోచువాడు. కూర్మావతారుడై మందర పర్వతమును నిలిపినవాడు. మోహినియై అమృతమును పంచి, దేవతలను కాచిన ప్రభువు. శ్రీకృష్ణుడై గోవర్ధన గిరినెత్తి దేవతల గర్వమడచినవాడు.

సురేశ్వరుడైన శ్రీమహావిష్ణువును ధ్యానించి, భక్తులు దైవత్వమును సాధింపనగును. (ధర్మచక్రము రచయిత).

గరుడారూఢుడైన విష్ణువు. తూర్పు చాళుక్యులనాటి మకరతోరణ శిల్పం. పెదవేగి గ్రామంలోనిది.

288. ఔషధమ్

రోగార్తో ముచ్యతే రోగాత్ – భవరోగమును నయము చేయు దివ్యమగు మందు.

ఓం ఔషధాయ నమః

భవ తీవ్ర విషం హర్తా ఔషధం యః స ఉచ్యతే – జనన మరణ చక్రబంధమున పడి, కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాదులచే పీడింపబడు సంసార వ్యాధిగ్రస్తులకు ఆ దుఃఖమునుండి విముక్తిని ప్రసాదించు దివ్యౌషధము ఆ దేవదేవుడే. **దేవా దేవర్షయశ్చైవ యమ్ విదుః దుఃఖ భేషజమ్** – అనగా, దేవతలకును, దేవర్షులకును దుఃఖమునుండి విముక్తిని కలిగించు దివ్యౌషధము శ్రీమన్నారాయణుడే (మహాభారతము. శాంతి పర్వము 79.22)

శ్రీ భట్టులు చెప్పిన మరొక ప్రమాణము – **ఏకాగ్రతా మూల్య బలేన లభ్యమ్ భవౌషధమ్ త్వమ్ భగవాన్ కిలైకః** – భగవంతుడా! ఏకాగ్రత అనే ఖర్చు ద్వారా లభించు దివ్యౌషధమవు. సంసార వ్యాధికి విరుగుడు నీవే.

శ్రీ వి.వి. రామానుజన్ గారు 3వ తిరువంతాది (3) దివ్య ప్రబంధమునుండి ఉదాహరించారు – **తేన్ గోదవణ్ణన్ వరు నరగమ్ తిరుక్కు మరున్ను.**

ధర్మచక్రము రచయిత – ప్రకృతి భగవంతుని అంశయే. మనకు సకలములైన ఆహారములు, ఔషధములు, జీవనాధారములు ప్రకృతినుండియే లభించును. పరిశుభ్రమైన గాలి, నీరు, భోజనము స్వీకరించిన వారికి ఆరోగ్యము చక్కగా నుండును.

289. జగతః సేతుః

- మంచి, చెడుల మధ్య అడ్డుగా నిలుచువాడు.
- సంసార సాగరమును దాటుటకు ఉపయోగపడు వంతెన.
- చలించువానినన్నిటిని అదుపులోనుంచువాడు.

ఓం జగతః సేతవే నమః

నిరోధా జ్జగతస్సేతుః సదసద్వర సఙ్గతే – మంచి చెడుల మధ్య సేతువుగా నిలిచి భగవంతుడు ధర్మక్రమమును పరిరక్షించును. చేసిన కర్మకు తగిన ఫలము లభించును. చేయని దానికి ఏమియును చిక్కదు. మంచి పనులకు మంచి, చెడు పనులకు చెడు ఫలితములు లభించి తీరును. జన్మలు గడచినా కర్మబంధములు జీవుని వెంటాడుతూనే ఉండును. ఇలా పుణ్య పాపములు, న్యాయాన్యాయములు కలిసిపోకుండా నిరోధించేందుకు ఒక సేతువులా ఉండి దేని ఫలితాన్ని దానికి ఇచ్చేవాడు జగతస్సేతువు.

బృహదారణ్యకము 6.4.22 – **ఏష సేతుః విధరణ ఏషామ్ లోకానామ్ అసంభేదాయ** – కలగాపులగం కాకుండా నిలుపు సేతువు (అడ్డుకట్ట).

శ్రీ శంకరులు మరొక వ్యాఖ్య కూడా చెప్పారు – సంసార సాగరమును దాటుటకు ఉపయోగపడు వారధి.

తెలుగు సినిమా పాట – **రామయ తండ్రీ! ఓ రామయ తండ్రీ! అందరినీ దరిజేర్చు మారాజువే! అద్దరినీ చేర్చమనీ అడుగుతుండావే!.**

క్రైస్తవ భక్తి గీతము – **నడిపించు నా నావా! నడి సంద్రమున దేవా!**

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారి వ్యాఖ్య – జగత్ – ('గతి' నుండి) – చలించునది, భ్రమించునది. సేతు – కలిపి యుంచునది. ప్రపంచములో అన్నింటినీ క్రమముగా పట్టియుంచువాడు శ్రీహరి. సూర్య చంద్రులు, నక్షత్రములు, గ్రహములు, తారామండలములు, నదీనదములు, తరంగములు, శరీరములోని భాగములు,

పశుపక్ష్యాదులు – సమస్తమును చలన శీలములైనను, ఒక క్రమములో చలించును. ఇలా అన్నింటిని జాగ్రత్తగా కలిపియుంచువాడు జగతస్సేతువు.

ధర్మచక్రము రచయిత – నదులు గట్లలో ఒదిగియుండును. సముద్రము చెలియలికట్టను దాటిరాదు. అలాగే జీవాత్మలు ఇంద్రియ సుఖములకు, విషయ వాంఛలకు లొంగి శరీరమున బందీలై యుండును. ఈ బంధములను తెంచుకున్నవారే సంసార సాగరమును తరింపగలరు. శ్రీమహావిష్ణు ధ్యానమే అందుకు మార్గము.

290. సత్యధర్మ పరాక్రమః

సదా నిజమైన ధర్మగుణము, పరాక్రమము కలిగినవాడు.

ఓం సత్యధర్మ పరాక్రమాయ నమః

ఇక్కడ 'ధర్మము' అనగా భగవంతుని సకల కళ్యాణ గుణ వైభవములు. పరాక్రమము అనగా శక్తి సామర్ధ్యములు, కార్య సాధక లక్షణములు. ఇట్టి లక్షణములు ఎన్నడూ కొరవడనివాడు గనుక శ్రీనివాసుడు సత్యధర్మపరాక్రముడు.

వాల్మీకి రామాయణమున శ్రీరాముని సత్యధర్మపరాక్రమునిగా వర్ణించెను. ఆయన పరాక్రమము ఎన్నడూ వన్నె తరుగదు. అన్ని వేళలా లోక కళ్యాణమునకు వినియోగము.

ధర్మచక్రము రచయిత – సత్యము, ధర్మము, ధైర్యము, కార్యదీక్ష, లోకహితములతో కూడిన జీవనము సాగింపవలెనని ఈ నామము బోధించును. హనుమంతునివలె, భీష్మునివలె, అట్టి దృఢ, ధర్మ మార్గము ననుసరించినవారు భగవంతుని కటాక్షమును పొందుట తథ్యము.

మొల్ల రామాయణము నుండి – (http://musicandmantra.blogspot.com – శ్రీ సాకేత్ రామ్ గారి కూర్పు నుండి కాపీ చేయడమైనది)

అవతారిక –

సల్లలిత ప్రతాప గుణ సాగరుఁడై విలసిల్లి, ధాత్రిపై
బల్లిదుఁడైన రామ నరపాలకునిన్ స్తుతి సేయు జిహ్వకున్
జిల్లర రాజలోకము జేకొని మెచ్చఁగ నిచ్చ పుట్టునే?
యల్లము బెల్లముం దినుచు నప్పటి కప్పటి కాస సేయునే ?

గుహుని ప్రపత్తి –

"సుడిగొని రాము పాదములు సోఁకిన ధూళి వహించి రాయి యే

ర్పడ నొక కాంత యయ్యె నఁట, పన్నుగ నీతని పాద రేణువి

య్యెడ వడి నోడసోఁక నిది యేమగునో" యని సంశయాత్ముఁడై

కడిగె గుహుండు రామపద కంజ యుగమ్ము భయమ్ము పెంపునన్.

హనుమంతుని సాగర లంఘనము –

మొగము బిగించి, పాదములు మొత్తముగా వదినూఁది త్రొక్కి, నీ

తుగ మొగ మెత్తి, భీకర కఠోర రవంబున నార్చి, బాహు ల

త్యగణిత లీల నూఁచి, వలయంబుగ వాలముఁద్రిప్పి, ప్రేఁగునన్

నగము సగమ్ము గ్రుంగఁ, గపి నాథుఁడు నింగికి దాఁటె ఠీవ్వునన్.

హనుమంతుడు శ్రీరాముని శోభన గుణములను వర్ణించుట –

నీల మేఘ చ్ఛాయ బోలు దేహమువాఁడు

ధవ ళాబ్జ పత్ర నేత్రములవాఁడు

కంబు సన్నిభ మైన కంఠంబు గలఁవాఁడు

చక్కని పీన వక్షంబువాఁడు

తిన్ననై కనుపట్టు దీర్ఘ బాహులవాఁడు

ఘనమైన దుందుభి స్వనమువాఁడు

పద్మ రేఖలు గల్గు పద యుగంబులవాఁడు

బాగైన యట్టి గుల్పములవాఁడు

కపట మెఱుఁగని సత్య వాక్యములవాఁడు

రమణి! రాముండు శుభ లక్షణములవాఁడు

ఇన్ని గుణముల రూపింప నెసఁగువాఁడు

వరుస సౌమిత్రి బంగారు వన్నె వాఁడు

భాస్కర రామాయణమునుండి – శ్రీరామ ధనుష్టంకారము గురించిన పద్యము – మల్లికార్జునభట్టు రచన

http://www.eemaata.com/em/issues/201011/1630.html

(శ్రీ చీమలమర్రి బృందావనరావు “నాకు నచ్చిన పద్యం” వ్యాఖ్యనుండి)

అంతఁగడంక రాముడు సమగ్ర భుజాబల విక్రమోత్సవం

బెంతయు బర్వ మౌర్వి మొరయించె దిగంతర దంతి కర్ణరం

ధ్రాంతర సాగరాంతర ధరాభ్ర తలాంతర చక్రవాళ శై

లాంతర సర్వ భూధర గుహోకుహరాంతర పూరితంబుగన్

పై పద్యం శ్రీరాముడు తాటకను చంపబోయే ముందు చేసిన ధనుష్టంకారాన్ని వర్ణించే పద్యం. విశ్వామిత్రుడు తన యాగ సంరక్షణ కోసం దశరథుణ్ణి అర్థించి రామ లక్ష్మణులను తీసుకొని అరణ్యానికి బయల్దేరతాడు. అరణ్యంలో తాటకను గురించి ఆమెను సంహరించవలసి వుంటుందని తెలుపగా, రాముడు అంగీకరించి తన వింటి నారిని మ్రోగిస్తాడు. ఆ ధనుష్టంకార శబ్దం ఎలా మ్రోగిందో తెలుపుతుంది ఈ పద్యం. ఆ మౌర్వీరవం దిగంతరాల్లో మ్రోగింది. ఎనిమిది దిక్కులో వుండే దిగ్గజాల శూర్ప కర్ణాల వివరాలలో హ్రీంకారించింది. సముద్రాంతరాల్లో ధ్వనించింది. భూమికీ ఆకాశానికీ మధ్య సర్వ వాతావరణంలోనూ ప్రతిధ్వనించింది. పర్వత సమూహాల్లో మారుమ్రోగింది. కొండగుహల్లో నిండిపోయింది. ధనుష్టంకార విశేషాన్ని పద్యంలో పట్టుకోవడం దీనిలోని అందం.

రామాయణ కల్పవృక్షము నుండి – అశోక వనంలో సీత వర్ణన – విశ్వనాథ సత్యనారాయణ రచన
http://www.eemaata.com/em/issues/201101/1652.html
(శ్రీ చీమలమర్రి బృందావనరావు "నాకు నచ్చిన పద్యం" వ్యాఖ్యనుండి)

ఆకృతి రామచంద్ర విరహాకృతి కన్బొమ తీరు స్వామి చా

పాకృతి కన్నులన్ ప్రభు కృపాకృతి కైశిక మందు స్వామి దే

హాకృతి సర్వదేహమున యందును రాఘువ వంశమౌళి ధ

ర్మాకృతి కూర్చున్న విధమంతయు రామ ప్రతిజ్ఞ మూర్తియై

ఇది లంకాపురిలో అశోక తరువు క్రింద కూర్చుని వున్న సీతాదేవి వర్ణన. ఆమెను వెదకడానికి పోయిన హనుమ రాత్రంతా అక్కడా ఇక్కడా వెదకి, చివరకు అశోకవనిలో ఆమెను చూచి, ఇంకా ఆమెను కలవక ముందు - అదే సమయంలో సీత వద్దకు రావణాసురుడు వచ్చి ఆఖరి హెచ్చరిక చేస్తాడు. అప్పటి సీత ఆకృతి ఇది. ఆకృతి రామచంద్ర విరహాకృతి యట. ఇక్కడ విరహం ఉభయనిష్ఠము. రామచంద్రుడు సీత విరహాకృతి, సీత రామచంద్ర విరహాకృతి. సీతారాముల పరస్పరానుబంధం ఎటువంటిదంటే, తొలిసారిగా ఆమెను చూచిన హనుమ అనుకుంటాడు గదా - అసలు శ్రీరాముడంటే ఎవరో నాకు సంపూర్ణంగా తెలిసిపోయింది అనుకునే వాడిని, ఇప్పుడు ఈమెను చూసే సరికి అసలు నాకేమీ తెలియదు అనే సంగతి అర్థమయింది - సీత నెరుంగకుండ రఘుశేఖరుడర్థము గాడు పూర్తిగా - అని. ఇక సీత ఆకృతి రామచంద్ర విరహాకృతి కావడంలో ఆశ్చర్యమేముంది! రామచంద్ర విరహాకృతి అంటే రామచంద్రుని కొరకైన విరహము ఆకృతి దాల్చినట్లుండటమే గాక, సీత కొరకైన రామచంద్రుని విరహమంతా సీతగా మూర్తీభవించి ఇక్కడ కూర్చుని వుండడమూ కావచ్చు. మొత్తానికి ఆమె ఆకృతి అంతా ఒక వియోగ భావపు ముద్ద.

కన్బొమ తీరు స్వామి చాపాకృతి. కనుబొమలను ధనుస్సుతో పోల్చటం సాధారణ కవిసమయం. కనుబొమలు ధనుస్సు లాగా ఉండటం సౌందర్య సూచకం. సీత కన్బొమలు రామచాపంలా ఉన్నాయట. అంత బాధలోనూ ఆమె రూపలావణ్యాలను రూపిస్తూ వున్నది ఆమె కనుబొమల తీరు.

కన్నులన్ ప్రభువు కృపాకృతి. రామచంద్రుడెంత కృపాసముద్రుడో, ఆ కృప అంతా ఆమె కన్నుల్లో గూడు కట్టుకొని ద్యోతకం అవుతూనే వున్నది. ఈమె కన్నుల్లో ఆయన కృప ఆకారం ధరించటం ఆ దంపతుల ఏకత్వ భావనకు మరో తార్కాణం.
కైశికమందు రామ దేహాకృతి. కైశికమంటే తల వెండ్రుకలు. సీత కేశపాశాలు - శ్రీరాముని దేహవర్ణం వలే - నల్లనివే. ఆయన ఒంటి రంగు ఈమె కైశికంలో ఆకారం ధరించినట్లున్నది.

సర్వదేహమున్ యందును రాఘువ వంశమౌళి ధర్మాకృతి. సీత స్వయంగా మూర్తీభవించిన ధర్మము. రామచంద్రుడు ధర్మోద్ధారణకు అవతరించినవాడు. ఆయన ధర్మభావం మొత్తం ఆమె సర్వదేహంలోనూ మూర్తీభవించింది. ఇప్పుడు ఆ ధర్మానికే భంగం కలిగింది రావణుని వలన. రావణ నిగ్రహమూ, ధర్మ రక్షణా - వీటికి రాముని ప్రస్తుత కర్తవ్యం పరాకాష్ఠ అయి, అధర్మ నిర్మూలనం జరిగి సీత ఆకృతిగా వున్న ధర్మం పరిరక్షింపబడుతుంది.

ఇక ఆమె కూర్చున్న వైఖరి - రావణ నిర్మూలనానికి, అంటే అధర్మ నిధనానికి సన్నద్ధుడైన శ్రీరాముని పూనిక రూపం దాల్చినట్లు కూర్చున్నది. ఆమె కూర్చున్న పద్ధతిలోనే ఆమె నిశ్చయమూ, ఆమె నిశ్చలతా, తన భర్త యెడ ఆమెకు గల అనంత విశ్వాసమూ అన్నీ ద్యోతకమౌతున్నాయి.

ఒక క్షుద్రుని చేత దొంగతనంగా ఎత్తుకుని రాబడిన మహావమానాన్ని సహిస్తూ కూర్చుని వున్న ఆ పత్త్యైకశీల ఆకృతి, కనుబొమలు, కన్నులు, కేశపాశము, సర్వ దేహము, కూరుచున్న వైఖరి అన్నీ - ఆమె ఏ మహాత్ముని రాకడకై నిరీక్షిస్తున్నాయో - ఆయన లక్షణాలతో ఏకీభూతంగా ఆరోపింపబడటం ఈ పద్యంలోని సొగసు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

భూతభవ్యభవన్నాథః పవనః పావనోఽనలః |
కామహా కామకృత్ కాంతః కామః కామప్రదః ప్రభుః || (32)

291. భూతభవ్యభవన్నాథః

- (గడచినది. జరుగుచున్నది, రాబోవునది అను) మూడు కాలములకు అధిపతి.

- మూడు కాలములందు అధిపతి.

ఓం భూతభవ్యభవన్నాథాయ నమః

మొదటి శ్లోకములో నాలుగవ నామము 'భూత భవ్య భవత్ ప్రభుః' కూడా ఇంచుమించు ఇదే అర్థమును సూచించును. కాని ఈ రెండు నామముల వ్యాఖ్యలో శ్రీ శంకరులు చూపిన వైవిధ్యము ఇలా ఉన్నది –

భూతభవ్యభవత్ప్రభుః – త్రికాలములకు అధిపతి. కాలాతీతుడు.

భూతభవ్యభవన్నాథః – త్రికాలములందు సకల చరాచరములకు, జీవులకు అధిపతి. కాలముతో నిమిత్తము లేని అధికారి.

ఐశ్వర్యం వాధస్వామ్యం వా త్రికాలేష్వపి యస్య సః
భూతభవ్యభవన్నాథః ఇత్యుక్త స్సద్భిరాదరాత్.
త్రికాలములయందు కూడా సకలము నియమించే సామర్థ్యము కలవాడు. అన్నింటికీ స్వామి.

భూతానాం భవ్యానాం భవతానాం చ ప్రాణినాం నాథః – భూతభవిష్యద్వర్తమాన కాలములన్నింటిలోనూ జీవులకు ప్రభువు. త్రికాలములందు ప్రాణులచే యాచింపబడువాడు. ఆ ప్రాణులను శాసించువాడు.

అన్నమయ్య కీర్తన

పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా మమ్ము - నెడయకవయ్యా కోనేటి రాయడా

కోరిమమ్ము నేలినట్టి కులదైవమా, చాల - నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు - చేరువ జిత్తములోని శ్రీనివాసుడా

భావింప గైవసమైన పారిజాతమా, మమ్ము - చేవదేర గాచినట్టి చింతామణీ
కావించి కోరికలిచ్చే కామధేనువా, మమ్ము - తావై రక్షించేటి ధరణీధరా

చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా, రోగా - లడచి రక్షించే దివ్యౌషధమా
బడిబాయక తిరిగే ప్రాణబంధుడా, మమ్ము - గడియించినట్టి శ్రీ వేంకటనాథుడా

292. పవనః

- వాయువు, ప్రాణము.

- **పవతః ఇతి పవనః** – సంచరించువాడు. సర్వదా వ్యాపించినవాడు.

ఓం పవనాయ నమః

32వశ్లోకము – **భూతభవ్య భవన్నాథః పవనః పావనోఽనలః**

87వ శ్లోకము – **కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోఽనిలః**

శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము 32వ శ్లోకంలోని 292వ నామము '**పవనః**' మరియు 293వ నామము '**పావనః**'. ఇక 87వ శ్లోకములోని 817వ నామమును '**పవనః**'గాను, '**పావనః**' గాను కూడా పరిగణించినట్లు కనిపిస్తున్నది.

సదా స్వయం తు సర్వత్ర ప్రవాహ ఇవ నిత్యశః
పవనః ప్రవహతి యః కథ్యతే వేగదోమనుః

పవి – అనగా సంచరించుట అనే ధాతువు ఆధారంగా శ్రీ భట్టుల వ్యాఖ్యను వివరింపవచ్చును. భగవంతునకు ఎక్కడా, ఎప్పుడూ అడ్డు లేదు. కనుక ఆయన పవనుడు. ఈ నామము వేగమునిచ్చును. ఓం పవనాయ నమః.

పవనః పవతామస్మి రామశ్శస్త్రభృతామహమ్
ఝుషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ – గీత 10.31

సంచరించువాటిలో (పవిత్రము చేయువానిలో) వాయుదేవుడను నేను. శస్త్రధారులలో శ్రీరామచంద్రుడను. జలచరములలో మొసలిని. నదులలో గంగానదిని నేను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారు ఈ ('**పవనః**') నామమునకు 'పవిత్రమైనవాడు' అనీ, తరువాతి ('**పావనః**') నామమునకు 'పవిత్రము చేయవాడు' అనీ అర్థము చెప్పారు.

293. పావనః

పావయతీతి పావనః – అంతటినీ పవిత్రము చేయువాడు.

ఓం పావనాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

32వశ్లోకము – **భూతభవ్య భవన్నాథః పవనః పావనోऽనలః**

87వ శ్లోకము – **కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోऽనిలః**

శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము 32వ శ్లోకంలోని 292వ నామము '**పవనః**' మరియు 293వ నామము '**పావనః**'. ఇక 87వ శ్లోకములోని 817వ నామమును '**పవనః**'గాను, '**పావనః**' గాను కూడా పరిగణించినట్లు కనిపిస్తున్నది.

యస్స్వ సంబన్ధి గంగాదీన్ పావయన్ లోకపావనాన్
స పావన ఇతి ఖ్యాతః పావనత్వప్రదో మనుః
తనయొక్క సంబంధము చేతనే గంగ మొదలైన నదులను పవిత్రం చేస్తున్నాడు గనుక పావనుడు. ఈ నామము పవిత్రతనిచ్చును. ఓం పావనాయ నమః.

పావనః సర్వ లోకానామ్ త్వమేవ రఘునందన – రఘునందనా! సర్వ లోకములను పావనము చేయువాడవు నీవే (రామాయణము. ఉత్తర కాండము. 32.9) అని అగస్త్యమహర్షి అన్నాడు. శ్రీరాముని చరణములు సోకినంతనే అహల్యకు శాపవిమోచనము అయినది. రామనామ సంకీర్తనము పాపహరము. మోక్షప్రదము.

శ్రీ విష్ణు సహస్ర నామములో '**పవిత్రాణామ్ పవిత్రమ్ మంగళానామ్ చ మంగళమ్**' అని చెప్పబడినది.

శ్రీ వి.వి. రామానుజన్ గారు తిరువైమొళి (2.8.5) నుండి చెప్పిన ఉదాహరణ – **దేవాది దేవ పెరుమాన్ ఎన్ తీర్థనే**. ఇక్కడ 'తీర్థన్' అనగా 'పవిత్రము' అని అర్థము. ఇంకా ఇరణ్డామ్ తిరువందాడి (14)లో- **కరమ్ నాన్లుడైయాన్ పేరోడి తీర్థకరార్ ఆమిన్**. ఆ చతుర్భుజుని నామము స్మరించి మనము పావనమగుదుము – అని చెప్పబడినది.

శ్రీ మహావిష్ణువు శక్తివల్లనే అనేక విషయములు, పాపములు తొలగును. ఎండ్రకాయలు కుట్టుట వలన బాధపడేవాని చెవిలో ఎర్ర మిరపకాయల రసం వేసినట్లయితే విషం తగ్గుతుంది. ఇటువంటి ఎన్నో ఉదాహరణలను శ్రీసత్యదేవో వాసిష్ఠ పేర్కొన్నారు.

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి – మనసునకును, సకల ప్రాణికోటులకును చైతన్యమునొసంగువాడు. వాయువును ప్రవర్తింపజేయువాడు. పావనుడు.

294. అనలః

- తృప్తిలేని (అనంతమైన దయ గలిగిన) వాడు. తన భక్తులకు తాను చేసినదానితో తృప్తి చెందనివాడు.
- తన భక్తుల పట్ల జరిగిన దుష్కార్యమును సహింపజాలనివాడు.
- ప్రాణశక్తిని తనదానిగా స్వీకరించి జీవాత్మగా వ్యవహరించువాడు.
- వాసనవంటి గుణములకు అతీతుడు.
- అంతు లేని యశో వైభవ విభూతులు గలవాడు. (అలమ్ – పర్యాప్తి – చివర)
- అగ్నిస్వరూపుడు. పాపవినాశకుడు.
- అంతము లేనివాడు. (అలమ్ – పర్యాప్తి – చివర)
- ఎదురు లేనివాడు (అలమ్ – నిరోధము)
- భగవంతుని కొరకు తపించే భక్తులను పునరుజ్జీవింప జేయువాడు. (అన్- ప్రాణనే).

ఓం అనలాయ నమః

ఈ నామము రెండుమార్లు వచ్చుచున్నది.

32వ శ్లోకము. 294వ నామము. అనలః – **భూతభవ్యభవన్నాథః పవనః పావనోऽనలః**

76వ శ్లోకము. 716వ నామము. అనలః – **భూతావాసో వాసుదేవః సర్వాసునిలయోऽనలః**

ఈ నామమునకు శ్రీ భట్టులు చెప్పిన వ్యాఖ్య (అన్-అలః)–

అపర్యాప్తో హి భక్తేభ్యోऽప్యుపకృత్యపునః పునః

అనుగ్రహం యః కరోతి సోऽనలః పరికీర్తితః

భక్తులకు మరల మరల ఎన్నో విధములుగా ఉపకరించి కూడ సంతుష్టుడు కానివాడు. అపరిమిత కరుణాంతరంగుడు. భక్తవరదుడు. 'అలమ్' అనగా సంతుష్టి చెందుట. 'అనలము' అనగా తృప్తి లేకుండుట. **న అలః అనలః.**

శ్రీ వి.వి. రామానుజన్ గారు చెప్పిన వివరణ – పెరియ తిరువంతాడి (53). **ఉన్ అడియార్ క్కు ఎన్ సేయవాన్ ఎన్ఱే ఇరుత్తినీ** – నీ భక్తుల కోసం ఇంకా ఏమేమి చేస్తావో అనే ఆలోచిస్తూ ఉంటాను. ద్రౌపదీ మానసంరక్షణ

చేసిన శ్రీకృష్ణ పరమాత్మునికి ఆమె ఆక్రందన మరచిపోవుట సాధ్యము కాలేదు. ఇంకా ఆమెకు ఋణపడి యున్నట్లుగానే ఆయన భావించెను. **ఋణమ్ ప్రవృత్తమ్ ఇదమ్ మే హృద్యాత్ నాపసర్పతి**. భక్తుల కొరకు ఆయన చేసే పనులకు అంతులేదు. కంచిలో తిరుక్కచ్చినంబికి వర్షములో గొడుగు పట్టినాడు. అనంతాళువారికి మట్టి మోసినాడు. మనము ఎన్ని అపరాధములు చేసినను మన్నించు, కొండలంత వరములు కూపెడు కోనేటిరాయడు ఆయన.

'అనలము' అనగా అగ్ని. అగ్నికి దాహము చల్లారదు. ఆహుతి చేసిన కొలది ప్రజ్వలించి మరింతగా కాల్చివేయును. అదే విధముగా భగవంతుడు శరణాగతులైనవారి పాపములను భస్మీపటలము చేయును. మనము ఎన్ని పాపములు చేసినా గాని ఆయన పాపనాశనత్వము శమించదు (వేదాంత దేశికుల దయాశతకము – 29)

ఈ నామమునకు శ్రీ శంకరులు చెప్పిన వ్యాఖ్య (అన-లః) – **అన** – ప్రాణము, **లా** – ఆదానే దానేచ – స్వీకరించుట. **అనాన్ ప్రాణాన్ ఆత్మత్వేన లాతి ఇతి అనలః** – ప్రాణశక్తిని తనదానిగా స్వీకరించి జీవాత్మ స్వరూపునిగా వ్యవహరించువాడు అనలుడు (ఒక భావము)

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారు ఇదే (ప్రాణములను స్వీకరించుట అనే) అర్థాన్ని కొంత భిన్నంగా వివరించారు – **అనాన్** – ప్రాణులను, **లః** – గ్రహించువాడు.చివరకు భగవంతుడు అందరి ప్రాణాలనూ తనలో విలీనం చేసుకొంటాడు గనుక ఈశ్వరుడు అనలుడు.

శరీరములో జఠరాగ్ని ఆహారమును అరిగింపజేసి, శక్తినొసగి, ప్రాణములు నిలబెట్టుచున్నది. అదియును భగవత్స్వరూపమే.

మరిన్ని భావములు 716వ నామము వివరణలో చెప్పబడినవి.

295. కామహా

కోరికలను నాశనము చేయువాడు.

ఓం కామఘ్నే నమః

తన భక్తుల మనసులలోని విషయ వాంఛలను, ఐహిక కామములను నశింపజేయువాడు గనుక శ్రీనివాసుడు కామఘ్నుడు.

కోరికలను ఎందుకు నాశనము చేయాలి? కోరిక ఉన్నపుడు రెండు పరిణామములు సాధ్యము – కోరిక తీరినట్లయితే ఇంకా కావాలనిపిస్తుంది. కోరిక తీరనట్లయితే కోపము అధికమవుతుంది (శ్రీ చిన్మయానంద).

అందుకే కోరికలున్నచోట శాంతము ఉండదు. శాంతము లేకున్న సౌఖ్యము లేదు (శ్రీ త్యాగరాజ స్వామి). హరి పాదాంబుజ ధ్యానమే సకల సౌఖ్యములకు మార్గము. మహా భాగ్యవంతునకు చిల్లర సొమ్ముపై మనసు లేనట్లుగా, మహాపర్వతమునెక్కిన వానికి చిన్ని గుట్టలనెక్కుటకు ఆసక్తి లేనట్లుగా - **అంబుజోదర దివ్య పాదారవింద చింతనామృత పాన విశేషమత్త చిత్తమేరీతి నితరంబు చేరనేర్చు?** – అని ప్రహ్లాదుడు అన్నాడు (పోతన భాగవతము). అందుకే ఆ దేవదేవుడు కామఘ్నుడు. **ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్** – అని సెలవిచ్చెను (గీత 2.55)



దశావతారములు. 1900 కాలపు రాజారవివర్మ ప్రెస్ చిత్రం. వికీపీడియానుండి

పుంసాం స్వదర్శినాం యోఽసౌ స్పృహాంచ విషయాన్తరే

హతవాన్ కామహా ప్రోక్తః సర్వాశాపూరకో మనుః

తనను దర్శించినవారికి సాంసారిక భోగమును మాన్పించేవాడు కామఘ్నుడు. ఈ నామము సకలములైన కోరికలను నెరవేర్చును. ఓం కామఘ్నాయ నమః.

296. కామకృత్

కోరదగినవానిని సృష్టించువాడు. కోరికలను తీర్చువాడు

ఓం కామకృతే నమః

భోగములు గాని, మోక్షము కాని – అన్ని కోర్కెలను తీర్చువాడే 'కామకృత్'. అన్ని కామితార్థములను ప్రసాదించువాడు శ్రీ వేంకటేశుడు.

(తిరుమల తిరుపతిలో స్వయంభువైన ప్రధాన మూర్తిని 'ధృవబేరం' అంటారు. ధృవబేరానికి ప్రక్కన చిన్న భోగవేంకటేశ్వరుని ప్రతిమ ఉన్నది. స్వయంభువైన శ్రీనివాసుని ఐహిక కామములు కలవారు కొలువరాదని నమ్మకము. కనుక తిరుపతిలో అర్చనాది సర్వ పూజలు శ్రీ భోగవేంకటేశ్వరునికే చేయబడుతాయి. డా. పప్పు వేణుగోపాలరావు గారు మస్కట్ లో ఒక ఉపన్యాసంలో ఈ విషయం చెప్పారు – కా.సు. బాబు)

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **కామాన్ కరోతి పూరయతి ఇతి కామకృత్** – కోరిన వరములిచ్చే దేవుడు. ఎవరైనా ధనము అవుసరమైనపుడు తనకంటే ధనికుని అర్థిస్తారు. అందరి కోరికలను తీర్చగలవాడు సర్వైశ్వర్య సకల గుణ సంపన్నుడైన శ్రీలక్ష్మీనారాయణుడే.

కామకృత్ – అనగా కోరికలు కలిగించువాడు – అని కూడ అర్థము. ధర్మయుతమైన, శాశ్వతానందప్రదమైన, సకల శుభకరమగు కోరికలు శ్రీధరుని పదసేవకులకే కలుగును.

కామహా – మోక్షమునకు ఆటంకములగు కోరికలను నాశనము చేయువాడు.
కామకృత్ – ధర్మబద్ధమగు కోరికలను కలుగజేయువాడు.

ఈ నామ వివరణ సందర్భములో ధర్మచక్రము రచయిత వివరించిన దివ్య సాహితీ రత్నములు –
వేణ్డత్తక్కదు అఱివోయ్ నీ, వేణ్ణ ముళుదుమ్ తరువోయ్ నీ
వేణ్డుమ్ పరిశు ఒన్టు ఉండు ఎనిల్ అదువుమ్ ఉందన్ విఱుప్పన్రే – మాణిక్కవాచకార్.

కులమ్ తరుమ్ సెల్వమ్ తందిడుమ్, అడియార్ పద్దుమ్ తూయర్ ఆయిన
ఎల్లామ్ నిలమ్ తరమ్ శెయ్యుమ్ నీల్ విశుంబుమ్ అరుళుమ్
అరుళోడు పెరునిలమ్ అళిక్కుమ్, నలమ్ తరుమ్ సొల్లై
నాన్ కణ్డుమ్ కొండేన్ నారాయణా ఎన్నుమ్ నామమ్ – తిరుమంగైయాళ్వార్

కోరుకొన్నవారికి కోరినంత ప్రసాదించే కొండలరాయుడు. నామమును స్మరించినంతనే మోక్షమును ప్రసాదించు సీతారాముడు. కామకృత్.

297. కాంతః (కాన్తః)

- మనోహరుడు. సమ్మోహనరూపుడు. ఆత్మబంధుడు.
- పరార్ధమున (మహా ప్రళయమున) సృష్టికర్తయైన బ్రహ్మ కూడ అంతమగునట్లు చేయువాడు.
- అన్నియెడలా ఉండి ప్రకాశించువాడు.

ఓం కాన్తాయ నమః

ఈ నామము మరల 660వ నామముగా స్తుతింపబడును.

32వ శ్లోకము. 297వ శ్లోకము. కాన్తః – **కామహా కామకృత్ కాంతః కామః కామప్రదః ప్రభుః**

70వ శ్లోకము. 660వ నామము. కాన్తః – **కామదేవః కామపాలః కామీ కాన్తః కృతాగమః**

'కాన్త' అనగా ఆకర్షణ. 'అయస్కాంతము' అనే పదము ఇందునుండే వచ్చినది. శ్రీదేవుడు సౌందర్యాది గుణములతోను, శీలము, ఔదార్యముతోను అందరిని ఆకర్షించును. ఆయన నీలమేఘశ్యాముడు. సుగుణాభిరాముడు. పుంసాం మోహనరూపుడు. ఆర్తత్రాణ పరాయణుడు. అహల్య పాలి కామధేనువు. సీతాదేవి పాలి చింతామణి. దాసుల పాలి ఇహపరదైవము. సుగ్రీవునకు పరమ బంధువు. ఆయనే కౌశికుని పాలిటి కల్పవృక్షము. కామిత ఫలములిచ్చు రఘువీరుడు. సరి హనుమంతు పాలి సామ్రాజ్యము. విభీషణునకు నిధానము. జనకుని పాలి ఘనపారిజాతము. శబరికి తత్వపు రహస్యము. అలరి గుహుని పాళి ఆదిమూలము. కలడన్నవారిపాలి కన్నులెదుటి మూర్తి. శ్రీ వేంకటాద్రి విభుడు. అని అన్నమయ్య కీర్తించెను.

మరి కొన్ని భావములు 660వ నామ వివరణలో చెప్పబడినవి.

త్యాగరాజు కీర్తన

ఎందు కౌగిలింతురా? ని – న్నెంతని వర్ణింతురా? ని ॥న్నెందు॥

అందమైన కుందవదన – యుందిరా హృన్మందిరా! ని ॥న్నెందు॥

నీదు పలుకె పలుకురా నీదు కులుకె కులుకురా

నీదు తళుకే తళుకురా నిజమైన త్యాగరాజ నుతా! ని ॥న్నెందు॥

---

298. కామః

- ప్రేమ స్వరూపుడు. కోరుకొనదగినవాడు. మన్మథుడు.

- ధర్మార్థకామమోక్షములను అభిలషించువారిచే కోరబడువాడు.

ఓం కామాయ నమః

అన్ని పురుషార్థములకును పురుషోత్తముడే మార్గము.

సౌన్దర్యాది గుణైః కాన్తః మనోహరతయా భృశమ్

వికామ కమనీయత్వాత్ శీలౌదార్య దయాదిభిః

కామ ఇత్యుచ్యతే నిత్యం షడర్ణో కామ్య రూపదః

అని నిరుక్తిలో '**కాన్తః**' మరియు '**కామః**' అనే రెండు నామములకు అర్థము చెప్పబడినది. ఆయన సీతామనోహరుడు. గోపకాంతుడు. గోపాలబాలుడు. మునిజన మానస విహారి. ఆర్తిహారి. ఈ నామము షడక్షరీ మంత్రము. కామ్యరూపమును ప్రసాదించునది. ఓం కామాయ నమః.

కామ దేవుడనగా మన్మథుడు అని కూడా అర్థము.

299. కామప్రదః

కోరినవి ఇచ్చేవాడు.

ఓం కామప్రదాయ నమః

ఎంతలు కోరినవారికి అంతలిచ్చే కామధేనువు.

స్వకామ్య క్షుద్రకామ్యేభ్యో యథార్హం కామ్య దానతః

కామప్రద స్సమాఖ్యాతో హ్యష్టార్ణో మనురుత్తమః

తనను కోరువారికి తనను, పురుషార్థములను కోరువారికి వాటిని, వారి యోగ్యతను బట్టి ఇచ్చేవాడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. ఉత్తమమైనది. ఓం కామప్రదాయ నమః.

యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్

మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః – గీత 4.11

పార్థా! భక్తులు నన్ను సేవించిన రీతికి అనుగుణముగ నేను వారిని అనుగ్రహింతును. మనుష్యులందరు వివిధ రీతులలో నా మార్గమునే అనుసరింతురు.

ఏకో బహూనామ్ యో విదధాతి కామాన్ – అందరి కోర్కెలను తీర్చే ఒకే ఒక్కడు (కఠోపనిషత్తు 2.5)

300. ప్రభుః

అందరికంటె అధికుడు. అందరి మనస్సులను తనవైపు లాగుకొను అధిష్ఠాత. ఘటనాఘటన సమర్థుడు. దేవాధిదేవుడు.

ఓం ప్రభవే నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

4వ శ్లోకము. 35వ నామము. ప్రభుః – **సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభుః ఈశ్వరః**

32వ శ్లోకము. 300వ నామము. ప్రభుః – **కామహా కామకృత్ కాంతః కామః కామప్రదః ప్రభుః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – 35వ నామము. ప్రభుః – సర్వాధిపతి. బ్రహ్మాది దేవతలకు కూడ సకల భోగమోక్షములను, ఫలములను ప్రసాదించువాడు ప్రభువు.

300వ నామము. ప్రభుః – అందరిని చిత్తములను ఆకర్షించు సుందరుడు, నేర్పరి. శక్తిమంతుడు. అన్నింటిని లోబరచుకొనువాడు. **సర్వేషాం చిత్తహరణే ప్రభుః ప్రభవతీతి యః**

శ్రీ శంకరుల వ్యాఖ్య – 35వ నామము. ప్రభుః – సకల కార్యములందును అతిశయించిన సామర్థ్యము కలవాడు.

300వ నామము. ప్రభుః – **ప్రకర్షేణ భవనాత్ ప్రభుః** – అందరిని అధిగమించువాడు ప్రభువు.

శ్రీహరియే ప్రభువని చెబుతూ ధర్మచక్రము రచయిత పెక్కు ఉదాహరణలు చెప్పారు – శ్రీమన్నారాయణుడు భక్తుల చేయి వీడని, సన్మార్గమునుండి చలించని అచ్యుతుడు. ఇంద్రియములను నియంత్రించు హృషీకేశుడు. సాధువులను పరిత్రాణము చేసి దుష్టులను వినాశనము చేయు అవతారమూర్తి. మధుసూదనుడు. కంసచాణూరమర్దనుడు. దేవదేవుడు. ప్రభువు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

యుగాదికృద్యుగావర్తో నైకమాయో మహాశనః |
అదృశ్యోऽవ్యక్తరూపశ్చ సహస్రజిదనంతజిత్ || (33)

301. యుగాదికృత్

- యుగమును ఆరంభించువాడు. యుగములను సృష్టించి, యుగము ప్రారంభములో సృష్టికార్యము చేయువాడు. వటపత్రశాయి.

- యుగములు, కల్పములు – ఇటువంటి కాలప్రమాణములను సృష్టించినవాడు. కాలచక్రమును కల్పించినవాడు. సూర్యుని సృష్టించి, కాలభ్రమణమునేర్పరచినవాడు.

ఓం యుగాదికృతే నమః

301 నుండి 314 వరకు నామములు వటపత్రశాయిని స్మరించు నామములు.

కరారవిందేన పదారవిందమ్ ముఖారవిందే వినివేశయంతమ్
వటస్య పత్రస్య పుటేశయానమ్ బాలమ్ ముకుందమ్ మనసా స్మరామి

న్యగ్రోధశాయీ భగవాన్ పురుషోత్తమః
కరోత్యాది యుగాస్యాన్తే యుగాదికృదురీరితః

పురాణపురుషుడైన ఆ పరమేశ్వరుడు ప్రళయకాలంలో వటపత్రశాయియై, ఈ జగత్తు నీటిలో మునిగిపోకుండా కాపాడి తరువాతి కాలంలో యుగాలను ఆరంభిస్తున్నాడు.

యుగాదిం కాలవిశేషం కరోతి – యుగాది అనే కాలవిశేషాన్ని ఏర్పరచేవాడు.

అహమేవాऽక్షయ కాలః – నేను అక్షయమగు కాల స్వరూపమును.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **యుగస్య అంతేఽపి ఆదిమ్ కరోతి** – యుగాంతమున కూడ యుగమును ప్రారంభించువాడు. ప్రళయ కాలమున సకల భువనములను తనయందు భద్రపరచి, ప్రళయానంతరము సృష్టిని పునఃప్రారంభించును గనుక ఆ వటపత్రశాయియే యుగాదికృత్తు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **యుగాదేః కాలభేదస్య కర్తృత్వాత్ యుగాదికృత్** – యుగారంభమున దినములు, సంవత్సరములు, యుగములు, మన్వంతరములు – ఇటువంటి కాలభేదములను సృష్టించినవాడు గనుక భగవంతుడు యుగాదికృత్.

శ్రీ చిన్మయానంద – 'ఆది' అనగా దినములు, నెలలు, సంవత్సరములు వంటి కాలప్రమాణములు. ఇటువంటి కాలభేదములను కల్పించి, కాలమునకు గమనము, భ్రమణము కలుగజేసినవాడు. అలా కాకున్నయెడల కాలమునకు మొదలు, తుది, మార్పు అనేవి తెలియవు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు కాలవిశేషములు సృష్టించినందున యుగాంతము, యుగారంభమువంటి కాలచిహ్నములను ఏర్పరచినాడు. ఒక యుగమునకు, మరొక యుగమునకు సంధానకర్త పరమేశ్వరుడు మాత్రమే.

యుగానాం ఆదిమ్ ఆరంభమ్ కరోతి ఇతి యుగాదికృత్ – అని కూడ శ్రీ శంకరులు చెప్పారు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'యుగము' అనగా కాలచక్రము. 'ఆది' అనగా మొదలు. దివారాత్రములకు మూలమైన సూర్యుడే 'యుగాది'. సూర్యుని సృష్టించినవాడు 'యుగాదికృత్'.

ధర్మచక్రము రచయిత – అనంత కాలగమనమును అర్థము చేసికొన్నవారు క్షణికమైన ఐహిక బంధనములలో చిక్కుకొనరు. గడచిపోయినదానికి ఇంక చేసేది లేదు. రానున్నది మన అధీనములో నుండదు. మనకందుబాటులోనున్న వర్తమానమును భగవధ్యానమునకు వినియోగించవలయును.

భగవద్గీత – అక్షర పరబ్రహ్మ యోగము.

ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున
మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే (8-16)
సహస్రయుగపర్యన్తమహర్యద్ బ్రహ్మణో విదుః
రాత్రిం యుగసహస్రాన్తాం తేఽహోరాత్రవిదో జనాః (8-17)
అవ్యక్తాద్ వ్యక్తయః సర్వాః ప్రభవన్త్యహరాగమే
రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్తసంజ్ఞకే (8-18)
భూతగ్రామః స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే
రాత్ర్యాగమేఽవశః పార్థ ప్రభవత్యహరాగమే (8-19)

పరస్తస్మాత్తు భావోఽన్యోఽవ్యక్తోఽవ్యక్తాత్సనాతనః
యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి (8-20)
అవ్యక్తోఽక్షర ఇత్యుక్తస్తమాహుః పరమాం గతిమ్
యం ప్రాప్య న నివర్తన్తే తద్ధామ పరమం మమ (8-21)

అర్జునా! బ్రహ్మలోకము పర్యంతము ఉన్న సమస్త లోకములును పునరావృతములు. కౌంతేయా! (ఈ లోకములన్నియును కాలమునకు పరిమితములైనవి. కాని నేను కాలాతీతుడను.) కనుక నన్ను చేరినవానికి పునర్జన్మయుండదు. వేయి చతుర్యుగముల కాలము బ్రహ్మకు ఒక 'పగలు' అనియు, అంతే కాలము ఆ బ్రహ్మకు ఒక 'రాత్రి' యనియు తెలిసిన యోగులు కాలతత్త్వమును నిజముగా ఎఱిగినవారు. చరాచర ప్రాణులన్నియును బ్రహ్మయొక్క పగటి కాలము ప్రారంభము కాగానే అవ్యక్తమునుండి, అనగా బ్రహ్మయొక్క సూక్ష్మశరీరమునుండి ఉత్పన్నమగును (ప్రకటితములగును). మరల బ్రహ్మయొక్క రాత్రి కాలము ప్రారంభ సమయమున అవి అదే అవ్యక్తమునందు లీనమగును.

పార్థా! ఈ భూత (ప్రాణి) సముదాయమే ప్రకృతి వశమున మాటిమాటికిని ఉత్పన్నమగుచుండును. రాత్రి ప్రారంభకాలమున లీనమగుచుండును. పగటి ప్రారంభ కాలమున ఉత్పన్నమగుచుండును. ఆ అవ్యక్తము కంటెను పరమైన విలక్షణమైన సనాతన(శాశ్వత)మైన అవ్యక్త భావమే ఆ పరమపదము. ప్రాణులన్నియును నశించినను ఆ పరమపురుషుడు నశింపడు (నిత్యుడే). ఈ అవ్యక్తమునే 'అక్షరము' అనియు అందురు. ఇదియే పరమగతి. మరియు నా పరమధామము. ఈ సనాతన అవ్యక్తమును, అనగా నా పరంధామమును, చేరినవారు మఱల తిరిగి రారు.

భగవద్గీత – విభూతి యోగము

మహర్షయః సప్త పూర్వే చత్వారో మనవస్తథా
మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః (10-6)

సప్తమహర్షులును, వారికంటె పూర్వులైన సనకాది మహామునులు నలుగురును, స్వాయంభువాది చతుర్దశ మనువులును మొదలగు వీరందరును నా భక్తులే. అందరూ నాయెడ సద్భావము గలవారే. ఈ జగత్తు నందలి సమస్త ప్రాణులును వారి ప్రజలే.

యుగ విభాగము.

(360 మానవ సంవత్సరములు = 1 దివ్య సంవత్సరము)

యుగ విభాగము	**సౌర (మానవ) సంవత్సరములు**	**దివ్య సంవత్సరములు**
కలియుగము	4,32,000	1,200
ద్వాపర యుగము	8,64,000	2,400
త్రేతాయుగము	12,96,000	3,600
కృతయుగము	17,28,000	4,800
1 చతుర్యుగము (నాలుగు యుగములు కలిపి)	43,20,000	12,000

యుగ విభాగము	సౌర (మానవ) సంవత్సరములు	దివ్య సంవత్సరములు
71 చతుర్యుగములు + 1 కల్పాది సంధ్య	30,67,20,000 + 17,28,000	8,52,000 + 4,800
14 సంధ్యలు	2,41,92,000	67,200
1 సంధ్య + 1 మన్వంతరము	30,84,48,000	8,56,800
14 (మన్వంతరములు + సంధ్య)	4,31,82,72,000	1,19,95,200
14 (మన్వంతరములు + సంధ్య) + 1 కల్పాది సంధ్య	4,32,00,00,000	1,20,00,000
1 కల్పము = బ్రహ్మదేవుని ఒక పగలు = 14 మన్వంతరములు + 14 సంధ్యాకాలములు + 1 కల్పారంభ సంధ్య = 14 మన్వంతరములు + 15 సంధ్యలు = 71 మహాయుగములు + 15 సంధ్యలు + 6 మహాయుగములు = 994 మహాయుగములు + 6 మహాయుగములు = 1000 మహాయుగములు	4,32,00,00,000	1,20,00,000
1 కల్పము = బ్రహ్మ దేవుని ఒక రాత్రి	4,32,00,00,000	1,20,00,000
బ్రహ్మ దేవుని ఒక దినము (ఒక పగలు + ఒక రాత్రి)	8,64,00,00,000	2,40,00,000
బ్రహ్మదేవుని 1 సంవత్సరము = 360 దినములు	360 x 8,64,00,00,000	360 x 2,40,00,000
బ్రహ్మదేవుని 100 సంవత్సరములు = 1 పర	100 x 360 x 8,64,00,00,000	100 x 360 x 2,40,00,000

302. యుగావర్తః

యుగములను ప్రవర్తింపజేయువాడు. కాలచక్రమును త్రిప్పువాడు. కాలస్వరూపుడు.

ఓం యుగావర్తాయ నమః

ధర్మ వ్యవస్థయా స్వస్య యుగాద్యావర్తనాన్మహుః
యుగావర్త స్సమాఖ్యాతః కాలరూపధరో హరిః

ఆవర్తనము అనగా తిరుగుట. పునరావృతమగుట. కృతయుగము (సత్యయుగము), తరువాత త్రేతాయుగము, ఆపై ద్వాపరయుగము, పిదప కలియుగము అయిన అనంతరము మరల కృతయుగము సంభవించును. ధర్మము తిరిగి సంపూర్ణముగా ప్రవర్తిల్లును. దివారాత్రములు, ఋతువులు వలెనే యుగములు మరల మరల వర్తించుటకు కారణము కాలస్వరూపుడు, యుగాదికృత్తు, యుగావర్తుడు అయిన శ్రీహరియే. కాలమును సృష్టించినవాడే కాలమును నడిపించుచున్నాడు.

303. నైకమాయః

- అనేకములైన అద్భుతములకు ఆలవాలమైనవాడు.

- ఎన్నో విధములైన మాయాస్వరూపములు ధరించువాడు.

ఓం నైకమాయాయ నమః

శ్రీ భట్టులు (విశిష్టాద్వైతము), శ్రీ శంకరులు (అద్వైతము) తమ తమ వేదాంతమార్గములకు అనుగుణముగా వివరించడాన్ని ఈ నామము వ్యాఖ్యానములో మనం స్పష్టంగా గమనించవచ్చును.

శ్రీ భట్టులు – 'మాయ' అనగా ఇక్కడ అద్భుతములైన సత్యములు, కార్యములు అని అర్థము. 'మాయ' అనగా 'భ్రమ' అని అర్థము చెప్పరాదు. భగవంతుని అనంతాద్భుత లీలలు ఆయన మాయ. **నైకా మాయా యస్య సః నైకమాయః** – అనేకములైన ఆశ్చర్యములు చేయువాడు నైకమాయ.

ముగ్ధార్భకత్వ రూపేణ జగన్నిర్భరణాదపి
వటైక పత్ర శయనాత్ నిరాలమ్బజలే ముహుః
అనంతాశ్చర్య సంయుక్తో నైకమాయస్తు స స్మృతః
ఏమీ ఎరుగని పసిపిల్లవాడిలా ఉండి కూడా, లోకాలన్నింటిని తన ఉదరమున ధరించుట, మహాప్రళయం జరిగినప్పుడు లేత మర్రి ఆకుపై సముద్రపు నీటిలో పండుకొనుట వంటి ఆశ్చర్యకరమైన పనులు చేయువాడు. నైకమాయుడు. మన్ను తిన్నవాడు. గోవర్ధనగిరిని ఎత్తినవాడు. బ్రహ్మాండమును తన ఉదరమున దాచుకొని తాను తన భక్తుల హృదయమున స్థితుడైనవాడు.

'మాయ' అనగా 'తెలియరానిది' అనే భావముకంటే 'అద్భుత సత్యము' అనే భావమే సమంజసముగా ఉన్నదని శ్రీ భట్టులు ఎన్నో ఉదాహరణలు చెప్పారు. **మాయామ్ తు ప్రకృతిమ్ విద్యాత్** – మాయ అనగా ప్రకృతి. **మాయావయునమ్ జ్ఞానమ్** – మాయ అనగా జ్ఞానము. అని నిరుక్తిలో ఉన్నది. విష్ణుపురాణములో శంబరాసురుని వేలాది మాయలను తన చక్రముతో నాశనమొనర్చిన విషయము వర్ణింపబడినది. భ్రమను నాశనము చేయుటకు చక్రమునెందుకు వాడవలెను? కనుక 'మాయ' అనగా నిజమైన వస్తువే యనుట సరియగును.

శ్రీ శంకరులు – భగవంతుని మాయలకు అంతు లేదు. ఆయన ఎన్నో మాయా స్వరూపములు ధరించును. **న ఏకా మాయా విద్యతే అస్య** – ఇతడికి ఒకే మాయ లేదు. అనేక విధములైన మాయలను ధరించియున్నాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'మా' అనే ధాతువునుండి 'మానె' అనగా 'కొలుచుట'. కొలవజాలని మాయాధరుడు 'నైకమాయః'. ఊహకు, జ్ఞానమునకు అందనివాడు.

304. మహాశనః

- విపరీతమైన ఆకలి గలవాడు. సమస్తమును భక్షించువాడు. ప్రళయకాలమున అంతటిని తనయందు లయమొనర్చుకొనువాడు.
- గొప్పగా వ్యాపించినవాడు.

ఓం మహాశనాయ నమః

మహత్ అశనమ్ యస్య సః మహాశనః – భువనానామ్ నిగరణాత్ మహాశన ఇతీరితః

అశ్ – భోజనే – తినుట – అనే ధాతువునుండి ఈ నామమును వివరింపవచ్చును. ఏడేడు లోకములను మ్రింగినవాడు గనుక ఆయన మహాశనుడు. మన్ను తిన్నవాడు. **హన్నా అని చెవి నులిపి యశోద, ఏదన్నా నీ నోరు చూపుమనగా, చూపితివట నీ నోటన్ బాపురే పదునాల్గు భువన భాండమ్ములను, ఆ రూపము గని యశోద తాపము నశియించెనట, జయ కృష్ణా! ముకుందా! మురారీ! జయ గోవింద బృందా విహారీ!.**

ఉలగమ్ ఉణ్డ పెరువాయా
కారేళ్ కడలేళ్ మలైఏళ్ ఉండుమ్ ఆరా వాయిఱ్ఱానై అడంగప్ పిడిత్తేనే – తిరువైమొళి 108.2

ప్రళయ కాలమున అంతటిని దహించివేయువాడు గనుక ఆయన మహాశనుడు అని శ్రీ శంకరుల భాష్యము. **కల్పాంతే సర్వ గ్రసనాత్.**

ఒకపరి జగముల వెలినిడి
యొకపరి లోపలికి గొనుచు నుభయము గనుచున్
సకలార్థ సాక్షియగు న
య్యకలంకుని నాత్మమయుని నర్థింతు మదిన్ – పోతన భాగవతము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'అశ్' – వ్యాప్తౌ సంఘటే చ – వ్యాపించుట, పేరుకొనుట. భగవంతుడు గొప్పగా, పెద్దయెత్తున అంతటా వ్యాపించెను గనుక మహాశనుడు.

305. అదృశ్యః

కానరానివాడు.

ఓం అదృశ్యాయ నమః

భగవంతుని కంటితో చూడలేము. ఇంద్రియములతో తెలిసికొనలేము. ఆ వటపత్రశాయి కృపవల్ల మాత్రమే ఆయనను గురించి తెలిసికొననగును.

కథమ్ నేఽయమ్ శిశుః శేతే లోకే నాశమ్ ఉపగతే
తపసా చింతయాన్ శ్చాపి తమ్ శిశుమ్ నోపలక్షయే – మహాభరతము. వానప్రస్థ పర్వము. 191.94
లోకములన్నీ ప్రళయమున నశించినాగాని ఈ శిశువు మఱ్ఱియాకుపై పవళించి విరాజిల్లుచున్నాడని నా తపస్సువలన తెలిసికొనియుంటిని. కాని ఈ బాలుని తత్వము తెలిసికొనుట మాత్రము సాధ్యము కాదు.

అతర్క్య వృత్తాన్తతయా జగతః ప్రలయేఽపి యః
న లబ్ధశ్చిన్త్యమానోఽపి సోఽదృశ్య ఇతికథ్యతే
జగత్తులన్నీ లయమైపోయిన ప్రళయకాలమున కూడ ఊహకు గాని, ధ్యానమునకు గాని అందనివాడు.

శ్రీ వి.వి. రామానుజన్ గారు శ్రీ నమ్మాళ్వార్ తిరువైమొళి (7.2.3)నుండి ఉదాహరించారు – **కట్కిల్ ఉన్నైక్ కాణుమాఱు అరుళై** – ఇక్కడ 'కట్కిల్' అనగా భౌతిక నేత్రములకు కనుపించనివాడు.

అదృశ్యమ్ అవ్యవహార్యమ్ అగ్రాహ్యమ్ అలక్షణమ్ ... శాంతమ్ శివమ్ అద్వైతమ్ (మాండూక్యోపనిషత్తు 1.1.6)
ఏడు కొండల సామి ఎక్కడున్నావయ్యా! ఎన్ని మెట్లెక్కినా కానరావేమయ్యా?

306. వ్యక్తరూపః

స్పష్టమైన రూపము కలిగనవాడు. భక్తులకు దర్శనమొసగువాడు. స్వయంప్రకాశమూర్తి. అవతారమూర్తి. ప్రత్యక్షదైవము.

ఓం వ్యక్తరూపాయ నమః

వటపత్రశాయిని దర్శించిన మార్కండేయ మహర్షి. ఇంటర్నెట్ నుండి సేకరించిన చిత్రం.

మార్కండేయాది ఋషులకు స్పష్టముగా కనుపించువాడు.
మహాజలే సఞ్చరతో మార్కణ్డేయస్య ధీమతః
దృశ్యో యో వ్యక్తరూపస్స్యాత్ దివ్య విగ్రహ ధారణాత్
మహా సముద్రంలో మునుగుతూ తేలుతూ ఉన్న మార్కండేయుడికి దివ్య మంగళ విగ్రహముతో దర్శనమిచ్చినవాడు.

(డా. క్రోవి పార్థసారథి రచన 'శ్రీ కైవల్య సారథి' నుండి) భృగుమహర్షి కుమారుడు విధాత. విధాత కుమారుడు మృకుండ మహర్షి. ఆయన కుమారుడు మార్కండేయుడు. ఇతడిది అల్పాయుష్షు. కనుక తీవ్రమైన

తపస్సు చేయగా శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై ఏ వరం కావాలో కోరుకొమ్మన్నాడట. దానికి మార్కండేయుడు ఈ శరీరతోనే అనేక యుగాలు జీవించి ఉండేటట్లుగా వరమడిగాడు. తథాస్తు అన్నాడు శ్రీహరి. ఆ రకంగా మార్కండేయుడు చిరంజీవి అయినాడు. ప్రళయము సంభవించి లోకాలన్నీ జలమయమైపోయినప్పుడు మార్కండేయుడు ఒక్కడే జీవించి ఉంటాడు. వటపత్రశాయి అయిన హరికి నమస్కరించి, ఆయన శరీరంలో ప్రవేశించి అనేక సంవత్సరాలు ఆ శరీరం లోపలే తిరిగిన మహానుభావుడు. (మార్కండేయుడు సప్తర్షుల దీవెన వలన, బ్రహ్మ దీవెన వలనా మరియు శివారాధన వలన చిరంజీవి అయ్యాడనే కథకూడా లోక విదితము)

అతసీపుష్ప సంకాశః శ్రీవత్సకృత లక్షణః
సాక్షాత్ లక్ష్మ్యా ఇవ సదా ప్రతిభాతిమే
శ్రీవత్స వక్షచిహ్నము కలిగిన ఆ నీలికలువ రంగు దివ్యమూర్తి నాకెప్పుడూ లక్ష్మీనిలయునిగా ప్రకాశించుచుండును.

తస్య తామ్ర తలౌ తాత! చరణౌ సుప్రతిష్ఠితౌ
సుజాత మృదు రక్తాభిః అంగుళీభిః అలంకృతౌ
ప్రణతేన మయా మూర్ధ్నా గృహీత్వాహ్యభివందితౌ – మహాభారతము. వానప్రస్థ పర్వము.188.13
తాతా! ఆయన పాదములు మృదువుగా, ఎఱ్ఱని అంచులతో, అలంకరింపబడిన వ్రేళ్ళతో శోభించుచుండెను. నేను ఆయనకు ప్రణమిల్లి పూజించునపుడు ఆ దివ్యమంగళ చరణారవిందములు నా శిరస్సుపై నుంచబడినవి.

క్రితము నామము 'అదృశ్యుడు' అనగా చక్షురింద్రియములకు గోచరము కానివాడు. ఈ నామము 'వ్యక్తరూపుడు' అనగా ఇంద్రియ బంధములను అధిగమించిన భక్తులకు స్పష్టముగా కనుపించువాడు. అవతారమూర్తియై, అర్చామూర్తియై, స్వయంభువై, సాలగ్రామరూపుడై, గురువై, ఆత్మబంధుడై ఆదుకొను సర్వాంతర్యామి. 'అదృశ్యోవ్యక్తరూపశ్చ' లోని 'చ' ప్రత్యయము ఈ రెండు నామములందలి విభిన్నత్వమును అనుసంధానము చేయుచున్నదని శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరించారు.

ఊహాకందని గుణరూప సంపన్నుడు గనుక అదృశ్యుడు. అంతర్యామియై అన్నింటియందు స్థితుడైనందున వ్యక్తరూపుడు – అని ధర్మచక్రము రచయిత వివరించారు.

307. సహస్రజిత్

- వేలాది యుగములను జయించువాడు (శ్రీ భట్టుల వ్యాఖ్య).
- వేలాది రాక్షసులను జయించువాడు (శ్రీ శంకరుల వ్యాఖ్య).

ఓం సహస్రజితే నమః

సహస్ర యుగ సంఖ్యాకం సర్వ కల్పాన్తమేవ హి

శయాన ఏవ జయతి సహస్రజిదితి స్మృతః

ప్రళయమున జగములన్నీ నశించినా భగవంతుడు యోగనిద్రలోనుండును. కాలము అన్నింటినీ అధిగమించును. అన్నింటినీ జయించును. యుగాంతమున సమస్తము లయమగును. కాని యుగాదికర్తయైన ఆ కాలస్వరూపుడు మాత్రము కాలమునకు అందరానివాడు. యుగములతో నిమిత్తము లేనివాడు. కల్పములు గడచినను వటపత్రశాయియై వెలుగొందువాడు.

వేలసంఖ్యలో రాక్షస గణములను సంహరించినవాడు. శ్రీరాముడు తానొక్కడై పదునాలుగువేల రాక్షసులను సంహరించిన విధము రామాయణమున వివరింపబడియున్నది. అంతే కాదు. హరినామ స్మరణ కీర్తనలు సకల దుష్టచింతనలను, పాపములను నశింపజేయును.

రామో రాజమణిస్సదా విజయతే – రామం రమేశం భజే

రామేణాభిహతా నిశాచరచమూ – రామాయ తస్మై నమః

రామాన్నాస్తి పరాయణం పరతరం – రామస్య దాసోస్మ్యహమ్

రామే చిత్తలయ స్సదా భవతు మే – భో రామ మాముద్ధర

308. అనంతజిత్

- అంతులేని విజయములు గలవాడు.

- అవధులు లేకుండా ప్రకాశించేవాడు.

ఓం అనంతజితే నమః

అంతా శ్రీమన్నారాయణుని అధీనములోనుండును. అన్ని ప్రాణులు, అన్ని యుగములు, అన్ని కాలములు ఆయన ఆజ్ఞానుసారము వర్తించును. అన్ని అవతారములందును ఆయనే జయించును.

(డా. క్రోవి పార్థసారథి రచన 'శ్రీకైవల్యసారథి'నుండి)

మతస్య శిశురూపస్య కదా చిత్కశ్చిదేవ హి

కథంచిత్ అవధిర్నాస్తి మహిమ్నః పరమాత్మనః

తస్మాదీ ననన్తజిదితి వస్వర్ణో జయదోమనుః

శిశురూపము గాని, మరేదైనా రూపము గాని తన యిష్టానుసారము ధరించి అవధులు లేకుండా ప్రకాశించు పరమాత్ముడు. ఈ నామము అష్టాక్షరీమంత్రము. జయమును కలుగజేయును.

అనంతం పరిమిత శిశురూపస్య మహిమావధిం జయతి

అభిభవతీతి అంతజిత్ న అంతజిత్ అనంతజిత్

అతడు చిన్నవాడైనప్పటికీ తన మహిమ ఏమిటో ఎవరికీ తెలయకుండా ప్రకాశించేవాడు. ఊహించనలవికాని శక్తిమంతుడు కాబట్టి యుద్ధక్రీడలయందు అనంతభూతములను జయిస్తాడు.

అనూహ్యమైన శక్తిసామర్ధ్యములు కలిగి రణరంగములో అందరినీ జయించే శక్తిసామర్ధ్యాలు గలవాడు. పరమేశ్వరుడు. సత్యస్వరూపుడు. కాబట్టి విజయం అతనిదే. జీవులయొక్క పాపములను ప్రక్షాళన చేసి, వారందరికీ కైవల్యము ప్రసాదించేవాడు. కాబట్టి 'అనంతజిత్' అనబడుచున్నాడు. అసంఖ్యాకమైన భక్తుల హృదయాలలో రమించువాడై వారిని తనవైపు మరలించుకొను శక్తి కలవాడు కాబట్టి 'అనంతజిత్' అనబడుతున్నాడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

ఇష్టోఽవిశిష్టః శిష్టేష్టః శిఖండీ నహుషో వృషః |
క్రోధహా క్రోధకృత్కర్తా విశ్వబాహుర్మహీధరః || (34)

309. ఇష్టః

- అందరకును ప్రియమైనవాడు. జగదానంద కారకుడు.

- ఇష్టి (యజ్ఞము)నందు అర్చింపబడువాడు.

ఓం ఇష్టాయ నమః

శ్రీహరియేసచ్చిదానంద స్వరూపుడు. సర్వప్రియుడు. చెలుడై, చుట్టమై, ఆర్తత్రాణ పరాయణుడై, కోరికలీడేర్చువాడై, అందమునకందమై, అందరికిని ప్రియమైనవాడు. శాశ్వతానందమూర్తియైన శ్రీదేవుని ధ్యానించినవారికి మరేమియును ఇష్టము కాదు. అని ధర్మచక్రము రచయిత వ్యాఖ్యానించారు. **అంబుజోదర దివ్యపాదారవింద చింతనామృత పాన విశేష మత్త చిత్తమేరీతి నితరంబు చేరనేర్చు?**

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి – 'ఇష్టః' అను శబ్దమునకు యజ్ఞము అనియును అర్థమే. యజ్ఞము విశ్వకళ్యాణార్థము, ఈశ్వర ప్రీతికొరకు, పరోపకారార్థమై, నిష్కామముగా చేయబడు సాత్వికపుణ్యకర్మ. ఇట్టి పుణ్యవ్రతారాధనా కర్మలచేత ఆరాధింపబడేవాడు గనుక 'ఇష్టః' అనబడును. నిష్కామకర్మానుష్టానము ఈశ్వరప్రాప్తికి సాధనము.

310. అవిశిష్టః / విశిష్టః

- అందరినీ సమముగా కాపాడువాడు.

- అన్నింటియందు స్థితుడై, వేరుగా తెలియజాలని, అంతర్యామి.

- అసమానుడు.

ఓం అవిశిష్టాయ నమః

ఓం విశిష్టాయ నమః

తల్లివలె, భేదభావము లేకుండ, అందరినీ సమానముగా రక్షించువాడు గనుక భగవానుడు అవిశిష్టుడు. భగవానుడు సర్వాంతర్యామి. సకల ప్రాణులయందు, భూమియందు, అగ్నియందు, వాయువునందు, ద్యులోకమున, ఆదిత్యలోకమున, చంద్రునియందు, దిగంతరాళమున, అంధకారమున, తేజస్సునందు ఉండి వానిని నియంత్రించును. కాని వాటికి ఆయన తెలియదు. వాటికి, ఆయనకు భేదము మనకు తెలియదు.

శ్రీ భట్టులు 309, 310 నామములను కలిపి '**అవిశిష్టఃఇష్టః**' అనే ఒకే నామముగా పరిగణించినట్లు కొన్ని వివరణా గ్రంధములలో ఉన్నది – సకల జీవులందు భేదభావము చూపక, తల్లివలె అందరిని రక్షించువాడు – అని ఈ ఏకనామమునకు అర్ధము.

రెండూ వేరువేరు నాములుగా పరిగణించినవారిలో కూడ కొందరు 310వ నామమును '**అవిశిష్టః**' అని కాక '**విశిష్టః**' అని స్వీకరించారు (శ్రీ చిన్మయానంద). 'విశిష్టః' అనగా ప్రత్యేకమైనవాడు, సాటిలేనివాడు, మహానుభావుడు, పరమ పవిత్రుడు.

311. శిష్టేష్టః

- శిష్టులకు (సాధుసజ్జనులకు) ఇష్టమైనవాడు.
- శిష్టులపట్ల మిక్కిలి ప్రేమ గలవాడు.

ఓం శిష్టేష్టాయ నమః

మార్కండేయ ద్విజాదీనాం పండితేష్వగ్రయాయనాం
ఉత్కృష్ట పురుషార్థత్వే నేష్ట శిష్టేష్ట ఉచ్యతే
శిష్టాచార సంపన్నులైన మార్కండేయాది మహర్షులచే ఉత్కృష్టమైన పురుషార్థముగ ప్రార్థింపదగినవాడు.
శిష్టానామ్ ఇష్టః శిష్టేష్టః – శిష్టులనగా సదాచార సంపన్నులు, సత్ప్రవర్తనులు, శీలసంపన్నులు, సాధుసజ్జనులు, పుణ్యాత్ములు. వారికి భగవంతునికంటె ప్రియమైనది లేదు. హరికథాచింతనమే వారికి జపము, తపము, మోక్షమార్గము, పరమార్థము.

భగవంతునకు కూడ శిష్టులపట్ల ప్రేమ అపారము. అందువల్లనే ఆయన తిరుక్కచ్చినంబికి గొడుగుపట్టెను. అనంతాళువారికి మట్టి మోసెను.

శ్రీ శంకరులు గీతనుండి ప్రమాణము చెప్పారు.

చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున

ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ – గీత 7.16

ఓ భరత శ్రేష్ఠ! అర్జున! శుభకర్మలను ఆచరించుచు సుఖసంపదలను కోరుకొనువారు (అర్థార్థులు), శారీరిక మానసిక సంతాపములకు గురియైన ఆర్తులు, ఐహిక విషయములపై ఆసక్తిని వీడి పరమాత్మ తత్వజ్ఞానమును పొందుటకు ఇచ్ఛగలవారు (జిజ్ఞాసువులు), పరమాత్మ ప్రాప్తినందిన జ్ఞానులు అను చతుర్విధ భక్తులు నన్ను భజింతురు.

తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే

ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమహం స చ మమ ప్రియః – గీత 7.17

ఈ చతుర్విధ భక్తులలో నిరంతరము నాయందే ఏకీభావ స్థితుడై, అనన్య భక్తియుతుడైన జ్ఞాని అత్యుత్తముడు. ఏలనన, వాస్తవముగ నన్ను (నా తత్వమును) తెలిసికొనిన <u>జ్ఞానికి నేను మిక్కిలి ఇష్టుడను. అతడును నాకు మిక్కిలి ఇష్టుడు.</u>

ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్

ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ – గీత 7.18

ఈ చతుర్విధ భక్తులును ఉదారులే (అనగా భగవంతునియందు విశ్వాసమునుంచి, ఎల్లప్పుడు అతనినే సేవించుచు ఉండువారు). కాని జ్ఞానియైనాడు నా స్వరూపమే. ఇది నా అభిప్రాయము. ఏలనన అట్టి భక్తుడు తన మనస్సును, బుద్ధిని నాయందే స్థిరముగా ఉంచి, నన్నే పరమప్రాప్యునిగా భావించును. ఈ విధముగా అతడు నాయందే స్థితుడు.

బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే

వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః – గీత 7.19

అనేక జన్మల పిదప జ్ఞానియైనవాడు (భగవత్తత్వమును ఎఱిగినవాడు) సర్వమూ వాసుదేవమయమేయని భావించి నన్ను శరణు పొందును. అట్టి మహాత్ముడు లభించుట అరుదు.

శ్రీ వి.వి. రామానుజన్ గారు తిరుప్పావై (6)నుండి ఉదాహరించారు.

వెళ్ళత్తరవిల్ తుయి లమర్ న్ద విత్తినై

ఉళ్ళత్తుక్కొణ్డు మునివర్ గళుమ్ యోగిగళుమ్

మెళ్ళ వెళున్దు అరియెన్ఱ పేరరవమ్

ఉళ్ళమ్ పుగున్దు కుళిర్ న్దేలో రెమ్బావాయ్

ఓ దయామయా! పాలమున్నీటిలో, మీగడ పొత్తిళ్ళలో హాయిగా బజ్జున్న ఓ బుజ్జి నారాయణా! యోగులు కూడా తమ గుండెల్లో దాచుకుని చూచుకొనే ఓ ప్రాణదీపమా! చెవులారా నీ నామమే విందు చేస్తున్నదయ్యా

ఓ నల్లనయ్యా! నా కన్నయ్యా! ఎంత హాయిరా! నన్ను గన్న తండ్రీ! స్వామీ! నీకు నిత్యశుభమంగళ మగుగాక! అంటున్నదీ ఆరవ పాశురంలో గోదాకన్య. (డా. వేదవ్యాస గారి 'తిరుప్పావై - ధనుర్మాస పారాయణ గ్రంధం' నుండి గ్రహించిన తెలుగు అనువాదము. వేద విశ్వవిద్యాలయం వారి ప్రచురణ.)

312. శిఖండీ

- దివ్యతేజోమయుడు. వెల్లి విరిసిన తేజముగల ప్రభువు.
- నెమలి పింఛమును ధరించినవాడు.

ఓం శిఖండినేనమః

'శిఖండము' అనగా జుట్టు ముడియని, నెమలి పింఛమని అర్థములు. మొదటి అర్థమును శిఖాగ్రస్థానము అని కూడ అన్వయింపనగును. శ్రీ భట్టులు ఈ భావములో వ్యాఖ్యానించారు. శ్రీహరియే దేవదేవుడు. తేజములకు తేజము. అన్ని ఐశ్వర్యములకు అగ్రస్థానము. దివ్యతేజమే ఆయన ఆభరణము.

అత్య ప్రధృష్య మైశ్వర్యం పరం యత్తేజ అస్థితమ్
తచ్ఛఖణ్డస్తు యస్యాప్తి తచ్ఛిఖణ్డీతి చక్ష్యతే
అపరిమితమైన. ఎవరికీ ఎదిరించడానికి వీలుకాని ఐశ్వర్యము గలవాడు శిఖండి.

శిఖండః అస్యాస్తీతి శిఖండీ – తిరస్కరింపజాలని ఐశ్వర్యము, తేజము కలవాడు శిఖండి. **ఆసీనమ్ తం నరవ్యాఘ్రం పశ్యామ్యమిత తేజసమ్** – అమితమైన తేజస్సు ఆభరణంగా ధరించి ఆ పరమేశ్వరుడు ప్రకాశిస్తున్నాడు.

నల్లనయ్య శిఖిపింఛమౌళి గనుక శిఖండియని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. **గోపవేష ధరస్య శిఖండః అలంకారః అస్య** – గోపవేష ధరుడగు ఇతనికి నెమలి పింఛము (శిఖండము) అలంకారముగానున్నది. గోపాలబాలుడు మౌళిపరిసర్పిత పింఛమువాడు. సుధారసమ్ము పై జల్లువాడు. పద్మనయనమ్ముల వాడు. నల్లనివాడు. నవ్వు రాజిల్లెడు మోమువాడు. దివ్యమంగళ స్వరూపుడు. కటి వరద హస్తములతో ఏడుకొండలపై వెలసిన కోనేటిరాయుడు. భద్రాద్రి రాముడు. శ్రీనారసింహుడు. వటపత్రశాయి.

గోపికలు ప్రేమారుణ నేత్రములతో ఇట్లనుచున్నారు –

ఏమాశ్చర్యము! ఎల్లెడల ఆ శ్యామసుందరుని శ్యామశోభలే ప్రతిఫలించుచున్నవి. ఏమాశ్చర్యము! ఏమాశ్చర్యము! ఎచట చూచినను ఆ శ్యామసుందరుని దివ్యమంగళ విగ్రహమే! ఈ లతా నికుంజములలో కన్నయ్య విహార లీలలే కనబడుచున్నవి. యమునానది యందును ఆ కృష్ణుడే విహరించుచున్నాడు. వినీలాకాశమునందును,

నీలమేఘములయందును కృష్ణుడే గోచరించుచున్నాడు. అణువణువునను శ్రీకృష్ణుడే వ్యాపించియున్నాడు. ఏమాశ్చర్యము! నేను వెఱ్ఱిదాననైతినా! అనె ఒక గోపిక.

అందరి కనుపాపలలోను కృష్ణుడే వసించుచున్నాడేమి? నిండారిన పండు వెన్నెలలోను, శరద్రాత్రులందును శ్రీకృష్ణ రాసలీలలే కన్పించుచున్నవి. అరుణ కిరణములయందును కృష్ణుడే భాసించుచున్నాడు. మృగసౌరభములును శ్రీకృష్ణ పరిమళములనే వెదజల్లుచున్నవి. పురులు విప్పి నాట్యమాడు నెమళ్ళలోను శ్రీకృష్ణుడే కన్పట్టుచున్నాడు. భూమండలమంతయును శ్రీకృష్ణ శోభాంచితమే. వేదాక్షరములన్నియును శ్రీకృష్ణునే స్తుతించుచున్నవి. దీపశిఖలయందును శ్రీకృష్ణప్రభలే వెలుగుచున్నవి.

ఆ నిర్వికార పరబ్రహ్మమే శ్రీకృష్ణుడై దర్శనమిచ్చుచున్నాడు. వేయేల? **సర్వం కృష్ణమయం జగత్.**
(శ్రీ జయదయాల్ గోయందకా – 'గీతా తత్వ వివేచనీ వ్యాఖ్య'లో ఉదాహరించినది.)

---

313. నహుషః

తన మాయచే జీవులను బంధించువాడు.

ఓం నహుషాయ నమః

'నహుషము' అనగా బంధనము. **జీవాన్ స్వమాయయా నిత్యం నహుష్యే నహ్యతీతియః – నహ్యతి బధ్నాతీతి నహుషః** – మాయామేయ జగంబున సర్వము భగవంతుని ఇచ్ఛానుసారమే వర్తించును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు తన సౌందర్యముతోను, సౌలభ్యముతోను సమస్తమును బంధించును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – అంతయును ఆయనకు లోబడియుండును. కనుక ఆయన నహుషుడు. ఆ బంధమే గ్రహగతులను నిర్దేశించును. నక్షత్రమండలమును నిలువరించును. తల్లికి బిడ్డపై ప్రేమను కలుగజేయును. సాగర కెరటములను తీరమువద్ద ఆపివేయును. దేహములోని భాగములన్నింటి చేతను ఒక రీతిగా పని చేయించును. జ్ఞానము, సౌఖ్యము, మోహములతో ఆత్మను శరీరమున బంధించును.

త్రిభిర్గుణమయైర్భావైరేభిః సర్వమిదం జగత్
మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ – గీత 7.13

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా
మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే – గీత 7.14

ఈ జగత్తు, అనగా ప్రాణి సముదాయము అంతయును గుణములయొక్క కార్యరూపములైన సాత్త్విక, రాజస, తామస అను త్రివిధ భావములచే మోహితమగుచున్నవి. కనుక త్రిగుణములకు అతీతుడను, శాశ్వతుడను అయిన నన్ను ఆ ప్రాణులు తెలిసికొలేకున్నవి. నా మాయ త్రిగుణాత్మకమైనది. అలౌకికమైనది. ఇది అధిగమించుటకు సాధ్యము కానిది. కాని కేవలము నిరంతరము నన్నే భజించువారు ఈ మాయను అధిగమించి, సంసార సముద్రమునుండి బయటపడగలరు.

314. వృషః

- సంసార తాపమున బాధితులైనవారిపై ఉపశమనమును వర్షించు అమృతమయుడు (వృష్ – వర్షించుట).
- భక్తులకు కామితార్థములను వర్షించువాడు.
- ధర్మస్వరూపుడు (వృష – ధర్మము).

ఓం వృషాయ నమః

'వృష' శబ్దమునకున్న వేర్వేరు అర్థముల కారణంగా ఈ నామమునకు వివిధ వ్యాఖ్యలు లభించాయి.

సాగరస్యోదరే నిత్యం వసన్నమృత రూపయా
స్వదేహ కాన్త్యా వా చాపి సమ్యగాశ్వాస యన్ముహుః
బహుశప్సించయతి యః వృషస్స పరిపఠ్యతే
నిత్యము సముద్రగర్భంలో నివసించువాడై, అమృతాన్ని పోలిన దేహకాంతులతోను, మధురమైన మాటలతోను మార్కండేయాది మహర్షులను ఊరడిల్లజేయువాడైన వటపత్రశాయి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **కామాన్ వర్షణాత్ వృషః** – కోరుకున్నవారికి కోరినంత ప్రసాదించువాడు. కొండలంత వరములు గూపెడువాడు. మమ్మేలిన కులదైవము. ఆపదమ్రొక్కులవాడు.

శ్రీ శంకరులు మహాభారతము (శాంతిపర్వము 330.23) ప్రమాణముగా 'వృషః' అనగా 'ధర్మస్వరూపుడు' అనే అర్థాన్ని కూడా చెప్పారు.
వృషోహి భగవాన్ ధర్మః స్మృతో లోకేషు భారత
నైఘంటుక పదాఖ్యానైర్విద్ధి మాం వృష యిత్యుత
అర్జునా! నిఘంటుకారులు చెప్పిన ప్రకారము 'వృష' అనగా 'ధర్మము'. భగవంతుడు ధర్మస్వరూపుడు. కనుక నేనే 'వృషః'

తరువాతి 8 నామములను శ్రీపరశురామావతారమును స్మరించు నామములుగా శ్రీ భట్టులు వివరించారు.

చిన్న తిరుపతిలోని శ్రీ పరశురామ శిల్పం

315. క్రోధహా

- క్రోధమును పరిత్యజించినవాడు (శ్రీ భట్టుల వ్యాఖ్య).
- సాధువులందు క్రోధమును నశింపజేయువాడు (శ్రీ శంకరుల వ్యాఖ్య).

ఓం క్రోధఘ్నే నమః

క్రోధమ్ హన్తీతి క్రోధహా

కాశ్యపశ్య ప్రార్థనయా యః క్రోధం క్షత్రహానిదం
హతవాన్ క్రోధహా ప్రోక్తః షడర్ణో క్రోధనాశకః

ఆయన ధరించిన క్రోధమువలన 21మార్లు దండయాత్ర జరిపి క్షత్రియులను నాశనము చేసెను. అట్టి క్రోధమును, కాశ్యపమహర్షి ప్రార్థనతో ఉపశమింపజేసుకొనిన వాడైన పరశురాముడు 'క్రోధహా'. ఈ నామము క్రోధమును నశింపజేయు షడక్షరీమంత్రము. ఓం క్రోధఘ్నే నమః.

ఇదే వ్యాఖ్యను శ్రీ వి.వి. రామానుజన్ గారు దివ్యప్రబంధమునందలి ఉదాహరణలతో వివరించారు. పెరియ తిరుమొళి 8.1.6 – **మళువినాల్ అవని అరశై మూవెడుకాల్ మణిముడి పోడి పడుత్తు యుదిరిక్ – కుళువార్ పునలిల్ కుళిత్తు వెన్ కోపమ్ తవిర్ న్దవాన్.**

శ్రీరాధాకృష్ణశాస్త్రి వివరణ – భగవానుడు శుద్ధసత్వస్వరూపుడైనను సంకల్పమాత్రముననే కోపమును ధరించును, నియంత్రించును, త్యజించును. శ్రీరామావతారమున ఆయన కోపమును పూనిన పెక్కు సందర్భములు వర్ణింపబడినవి. **రోషమ్ ఆహారయత్ తీవ్రమ్** (3.30.19) – **క్రోధస్య వశమేయివాన్** (6.59.136).

శ్రీ శంకరుల వ్యాఖ్య – సాధుసజ్జనులకు కోపము భయంకరమైన శత్రువు. తీరని కోరికలే అందుకు కారణము. కోరికలను జయించినవారికి క్రోధము దూరమగును. ఆ విధముగా వారి కోపమును నాశనము చేయువాడు గనుక శ్రీహరి 'క్రోధహా'.

శ్రీ పరమహంస ప్రవచనములను ఉదాహరిస్తూ ధర్మచక్రము రచయిత కోపమును జయించుటకు చెప్పిన ఉపాయము – బుసకొట్టు, కాని కరవవద్దు – అనగా క్రోధము వలన ఎవరికీ హాని జరుగకుండా జాగ్రత్త పడవలెను.

316. క్రోధకృత్

- కోపమును వహించినవాడు.

- కోపమును కలుగజేయువాడు.

ఓం క్రోధకృతే నమః

పరశురామావతారమున కార్తవీర్యునిపై కోపించి, క్షత్రియులను దునిమినవాడు (పిదప కోపమును పరిత్యజించినవాడు).

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అసాధుషు క్రోధమ్ కరోతి ఇతి క్రోధకృత్** – దుర్జనులయందు క్రోధము ప్రజ్వరిల్లుటకు కారణము భగవానుడే. అలా కోపము కారణంగా ఆ దుర్జనులు తమను తాము నాశనము చేసుకొందురు.

317. కర్తా

- (కార్తవీర్యుని) తెగనరికినవాడు (శ్రీ భట్టులవ్యాఖ్య).

- జగత్తునకు కర్త (శ్రీ శంకరుల వ్యాఖ్య)

ఓం కర్త్రే నమః

ఈ నామము రెండుమార్లు స్తుతింపబడినది.

34వ శ్లోకము. 31వ నామము. కర్తా – **క్రోధహా క్రోధకృత్ కర్తా విశ్వబాహుః మహీధరః**

41వ శ్లోకము. 382వ నామము. కర్తా – **కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః**

కృద్ధేతో కార్తవీర్యస్య ఛేత్తా కర్తేతి శబ్ద్యతే – తన కోపమునకు కారణమైన కార్తవీర్యునికి కోపము తెప్పించి, అతనితో యుద్ధము చేసి, అతని చేతులను తెగనరికినవాడు కర్త.

క్రియతే ఇతి కర్మ, జగత్ తస్య కర్తా – జగత్తును తయారు చేసినవాడు కర్త.

316, 317 నామములకు వేరువేరుగా అర్థములు చెప్పిన పిదప శ్రీ శంకరులు ఈ రెండింటిని ఒకే నామముగా '**క్రోధకృత్కర్తా**' అనికూడ పరిగణింపవచ్చునని వ్యాఖ్యానించారు. వేయి నామములు సంఖ్య సరిగా వచ్చుటకు కావచ్చును – శ్రీ శంకరుల భాష్యమునందు 'క్రోధకృత్కర్తా' అని, శ్రీ భట్టుల భాష్యమునందు 'క్రోధకృత్', 'కర్తా' అని లెక్కింపబడినవి.

క్రోధకృత్కర్తా

సజ్జనులకు అపకారము చేయు దుష్టులపట్ల కోపము వహించువాడు.

ఓం క్రోధకృత్కర్త్రే నమః

క్రోధ కృతమ్ దైత్యాదీనామ్ కర్తా చేదక ఇతి ఏకనామః.

శ్రీ సత్యదేవోవాసిష్ఠ గారి వ్యాఖ్య – **క్రోధమ్ కరోతి ఇతి క్రోధకృత్. క్రోధకృతమ్ కృన్తతి చిన్తతి హన్తి వా క్రోధకృత్కర్తా.**

318. విశ్వబాహుః

- దుష్టులను శిక్షించుటకై వ్యాపించిన బాహువులు గలవాడు.
- అనంత బాహువులు కలిగి, సమస్తమును సంరక్షించువాడు.

ఓం విశ్వబాహవే నమః

లోక కంటకులను తొలగించుటకు విస్తరించిన చేతులు కలిగినవాడు గనుక భగవానుడు విశ్వబాహువు. అధికార మదాంధులైన 21 తరముల క్షత్రియులను నిర్జించిన భార్గవరాముడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుడు అనంతబాహుడైన విరాట్పురుషుడు. అంతటా వ్యాపించిన ఆయన బాహువులు సమస్త కార్యములను నిర్వహించును. సజ్జనులను రక్షించును.
విశ్వతో బాహుః (శ్వేతాశ్వరోపనిషత్తు 3.3). అంతా ఆయనపైననే ఆధారపడియున్నది.

(శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము) దుష్టులను శిక్షించుటకును, (శ్రీ శంకరుల వ్యాఖ్య ప్రకారము) సజ్జనులను రక్షించుటకును సర్వత్ర విస్తరించిన అనంతమైన బాహువులు కలిగినందున భగవానుడు విశ్వబాహువు.

ధర్మచక్రము రచయిత – మనము మన చేతులతో కర్మలు నిర్వహించుదుము. సృష్టి, స్థితి, లయాది సకల కార్యములు నిర్వహించువాడు భగవంతుడు గనుక విశ్వబాహువు. పరోపకారార్థమై మనము మన చేతులను ఉపయోగింపవలెనని ధర్మచక్రము రచయిత సందేశము.

విశ్వతశ్చక్షురుత విశ్వతోముఖో విశ్వతో బాహురుత విశ్వతస్పాత్
సంబాహుభ్యాం ధమతి సంపత త్రైర్ ద్యావా పృథివీ జనయన్ దేవ ఏకః

319. మహీధరః

- భూ భారమును తగ్గించి, భూమిని ధారణ చేయువాడు.
- సకల పూజలను స్వీకరించువాడు.

ఓం మహీధరాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

34వ శ్లోకము. 319వ నామము. మహీధరః – **క్రోధహా క్రోధకృత్కర్తా విశ్వబాహుః మహీధరః**

40వ శ్లోకము. 371వ నాము. మహీధరః – **మహీధరో మహాభాగో వేగవానమితాశనః**

భారావతరణం కృత్వా గాం ధత్తే స మహీధరః

మహీం ధరతి ఇతి మహీధరః

భూమిపై దుష్టులను నాశనము చేసి, భూమి భారమును తగ్గించి, ధరించువాడు మహీధరుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'మహీ' అనగా 'భూమి' మరియు 'పూజ' అనే రెండు అర్థాలున్నాయి. కనుక రెండు భావములు – భూమిని (ఆదిశేషుడై, శ్రీవరాహమూర్తియై) ధరించువాడు. భక్తుల పూజలన్నింటిని స్వీకరించువాడు. మహీధరుడు.

'ధారణ చేయుట' అనే విషయాన్ని శ్రీ చిన్మయానంద ఇలా వివరించారు – వస్త్రమునకు ప్రత్తి, ఆభరణమునకు స్వర్ణము, కుండకు మట్టి ఆధారమనవచ్చును. మరొక విధముగా వీనికి భేదము లేదనవచ్చును. అదే విధముగా భగవంతునకు, లోకమునకు భేదము లేదు. సర్వలోకములు జగదాధారుని విభూతులే.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః |
అపాం నిధిరధిష్ఠానమప్రమత్తః ప్రతిష్ఠితః || (35)

320. అచ్యుతః

- తన మహామహిమ నుండి ఎన్నడును చ్యుతి (పతనము) లేనివాడు.
- తన భక్తులను వీడనివాడు.
- షడ్వికార రహితుడు, శాశ్వతుడు, పరిణామమునకు అతీతుడు

ఓం అచ్యుతాయ నమః

ఇదే నామము ఇంతకుముందు 101వ నామముగా వచ్చెను. మరల 557వ నామముగా చెప్పబడును.

11వ శ్లోకము. 101వ నామము. అచ్యుతః – **అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాదిః అచ్యుతః**

35వ శ్లోకము. 320వ నామము. అచ్యుతః – **అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః**

59వ శ్లోకము. 557వ నామము. అచ్యుతః – **వేధాః స్వాంగోऽజితః కృష్ణో దృఢః సంకర్షణోऽచ్యుతః**

101వ నామము వివరణలో పొందుపరపని మరికొన్ని ఉదాహరణలు ఇక్కడ చెప్పబడుచున్నవి (శ్రీ కృష్ణమాచారిగారి సంకలనమునుండి మరియు శ్రీకైవల్యసారధినుండియు కూడ).

చ్యవనోత్పత్తి యుక్తేషు బ్రహ్మేన్ద్ర వరుణాదిషు
యస్మాన్నచ్యవతే స్థానాత్ తస్మాత్సంకీర్త్యతేऽచ్యుతః
సా ధర్మేణావతారేऽపి బ్రహ్మేన్ద్ర వరుణాదిభిః
నస్వైశ్వర్యాత్ప్రచ్యుతో యః అచ్యుతః పరికీర్తతః

బ్రహ్మ, ఇంద్రుడు, వరుణుడు మొదలైన దేవతలతో సమానంగా అవతరించినప్పటికీ, వారికిలాగా తరగని చెదరని పదవి, ఐశ్వర్యము గలవాడు అచ్యుతుడు.

శ్రీ వి.వి. రామానుజన్ గారు రామాయణమునుండి ఉదాహరించారు – **మిత్రభావేన సంప్రాప్తమ్ కదాచన దోషో యద్యపి తస్యస్యాత్** – నా స్నేహము కోరి దరిచేరినవానిలో ఏ విధమైన దోషములున్నను అతనిని ఎట్టి పరిస్థితులలోను విడనాడను. దివ్యప్రబంధమునుండి చెప్పిన ఉదాహరణ – **కార్తిగైయానుమ్ కరిముగత్తానుమ్ కనలుమ్ ముక్కణ్ మూర్తియుమ్ మోడియుమ్ వెప్పమ్ ముదుగిట్టు** – బాణాసురుని కథలో అతడు రక్షణకై ఆశ్రయించినపుడు ఇతర దేవతలు దూరమైనారు. కాని శ్రీకృష్ణభాగవతులు ఎన్నడును తమ తోడును కోల్పోరు. **న మే భక్తః ప్రణశ్యతి** (గీత).

విశ్వతః పరమాన్నిత్యమ్ విశ్వం నారాయణగ్ం హరిమ్
విశ్వమే వేదమ్ పురుష స్తద్విశ్వముపజీవతి
పతిం విశ్వస్యాత్మే శ్వరగ్ం శాశ్వతగ్ం శివమచ్యుతమ్
నారాయణమ్ మహాజ్ఞేయమ్ విశ్వాత్మానమ్ పరాయణమ్ – తైత్తరీయారణ్యకోపనిషత్తు.
విశ్వానికి అతీతుడు, విశ్వమే తానుగా అయినవాడు, నిత్యుడు, సర్వవ్యాపకుడు, విశ్వానికి జీవనాధార మైనవాడు, విశ్వపతి, విశ్వానికి ఈశ్వరుడు, శాశ్వతుడు, మంగళకరుడు, నాశనము లేనివాడు, తెలిసికొన దగిన పరమాత్ముడు, విశ్వాత్ముడు, విశ్వపరాయణుడు అయిన నారాయణునకు నమస్కారము.

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి – గీత 6.30
సకల ప్రాణులయందు ఆత్మరూపంలో ఉన్న నన్ను చూడగలిగిన వాడికి, ప్రాణులన్నింటిని నాయందు అంతర్గతంగా ఉన్నట్లు చూసేవాడికి నేను లేకుండా పోను. నాకు అతడు లేకుండా పోడు.

ధర్మచక్రము రచయిత – ముండకోపనిషత్తులోని రెండు పక్షులలో కర్మఫలము ననుభవించునది జీవాత్మ. ఊరకే చూచుచున్న పక్షి సాక్షి, పరమాత్మ. జీవాత్మవలె నాశనము చెందనిది.

అచ్యుతుని శరణుజొచ్చినవానికి భయము లేదు. శ్రీహరి తన భక్తులకు సదా చేయూత నిచ్చుచుండును. ఒక వ్యక్తి సముద్రతీరమున నడుచుచుండేవాడు. ఇసుకలో తన పాదముల గుర్తులకు ప్రక్కనే మరొకరి పాదచిహ్నములను అతడు గుర్తించెను. అవి భగవంతుని అడుగుజాడలని అతడు గ్రహించెను. కొంత కాలమునకు ఆవ్యక్తి దుర్భరమైన కష్టముల ననుభవించెను. ఆ సమయంలో అతనికి ప్రక్కన వేరే అడుగుజాడలు కనిపించలేదు. భగవంతుడా! నాకష్టకాలంలో నాకు తోడు లేకుండా వెళ్ళిపోయావా? – అని అతడు ఆక్రోశించాడు. అప్పుడు భగవంతుడు చెప్పిన జవాబు – ఇప్పుడు నీకు కనిపించే అడుగుజాడలు

నీవి కావు. నావి. నా భక్తులకు కష్టములు దాపురించినపుడు నేను వారి ప్రక్కన నడవను. వారి నా భుజములపై మోసెదను. (http://srivaishnavan.com/)

అచ్యుతుడితడే ఆదియు నంత్యము – అచ్యుతుడే యసురాంతకుడు
అచ్యుతుడు శ్రీవేంకటాద్రిని దానిదే – అచ్యుత అచ్యుత శరణనవో మనసా – అన్నమయ్య కీర్తన

321. ప్రథితః

ప్రసిద్ధి చెందినవాడు. ప్రతిష్ఠగలవాడు.

ఓం ప్రథితాయ నమః

ప్రథ్ – ప్రఖ్యాన్ – ప్రసిద్ధి – అనే మూలమునుండి ఈ నామముయొక్క భావమును గ్రహింపనగును. ఇంతకుముందలి నామము 'అచ్యుతః' అనగా పతనము లేనివాడు, తోడు వీడనివాడు, తరుగు లేని దేవదేవుడు. అలా అచ్యుతునిగా ప్రసిద్ధి చెందినందున శ్రీదేవుని 'ప్రథితుడు' అని నుతింతురు. ఇందుకు పెక్కు ప్రమాణములను చెప్పవచ్చును.

తస్యనామ మహాద్ యశః – తైత్తరీయ నారాయణ 1.9
యశసశ్చ ఏక భాజనమ్ – రామాయణము. కిష్కింధకాండ 15.9
పెరుమై ఉడియా పిరానార్ – తిరువైమొళి 1.6.9
నగర్ ఈల్ పుగళ్లై – తిరువైమొళి 6.10.10

ధర్మచక్రము రచయిత వ్యాఖ్య – ధనము, పదవి వంటి వానివల్ల లభించు ప్రతిష్ఠ తాత్కాలికము. కాని సత్యధర్మవ్రతముల వలన వచ్చు పేరు శాశ్వతము. హరిశ్చంద్రుడు, పాండవులు, ప్రహ్లాదుడు, హనుమంతుడు వంటివారు ఈ విధముగా లోకపూజ్యులైరి. ఇక భగవానుడు సత్యపరాక్రముడు, సత్యము, సత్యకాముడు, సత్యసంకల్పముగలవాడు, సత్యవ్రతుడు. కనుక ఆయన ప్రఖ్యాతి అనితరము, అనంతము, శాశ్వతము. ఆయన ప్రథితుడు. అచ్యుతుడు. భార్గవరాముడు.

అన్నమయ్య కీర్తననుండి –
పాత్రదానోత్సవ ప్రథిత వేంకటరాయ - ధాత్రీశ కామితార్థ ప్రదాయ
గోత్ర విన్మణి రుచిర గాత్రాయ రవిచంద్ర - నేత్రాయ శేషాద్రి నిలయాయతే నమో
నారాయణాయ సగుణబ్రహ్మణే సర్వ - పారాయణాయ శోభనమూర్తయే నమో

322. ప్రాణః

- తన భక్తులకు ప్రాణమైనవాడు (శ్రీ భట్టుల వ్యాఖ్య).

- సకల భూతముల చైతన్యకారకమగు ప్రాణశక్తి (శ్రీ శంకరుల వ్యాఖ్య).

ఓం ప్రాణాయ నమః

67వ, 422వ నామములు కూడా 'ప్రాణః'.

8వ శ్లోకము – 67వ నామము – ప్రాణః - **ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః**

35వ శ్లోకము – 322వ నామము – ప్రాణః – **అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః**

44వ శ్లోకము – 408వ నామము – ప్రాణః – **వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః**

నారాయణుని శరణుజొచ్చిన భక్తులకు ఆయనే ప్రాణము. గోవింద నామ స్మరణయే చేతనత్వము. హరి సేవయే అమృత పానము. అన్ని ప్రాణులయందు స్థితమైన మూలప్రాణము నారాయణుడే.

ప్రాణోవా అహమస్మి – నేను ప్రాణమైయున్నాను – ఐతరేయారణ్యక 2.2.3.

ఉలగుక్కే ఓర్ ఉయిరు మానాయ్ – తిరువైమొళి 6.9.7.

ప్రాణోऽస్మి ప్రజ్ఞాత్మా తన్మాయు రమృత మిత్యుపాస్స్వ – జ్ఞానమయుడనైన నేను ప్రాణముగా ఉందును. అటువంటి నన్ను ఆయుష్షు అనీ, అమృతమనీ అంటారు.

పుంసామ్ జీవిత రూపత్వాత్ ప్రాణ ఇత్యభిధీయతే

జయదేవుని దశావతార స్తుతి నుండి.

క్షత్రియ రుధిరమయే జగదపగతపాపమ్

స్నపయసి పయసి శమిత భవతాపమ్

కేశవ! ధృత భృగుపతి రూప! జయ జగదీశ హరే!

తరువాతి 11 నామములను శ్రీకూర్మావతార పరంగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

జయదేవుని దశావతార స్తుతి నుండి.

క్షితిరతి విపులతరే తవ తిష్ఠతి పృష్ఠే

ధరణిధర కిణ చక్ర గరిష్ఠే

కేశవ! ధృత కచ్ఛప రూప! జయ జగదీశ హరే!

పోతన భాగవతమునుండి

సవరనై లక్ష యోజనముల వెడలుపై కడు గఠోరంబైన కర్పరమున

నదనైన బ్రహ్మాండమైన నాహారించు ఘనతరంబగు ముఖ గహ్వరంబు
సకల చరాచర జంతురాసులనెల్ల మ్రింగి లోగొనునట్టి మేటి కడుపు
విశ్వంబు పై వేఱు విశ్వంబు పైబడ్డ నాగిన గదలనియట్టి కాళ్లు

వెలిగి లోనికి జనుదెంచు విపుల తుండ
మంబుజంబుల బోలెడి యక్షియుగము
సుందరంబుగ విష్ణుండు సురలతోడి
కూర్మి చెలువొంద నొక మహాకూర్మమయ్యె

కమఠంబై జలరాశిన్ జొచ్చి లఘుముక్తాశుక్తి చందంబునన్
నమ దద్రీంద్రమునెత్తె వాసుకిమహానాగంబుతో లీలతో
నమరేంద్రాదులు మౌళి కంపములతో నౌ నౌ గదే బాపురే
కమలాక్షా! శరణంచు భూ దిశలు నాకాశంబునున్ మ్రోయగాన్

323. ప్రాణదః

- ప్రాణములను, బలమును ప్రసాదించువాడు (సురాసురులకు).
- ప్రాణములను హరించువాడు (అసురులకు).

ఓం ప్రాణదాయ నమః

66, 323, 409, 956వ నామములు 'ప్రాణదః'

8వ శ్లోకము - 66వ నామము - ప్రాణదః – **ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః**

35వ శ్లోకము – 323వ నామము – ప్రాణదః – **అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః**

44వ శ్లోకము – 409వ నామము – ప్రాణదః – **వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః**

102వ శ్లోకము – 956వ నామము – ప్రాణదః – **ఊర్ధ్వగః సత్పథాచారః ప్రాణదః ప్రణవః పణః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – క్షీరసాగర మథన సమయమున దేవతలకు తగు బలమునొసగినవాడు.
శ్రీకూర్మరూపధారి.

మరుతాం బలదానాద్ధి సముద్ర మథనే భృశమ్
ప్రాణదశ్చ సముద్దిష్ట కూర్మరూపతయా హి సః

శ్రీ శంకరులు రెండు అర్థములు చెప్పారు.

ద – ఇచ్చుట – దేవతలకు, దానవులకు కూడ ప్రాణములు ప్రసాదించువాడు ప్రాణదుడు.

ద్యాతి – తగ్గించుట – దానవుల బలమును నాశనము చేయువాడు గనుక ప్రాణదుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ గారు ఈ రెండు భావములను మిళితము చేసి ఇలా చెప్పారు – **ప్రాణాన్ దదాతి ద్యాతి ఖండయతి వ స ప్రాణదః** – భగవంతుడు అందరికి ప్రాణములు ప్రసాదించును. సమయము ఆసన్నమైనపుడు ప్రాణములను హరించును.

ధర్మచక్రము రచయిత – మన శరీరములోని అవయవములు, ఇంద్రియములు, మనస్సు – అన్నీ మనలోని ప్రాణశక్తియొక్క చైతన్యమును ప్రతిబింబించు భాగములు. ప్రాణము లేనియెడల ఇవి పని చేయవు. భగవంతుడొసగిన ప్రాణమే అన్ని భావములకు, అన్ని అనుభవములకు, అన్ని కార్యములకు ఆధారము. ఇవన్నీ భగవదారాధనగా భావించి సద్వినియోగపరచుకొనవలయును.

324. వాసవానుజః

- ఇంద్రుని సోదరుడు.
- సర్వాంతర్యామి.

ఓం వాసవానుజాయ నమః

వాసవుడనగా ఇంద్రుడు. ఇంద్రుని తమ్మునిగా అవతరించి, క్షీరసాగర మధనము ద్వారా అమృతమును సాధించుటకు సహాయపడినవాడు గనుక భగవానుడు వాసవానుజుడు. ఈ నామము 153వ నామమైన 'ఉపేంద్రః', అనగా వామనావతార నామము కంటె భిన్నమైనదని శ్రీ వి.వి. రామానుజన్ గారు సూచించారు.

ఇంద్రునితో సంబంధము లేకుండా వేరు వివరణను శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు చెప్పారు.

వసతి సర్వత్ర వస్తే సర్వమ్ ఇతి వా వాసుః ఈశ్వరః
వాసోః ఇదమ్ వాసవమ్ సర్వమ్ జగత్
వాసవమ్ జగత్ అనిజాతో (అనుప్రవిష్టో) వాసవానుజః

అనుజాత – అప్రవిష్ట – ప్రవేశించియుండువాడు – సర్వత్ర, అన్ని వస్తువులందు వసించు ఈశ్వరుడు వాసవానుజుడు.

325. అపాంనిధిః

- జలములను ధరించినవాడు / భరించినవాడు.
- సాగర స్వరూపుడు.

ఓం అపాంనిధయే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్యానమునందు శ్రీమహాకూర్మావతార వర్ణన కొనసాగినది.

అపాన్నిధిర్మథ్యమాన మహార్ణవ విధారణాత్ – మహార్ణవము మధనము జరుగుచున్నపుడు శ్రీకూర్మరూపియై మందరగిరినెత్తిన శ్రీహరి జలములను నిలబెట్టినాడు (ధరించినాడు) గనుక ఆయన అపాంనిధి. శ్రీ వి.వి. రామానుజన్ తిరువైమొళి (4.75)నుండి ఉదాహరించారు – **అప్పనే! అళ్ కడలైక్ కడైంద తుప్పనే!**

భగవద్గీత (10.24)లో – **సరసామస్మి సాగరః** – జలాశయములందు నేను సముద్రుడను – అని భగవానుడు చెప్పిన విషయము ఆధారముగా శ్రీ శంకరులు 'అపాంనిధి' అనగా 'సముద్రము' అని వ్యాఖ్యానించారు. **అపో యత్ర నిధయన్తే సః అపాంనిధిః** – జలములు ఎక్కడ సమృద్ధిగా నుండునో అది అపాంనిధి. సముద్రముయొక్క గాంభీర్యము, అసమాన శక్తి ఇవన్నియును భగవంతుని దివ్యైశ్వర్య బల సంపన్నతకు సంకేతములని శ్రీ చిన్మయానంద సూచించారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి, ధర్మచక్రము రచయిత ఈ నామానుభవమును మరింత విస్తారంగా వివరించారు – నదులన్నీ సముద్రమున విలీనమైనట్లే భక్తులు భగవంతుని చేరుకొంటారు. సముద్రమునుండి ఆవిరైన నీరు మేఘములై, వర్షమై, నదులై మరల సముద్రమును చేరినట్లుగా సకల జీవములకు మూలము, అంతము పరమాత్ముడే. సముద్రము చేరిన పిదప అనేకవిధములైన జలములు భేదము లేకుండా కలిసినట్లుగా జీవాత్మలలో తుదకు భేదము సమసిపోవును. బయట ఏరులకు చెరువులకు హద్దులు (గట్లు) ఉండును కాని సముద్రమును విభజింప సాధ్యము కాదు. పైన కల్లోలితముగా కనిపించే సాగరము లోపల ప్రశాత గంభీరము. ఇవన్నీ అపాంనిధి లక్షణాలు.

శ్రీ కూర్మావతార మూర్తి - వికీపీడియానుండి

326. అధిష్ఠానమ్

ఆధారమైనవాడు. నిలబెట్టువాడు.

ఓం అధిష్ఠానాయ నమః

మందరగిరిని కవ్వముగా చేసి, వాసుకిని త్రాడుగా చుట్టి, దేవదానవులు అమృతము కొరకు సాగరమును మధించునపుడు పర్వతము మునిగిపోకుండా కూర్మరూపియై నిలిపినవాడు గనుక భగవంతుడు 'అధిష్ఠానము' – అని వివరిస్తూ శ్రీభట్టులు విష్ణుపురాణము (1.9.88)నుండి ఉదాహరించారు.

క్షీరోదమధ్యే భగవాన్ కూర్మరూపీ స్వయమ్ హరిః

మందరాద్రే అధిష్ఠానమ్ భ్రమతోఽభూత్ మహామునే

ఇంకా

భ్రమమాణమ్ మందరాద్రిం ధృతవాన్ యో మహాబలే

అధిష్ఠానమ్ తమేవాహుః అధిష్ఠాన్ ప్రదో మనుః

శ్రీ శంకరులు మరింత విస్తారమైన అర్థము వ్యాఖ్యానించారు. సమస్త ప్రపంచమునకు ఆధారమైనవాడు, ఉపాదానమైనవాడు అధిష్ఠానము. అన్నింటికీ నెలవు ఆయనే. అంతటినీ నిలుపువాడు ఆయనే. అధిష్ఠానమైనవాడు – **అధిష్ఠన్తి భూతాని.**

మత్ స్థాని సర్వభూతాని – గీత 9.4 – సకలభూతములు నాయందే గలవు.

ఈశావాస్యోపనిషత్తు – **ఈశావాస్యమిదమ్ సర్వమ్ యత్కించ జగత్యాం జగత్** – ఈ జగత్తులో జడము, చైతన్యము రెండు పదార్థాలు కూడా ఆ పరమేశ్వరుని చేతనే ఆవరింపబడియున్నాయి.

అధితిష్ఠతి అస్మిన్నితి అధిష్ఠానమ్ – ఆధారమైనవాడు అధిష్ఠానము.

327. అప్రమత్తః

జాగ్రత్త కలవాడు (ఏమరుపాటు లేనివాడు).

ఓం అప్రమత్తాయ నమః

శ్రీ భట్టుల వివరణ – ఆర్తులైనవారిని కాపాడుటకు సదా అప్రమత్తుడైయుండువాడు. 'ప్రమత్తత' అనగా నిర్లక్ష్యము, సోమరితనము, మాంద్యము. అప్రమత్తుడనగా శరణాగతులను కాచుటకు ఎల్లప్పుడు జాగ్రత్తగా నుండువాడు. **అత్యన్తావహితస్త్రాణే హి అప్రమత్తః ప్రకీర్తితః.**

శ్రీ శంకరుల వివరణ – ప్రమత్తుడు కార్యనిర్ణయములందు పొరపాటు చేయవచ్చును. అప్రమత్తుడు సర్వత్రా, సదా తగు కార్యమును నిర్వహించును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – పాలకడలిని చిలికిన పిమ్మట లభించిన అమృతమును పంచిపెట్టుటలో జాగ్రత్త చూపినందున కూడ భగవంతుని అప్రమత్తుడని సేవింపవచ్చును.

ధర్మచక్రము రచయిత – మనుష్యులు మెలకువగానున్న ఇంటిలో దొంగ దూరడు. అలాగే భగవన్నామ స్మరణయందున్న మనస్సులో చెడు ఆలోచనలు ప్రవేశించవు. అప్పుడు ఇంద్రియ ప్రలోభమునకు అవకాశముండదు. హరినామ సంకీర్తనమే మనకు అన్ని విధములుగా రక్షయని ఈ నామ జపమువలన గ్రహింపనగును.

28. ప్రతిష్ఠితః

తనకు తానే ఆధారమైనవాడు. అన్నింటికిని భగవంతుడే ఆధారము.

ఓం ప్రతిష్ఠితాయ నమః

మందరగిరినెత్తినవానికి వేరు వస్తువు ఆధారము కానేరదు. శక్తి, బలము, మహిమ – అన్నింటిలోను శ్రీమన్నారాయణునకు ఆయనే మూలము, కారణము, ఆధారము. – **సా భగవః క్వ ప్రతిష్ఠిత ఇతి** – ఛాందోగ్యోపనిషత్తు (7.24.1) – భగవంతునకాధారమైనది ఏది? ఆయన స్వీయ మహిమయే.

శ్రీ చిన్మయానంద – విశ్వములో ప్రతిదానికి ఒక కారణముండును. కాని ఆదిమూలమైనవానికి వేరు కారణము లేదు. ఆయన స్వయంభువు. స్వయంప్రకాశకుడు. అజుడు. ప్రతిష్ఠితుడు.

జనులందరి గొప్పతనము వారికున్న బలము, ధనము, వంశము – ఇలా ఏదో ఒకదానిపై ఆధారపడియుండును. కాని ఈ కారణములే అశాశ్వతములు. కనుకనే ధనము, వయసు, బలము, బంధుమిత్రగణము వంటివన్నీ తరిగిపోవుచుండును. కాని శాశ్వతుడైన శ్రీకూర్మావతార స్వరూపుని నమ్ముకున్నవారికి కొదువ లేదు. తరుగు రాదు. శ్రీకృష్ణుని నమ్ముకున్నపుడే పాండవులకు విజయము తథ్యము అయినది.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

స్కందః స్కందధరో ధుర్యో వరదో వాయువాహనః |
వాసుదేవో బృహద్భానురాదిదేవః పురందరః || (36)

329. స్కందః

- శోషింపజేయువాడు (అసురులను).
- అమృతమువలె ప్రవహించువాడు (భక్తులకు).
- సుబ్రహ్మణ్యస్వామి. దేవతల సేనానాయకుడు.

ఓం స్కందాయ నమః

స్కందయతి శోషయతి ఇతి స్కందః – అసురులను, దుష్టులను శోషింపజేయువాడు (ఎండించువాడు, క్షీణింపజేయువాడు) – అని శ్రీ భట్టులు వివరించారు.

స్కందతి – గచ్ఛతి, ప్రసరతి – వెన్నవలె కరుగువాడు. భక్తులపట్ల అమృతమువలె ప్రసరించువాడు – శ్రీ శంకరులు చెప్పిన వ్యాఖ్యలలో ఇదియొకటి.

గీత 10.24 – **సేనానీనామ్ అహమ్ స్కందః** – సేనాపతులలో నేను స్కందుడను. స్కందుడు అనగా సుబ్రహ్మణ్యస్వామి, కుమారస్వామి, కార్తికేయుడు – శ్రీ రాధాకృష్ణశాస్త్రిగారు ఈ అర్థమును చెప్పారు.

330. స్కందధరః

- దేవతల సేనాపతియగు స్కందుని (కుమారస్వామిని) తన విభూతిగా ధరించినవాడు – శ్రీ భట్టుల వ్యాఖ్య.
- ధర్మపథమును నిలబెట్టువాడు (కాపాడువాడు) – శ్రీ శంకరుల వ్యాఖ్య.

ఓం స్కందధరాయ నమః

గీత (10.24)నందలి – **సేనానీమహమ్ స్కందః** – అనే శ్లోకభాగం ఆధారంగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. స్కందునకు మరొక నామము కార్తికేయుడు. ఇతడు పార్వతీ పరమేశ్వరుల కుమారుడు. షణ్ముఖుడు. 12 చేతులు గలవాడు. దేవతల సేనానాయకుడు. జగత్తులోని సేనాపతులందరిలోను ప్రసిద్ధుడు.

'స్కందః' అనగా మార్గము, ధర్మపథము అనే అర్థంలో శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. ధర్మమును పరిరక్షించెడువాడు, ధర్మమును అనుసరించేవారిని కాపాడువాడు స్కందధరుడు. శ్రీనివాసుడు.

331. ధుర్యః

ధరించువాడు. భారమును వహించువాడు. భరించువాడు. దారి చూపువాడు.

ఓం ధుర్యాయ నమః

'ధుర్' అనగా భారము. బరువును మోయును గనుక ఆయన ధుర్యుడు. శ్రీ కూర్మావతారుడై మందరపర్వతమును మోసిన నగరాజధరుడు. సమస్త విశ్వమును ధరించి, భరించు 'భువనభృత్'. సృష్టి స్థితి లయాది కార్యములను నిర్వహించువాడు. ఆదిశేషుడై భూమిని మోయువాడు. శ్రీవరాహమూర్తియై ధరనుద్ధరించినవాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ చెప్పిన మరొక అర్థము – 'ధుర్' అనగా ముందుభాఘము. అందరకును ముందుండి దారిచూపు మార్గదర్శియైనందున భగవానుడు ధుర్యుడు.

33. వరదః

కొండలంత వరములు గూపెడు కోనేటిరాయడు. అత్యుత్తమమగు ఫలములు ప్రసాదించు భక్తవరదుడు.

ఓం వరదాయ నమః

వరః అభీప్సితః అర్థః, తమ్ దదాతి ఇతి వరదః – వరములనగా కోరుకున్న కోరికలు. వరమనగా శ్రేష్టమైనది అని కూడ అర్థము. భక్తులకు కావలసిన ధర్మార్థకామమోక్షములను ప్రసాదించువాడు శ్రీమన్నారాయణుడే. మరియు వారికి అత్యుత్తములగు ఫలములు ప్రసాదించునది కూడ భగవంతుడే.

ధర్మచక్రము రచయిత తిరుమంగైయాళ్వారువారి పాశురములను ఉదాహరించారు. **నలమ్ తరుమ్ సొల్లై నాన్ కణ్డు కొండేన్ నారాయణా ఎన్నుమ్ నామమ్** – నారాయణుని నామస్మరణమున పొందరానిది ఏమీ లేదు. **కులమ్ తరుమ్ సెల్వమ్ తందిడుమ్ ఎడియార్ పడుతుయార్ ఆయిన ఎల్లామ్ నిలమ్ తరమ్ సెయ్యుమ్ ... ... పెఱ్ఱ తాయినుమ్ ఆయిన సెయ్యుమ్.**

333. వాయువాహనః

- ప్రాణ స్వరూపమగు వాయువుపై సంచరించువాడు. ఆ విధముగా ప్రాణములు నిలుపువాడు.
- సప్త మారుతములను (ఏడు వాయువులను) అన్ని మండలాంతరములందును చలింపజేయువాడు.

ఓం వాయువాహనాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

36వ శ్లోకము. 333వ నామము. వాయువాహనః – **స్కందః స్కందధరో ధుర్యో వరదో వాయువాహనః**

91వ శ్లోకము. 860వ నామము. వాయువాహనః – **ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః**

సమస్త ప్రాణములకు ఆధారమగునది వాయువు. ఆ వాయువును నడిపించు సారథియైనందున శ్రీమహావిష్ణువే వాయువాహనుడు. **మేడగుమ్ అయింపెరుమ్ భూతముమ్ నీయే** (తిరువెళుక్కూట్టిరుక్కై) –పంచ భూతములను అదుపులోనుంచువాడవు నీవే.

ధర్మచక్రము రచయిత – ప్రాణములను నిలుపు వాయువు మనకు ఎంత అవసరమో తెలిసికొని, ఆ వాయువును అందజేయు వాయువాహనుని ధ్యానించవలయును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – సప్త మండలాంతరములందు చలించు ఏడు విధములైన వాయువులను యథాక్రమముగా సంచరింపజేయువాడు గనుక శ్రీమహావిష్ణువే వాయువాహనుడు. **వాయుమ్ వాహయతీతి వాయువాహనః**.

కశ్యప, దితిల సంతానమైన సప్తమరుత్తులను వివిధ మండలములందు వ్యాపించిన వాయువులకు అధిపతిగా భగవంతుడు నియమించెను. ఈ వాయువుల ప్రభావము (ఒత్తిడి) వలన గ్రహ నక్షత్రాదులు తమ నిర్ణీత మార్గములందు సంచరించును.

ఏడు విధములైన వాయువులు

(1) ఆవహ వయువు – మేఘమండలమునకు, భూమండలమునకు మధ్య ప్రసరించునది.
(2) ప్రవహ వాయువు – సూర్యమండలమునకు, మేఘమండలమునకు మధ్య ప్రసరించునది.
(3) అనువహ వాయువు – చంద్రమండలమునకు, సూర్యమండలమునకు మధ్య ప్రసరించునది.
(4) సంవహ వాయువు – నక్షత్ర మండలమునకు, చంద్రమండలమునకు మధ్య ప్రసరించునది.
(5) వివహ వాయువు – గ్రహమండలమునకు, నక్షత్రమండలమునకు మధ్య ప్రసరించునది.
(6) పరావహ వాయువు –సప్తర్షి మండలమునకు, గ్రహమండలమునకు మధ్య ప్రసరించునది.
(7) పరివహ వాయువు – ధ్రువ మండలమునకు, సప్తర్షి మండలమునకు మధ్య ప్రసరించునది.

తరువాతి 12 నామములు ఆధ్యాత్మ వాసుదేవుని, అనగా పరవాసుదేవుని స్తుతించు నామములుగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. ఆసక్తికరమైన విషయము ఏమంటే వాసుదేవ మంత్రములో కూడ 12 అక్షరములు ఉన్నాయని ప్రొఫెసర్ ఎ. శ్రీనివాస రాఘవన్ సూచించారు.

334. వాసుదేవః

- సర్వత్ర వ్యాపించి, క్రీడించువాడు. అన్నింటియందు ఉండువాడు.
- అన్నింటినీ తన యందుంచుకొని కాపాడువాడు.
- వసుదేవుని కుమారుడు.

ఓం వాసుదేవాయ నమః

ఈ పరమ పవిత్ర నామము మూడుమార్లు ఈ మహాస్తోత్రమున స్తుతింపబడినది.

36వ శ్లోకము. 334వ నామము. వాసుదేవః – **వాసుదేవో బృహద్భానుః ఆదిదేవః పురందరః**

74వ శ్లోకము. 701వ నామము. వాసుదేవః – **వసుప్రదో వాసుదేవో వసుర్వసుమనా హవిః**

76వ శ్లోకము. 714వ నామము. వాసుదేవః – **భూతావాసో వాసుదేవః సర్వాసునిలయోనలః**

ముందుగా శ్రీభట్టుల ప్రత్యేకవ్యాఖ్యను గమనించనగును – 'నారాయణ' నామము వలెనే 'వాసుదేవ' నామము మహామంత్రము. ఆచార్య ముఖతః తెలిసికొనదగినది. ఇందువలన శ్రీభట్టులు ఈ నామార్థమును కేవలము క్లుప్తముగా చెప్పి ముగించారు. ఈ నామములో 'వాసు', 'దేవుడు' అనే రెండు ముఖ్యమైన భగవద్విభూతులు చెప్పబడినవి.

వస్ – నివసించుట, కప్పియుంచుట – అనే ధాతువునుండి గ్రహింపదగిన అర్థములు.

వాసు – సర్వమ్ వసతి – అంతా ఆయనలో వసించును.

వాసు – సర్వత్ర వసతి – ఆయన అన్నిచోట్ల వసించును.

దివ్ – క్రీడాయామ్ – ఆడుట – అనే ధాతువునుండి

దేవ – వినోదించువాడు. లీలాసూత్రధారి. ఆడువాడు. జయింపగోరువాడు. ప్రకాశించువాడు.

ఈ రెండు పదములు (వాసు, దేవ) కలిపి 'వాసుదేవ' నామము వ్యాఖ్యానింపబడినది. భగవంతుడు తల్లివలె సమస్త జగత్తును తనయందు పెట్టుకొని కాపాడును. పక్షివలె రెక్కలలోదాచి పిల్లలను రక్షించును. ఇదియంతయును ఆయన లీల (క్రీడ). అందువలన ఆయన శ్రీవాసుదేవుడు.

సర్వభూతాన్ వాసయతి వాసుస్స పరికీర్తితః
దివ్ ధాతోరపి క్రీడా ద్యర్థకత్వాద్విశేషతః
వాసుశ్చ సౌ దేవశ్చేతి వాసుదేవః ప్రకీర్తితః

సర్వభూతేష్వపి వసన్ స్వస్మిన్ భూతాని వాసయన్
యః క్రీడతి ముదా యద్వా వాసుదేవస్స ఉచ్యతే
సర్వత్రా సౌ సమస్తం చ వసత్యత్రేతి వైయతః
తత స్స వాసుదేవేతి విద్వద్భిః పరికీర్తితః

ఈ అర్థమునకు ప్రమాణముగా శ్రీ శంకరులు, శ్రీ భట్టులు కూడ ఇచ్చిన ఉదాహరణలు –

ఛాదయామి జగద్విశ్వమ్ భూత్వా సూర్య ఇవాంశుభిః
సర్వభూతాది వాసశ్చ వాసుదేవః తతః స్మృతః – మహాభారతము. శాంతిపర్వము. మోక్షధర్మము 12.328.36

నేను సూర్యుడనై కిరణములతో ఈ జగత్తును కప్పివేస్తున్నాను. మరియు సర్వభూతములయందు అంతర్యామియై వసించియున్నాను. కనుక నన్ను వాసుదేవుడనియందురు.

వసనాత్ సర్వభూతానామ్ వసుత్వాత్ దేవయోనితః
వాసుదేవస్తతో జ్ఞేయః యోగిభిస్తత్వదర్శిభిః – మహాభారతము. ఉద్యోగపర్వము 69.3

నేను అన్ని భూతములకు నివాస (ఆశ్రయ) స్థానమును. మరియు అన్ని భూతములందు దివ్యశరీరముతో వసింతును. కనుక జ్ఞానమునెరిగిన యోగులు నన్ను వాసుదేవునిగా తెలిసికొందురు.

సర్వత్రాऽసౌ సమస్తం చ వసత్యత్రేతి వై యతః
తతః స వాసుదేవేతి విద్వద్భిః పరిపఠ్యతే – విష్ణుపురాణము 1.2.12

అన్నింటియందు ఆయన వసించును. అన్నియును ఆయనయందు వసించును. కనుక ఆయన వాసుదేవుడని విద్వజ్జులు చెప్పుదురు.

సర్వాణి తత్ర భూతాని వసంతి పరమాత్మని
భూతేషు చ స సర్వాత్మా వాసుదేవస్తతః స్మృతః – విష్ణుపురాణము 6.5.80

ఆ పరమాత్మునియందు సర్వభూతములు వసించును. మరియు సర్వభూతములయందు ఆ సర్వాత్ముడు వసించును. కనుక ఆయన వాసుదేవుడు.

తెలుగు సినిమా పాట (అల్లరి పిల్లలు?)

ఆత్మనూ నేనంటివీ దేవ పరమాత్మ నీవేనంటివీ
నీలోన కలిసిపోనా నిన్ను నాలోన నిలుపుకోనా
శ్రీచక్ర శుభనివాసా స్వామి శృంగార శ్రీనివాసా।
జగమేలు చిద్విలాసా నా స్వామి శృంగార శ్రీనివాసా।

ద్వాపరయుగమున వసుదేవుని సుతునిగా అవతరించినందున కూడ శ్రీకృష్ణ భగవానుడు వాసుదేవుడని పిలువబడెనని శ్రీ వి.వి. రామానుజన్ వివరించారు.

ధర్మచక్రము రచయిత – భగవంతుడు సర్వాంతర్యామియైనను కేవలము తన భక్తులకే గోచరించును. అన్నియెడల చలనము, చైతన్యము, ప్రకాశము, జ్ఞానము ఆయన వలననే సంభవించును. కాని ఆత్మజ్ఞానము నెరిగిన వారికే ఆయన తెలియును.

బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః – గీత - జ్ఞానవిజ్ఞానయోగము 7.19
అనేక జన్మల పిదప జ్ఞానియైనవాడు (భగవత్తత్వమును ఎఱిగినవాడు) సర్వమూ వాసుదేవ మయమే యని భావించి నన్ను శరణు పొందును. అట్టి మహాత్ముడు లభించుట అరుదు.

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము 108వ శ్లోకము
వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ
శ్రీమాన్నారాయణో విష్ణుః వాసుదేవోఽభిరక్షతు.
శ్రీ వాసుదేవోఽభిరక్షతు ఓం నమ ఇతి

శ్రీ విష్ణు సహస్ర నామము ఉత్తర పీఠికనందు వాసుదేవ నామము అనేకమార్లు ప్రస్తావింపబడినది.

భక్తిమాన్ యః సదోత్థాయ శుచిస్తద్గతమానసః
సహస్రం వాసుదేవస్య నామ్నామేతత్ ప్రకీర్తయేత్ (5)

వాసుదేవాశ్రయో మర్త్యో వాసుదేవ పరాయణః
సర్వపాప విశుద్ధాత్మా యాతి బ్రహ్మ సనాతనం (10)

న వాసుదేవ భక్తానా మశుభం విద్యతే క్వచిత్
జన్మ మృత్యు జరా వ్యాధి భయం నైవోపజాయతే (11)

ద్యౌ స్సచంద్రార్కనక్షత్రా ఖం దిశో భూర్మహోదధిః
వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనః (14)

ఇంద్రియాణి మనో బుద్ధిః సత్త్వం తేజో బలం ధృతిః
వాసుదేవాత్మకాన్యాహుః క్షేత్రం క్షేత్రజ్ఞ ఏవ చ (16)

వ్యాస ఉవాచ:

వాసనాద్వాసుదేవస్య వాసితం తే జగత్త్రయమ్

సర్వభూత నివాసోఽసి వాసుదేవ నమోఽస్తుతే

శ్రీ వాసుదేవ నమోఽస్తుత ఓం నమ ఇతి.

335. బృహద్భానుః

గొప్ప కిరణములు గలవాడు. అమిత ప్రకాశము గలవాడు.

ఓం బృహద్భానవే నమః

'బృహత్' అనగా పెద్ద, గొప్ప. 'భాను' అనగా కిరణములు. విశ్వమునకు, సూర్యచంద్రాగ్నులకు ప్రకాశము నొసగువాడు గనుక వాసుదేవుడే బృహద్భానుడు. ఇందుకు శ్రీ శంకరులు చెప్పిన ప్రమాణము –

బృహంతో భానవో యస్య చంద్ర సూర్యాదిగామినః

త్రైర్విశ్వమ్ భాసయతి యః స బృహద్భానురుచ్యతే – ఉద్యోగపర్వము 70.4

చంద్ర సూర్యులను అధిగమించు గొప్ప కిరణములు కలిగి, వానిద్వారా విశ్వమును వెలిగించువానిని బృహద్భానువందురు.

ముండకోపనిషత్తు (2.2.10)నుండి శ్రీ రాధాకృష్ణ శాస్త్రి ఇచ్చిన ఉదాహరణ –

న తత్ర సూర్యో భాతి న చంద్ర తారకమ్ నేమా విద్యుతో భాన్తి కుతో యమాగ్నిః

తమేవ భాన్తమ్ అనుభాతి సర్వమ్ తస్య భాసా సర్వమిదమ్ విభాతి

అక్కడ సూర్య చంద్రాగ్నులు ప్రకాశించరు. ఆయనయే అన్నింటికి వెలుగు.

ధర్మ చక్రము రచయిత – సూర్యుడు బహిర్లోకమునకు వెలుగు ప్రసాదించును. భగవంతుడు ఆత్మ జ్ఞానముకు కావలసిన వెలుగును ప్రసాదించును.

డా. క్రోవి పార్థసారథి 'శ్రీకైవల్య సారథి' నుండి – ఆ పరమేశ్వరుడు ఒక పెద్ద జ్ఞానజ్యోతి. అతని శరీరమునుండి వందలు, వేలు, లక్షలు, కోట్లు, కోటానుకోట్ల కొలది కిరణములు ప్రకాశిస్తున్నాయి. అందులో అగ్ని 108, సూర్యుడు 176, చంద్రుడు 136 కిరణములను మాత్రమే తీసికొన గలిగారు. ఈ కిరణముల చేతనే అంటే పగటి పూట సూర్యుని వెలుగులతో, రాత్రిపూట చంద్రుని కాంతులతో, సంధ్య వేళలయందు అగ్ని కాంతులతో ఈ జగత్తు ప్రకాశిస్తున్నది. అని 'భైరవ యామళము'లో చెప్పబడినది.

336. ఆదిదేవః

- మొట్టమొదటి దేవుడు. సంపూర్ణ లీలా నాటక వినోది.

- అన్నింటికి ప్రధమ కారణము.

- ఇచ్చువాడు. వెలుగువాడు. వెలిగించువాడు. విశ్వాత్మకుడు.

ఓం ఆదిదేవాయ నమః

ఈ నామము రెండుమార్లు స్తుతింపబడినది.

36వ శ్లోకము. 336వ నామము. ఆదిదేవః – **వాసుదేవో బృహద్భానుః ఆదిదేవః పురందరః**

52వ శ్లోకము. 491వ నామము. ఆదిదేవః – **ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః**

'వాసుదేవ' నామములో 'దేవ' అనే పదమునకు 'క్రీడించువాడు' అని అర్ధము వివరించడమైనది. అదే ఆధారముగా 'ఆదిదేవుడు' అనగా సమస్త సృష్టి లయాది కార్యములు ఆయన లీలయే యని గ్రహింపవలెను – **యః క్రీడతీత్యాది దేవః పాదాత్మకః విభూతిభిః**. చిన్నపిల్లవాడు తన ఇష్టానుసారము ఇసుకలో ఇండ్లు కట్టి మరల చెల్లాచెదరు చేసినట్లే ఆదిదేవుడు సృష్టిస్థితిలయాది కార్యములందు ఆడుకొనును. అని శ్రీ వి.వి. రామానుజన్ వివరించారు. **అఖిల భువన జన్మస్థేమ భంగాది లీలే** – అంతా ఆయన లీల మాత్రమే. **ఆదిశ్చాసౌ దేవశ్చ ఆదిదేవః**.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి నిరుక్తము (7.25)నుండి ఉదాహరించారు. **దేవో దానాద్వా దీపనాద్వా ద్యుస్థానో భవతి** – దేవుడనగా పుష్కలముగా ప్రసాదించువాడు (వరమిచ్చువాడు), తానై వెలుగువాడు, ఇతరులను వెలిగించువాడు, ద్యులోకమున (అంతరిక్షమున) నుండువాడు. అట్టి దేవుళ్ళలో మొదటివాడు గనుక భగవానుడు ఆదిదేవుడు.

(ఈ నామమునకూ , ఇంకా శ్రీ విష్ణుసహస్ర నామ స్తోత్రములోని మరి కొన్ని నామములకూ చక్కని అర్థము పోతనగారి గజేంద్రమోక్షములోని పద్యాలలో ఉన్నదని నాకనిపిస్తుంది – కా.సు. బాబు)

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై;
ఎవ్వనియందు డిందు, పరమేశ్వరు డెవ్వడు; మూల కారణం
బెవ్వ; డనాదిమధ్యలయు డెవ్వడు; సర్వముదాన యైన వా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్.

లోకంబులు లోకేశులు
లోకస్థులు తెగిన తుది నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుగు నతని నే సేవింతున్

విశ్వకరుని విశ్వదూరుని
విశ్వాత్మకు విశ్వవేద్యు విశ్వునవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మ ప్రభు
నీశ్వరునిం బరమ పురుషు నే భజియింతున్.

337. పురందరః

- పురములను నాశనము చేసినవాడు (త్రిపురాంతకుడు, ఇంద్రుడు).
- అధిదైవికములగు కష్టములనుండి కడతేర్చువాడు.
- స్థూల, సూక్ష్మ, కారణ శరీరములనుండి విముక్తిని పొందుటకు భక్తులకు సాయము చేయువాడు.
- అన్ని జీవుల శరీరములను తుదకు నాశనము చేయువాడు.

ఓం పురందరాయ నమః

'పురములు' అనగా నగరములు. 'దర' అనగా ధ్వంసము చేయుట. **పురమ్ దారయతి ఇతి పురందరః.** త్రిపురాసుర సంహారమును సాగించిన రుద్రునకు అంతర్యామి అయినందున భగవానుడు పురందరుడు. శ్రీ వి.వి. రామానుజన్ గారు ఈ వివరణకు సమర్ధనగా శ్రీ నమ్మాళ్వార్ తిరువైమొళినుండి ఈ పాశురము (1.1.8)ను ఉదాహరించారు.

పురమ్ ఒరు మూన్రు ఎరిత్తు అమరుక్కుమ్ అఱివు ఇయన్ద
అరన్ అయన్ ఏన ఉలగు అళిత్తు అమైత్తు ఉళనే
ఎంపెరుమాన్ వారే రుద్రుడై మూడు పురములను నశింపజేసెను. బ్రహ్మయై దేవతలకు వేదజ్ఞానము నందించెను. ఆయనే సకల సృష్టి స్థితి లయ కార్యములు సాగించును.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **పురాణి శంబరాదినామ్ అసురాణామ్ నగరాణి దృణతి ఇతి పురందరః** – శంబరునివంటి అసురుల నగరములను నాశనము చేసినవాడు పురందరుడు. ఇందుకు ప్రమాణముగా ఋగ్వేద మంత్రము (7.99.5) – **ఇంద్రా విష్ణు దృగమ్ హిత శంబరస్య నవపురో నవతిమ్ చ శ్నతిష్టమ్.** నీవే ఇంద్రుడవు. నీవే విష్ణువు. నీవే శంబరుని తొమ్మిది దుర్గమ నగరములను నాశనము చేసినవాడవు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సుర శత్రూణామ్ పుర దారణాత్ పురందరః** – దేవతల శత్రువుల పురములను నాశనము కావించువాడు పురందరుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అసుర పురాణి దారయతి ఇతి పురందరః** – అనగా రాక్షసులు, పిశాచములు, పిడుగు, గ్రహబాధలు వంటి అధిదైవిక పీడలను నాశనము చేయువాడు పురందరుడు. ఇక్కడ 'పురము' అనగా రాక్షసులకు నిలయమైనది. అట్టి అసుర స్థావరములను ధ్వంసము చేయును గనుక ఆయన పురందరుడు.

శ్రీ చిన్మయానంద – జాగ్రత్, స్వప్న, సుషుప్తి యను మూడు అవస్థలు మూడు పురములు. స్థూల, సూక్ష్మ, కారణ రూపములగు మూడు శరీరములతోనున్న బంధము విడనంతవరకు ఈ అవస్థలు (పురములు) జీవుని చుట్టుముట్టియే యుండును. శరీరమునుండి విడివడి, ఆ యవస్థాపురములను ఛేదించిన గాని ఆత్మజ్ఞానము సిద్ధింపదు. ఈ ప్రక్రియ శ్రీహరి యనుగ్రహము వల్లనే సాధ్యము గనుక ఆయన పురందరుడు.

ఈ విషయమును ధర్మచక్రము రచయిత చక్కగా వివరించారు – ఈ స్థూల శరీరము భగవంతునిదేనని భావించి, భగవత్సేవకే తనువును అంకితము చేసినపుడు, భగవదనుగ్రహము వలన స్థూల శరీరమునుండి విముక్తి లభించును. ఈ మనస్సును భగవంతుని ధ్యాన స్మరణాది భావములందు లయమొనర్చినపుడు భగవంతుడు మన మనస్సుల ప్రేరణవలన జరుగు కర్మల ప్రభావమునుండి విముక్తిని ప్రసాదించును. ఆయనయందు మహావిశ్వాసము కలిగి సంపూర్ణ శరణాగతులైనవారికి కారణ శరీరమునుండి కూడ విముక్తి లభించును. అప్పుడే ఆత్మజ్ఞానము సాధించుటకు మార్గము సుగమమగును. ఆ మార్గమునకు ద్వారము తెరచు భగవంతుడే పురందరుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **పురమ్ దారయతి ఇతి పురందరః** – పురములను నాశనము చేయువాడు పురందరుడు. పురము అనగా శరీరము. ఈ పురమునందే జీవుడు వసించును. కాలము చెల్లిన పిదప అందరినీ కడతేర్చువాడు, అందరినీ దరిచేర్చువాడు పురందరుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

అశోకస్తారణస్తారః శూరః శౌరిర్జనేశ్వరః |
అనుకూలః శతావర్తః పద్మీ పద్మనిభేక్షణః || (37)

పురందరః అశోకః తారణః తారః

ఇంతకు ముందు నామమైన **'పురందరః'** మరియు ఇప్పటి మూడు వరుస నామములు **'అశోకః'**, **'తారణః'**, **'తారః'** – ఈ నాలుగు నామములు మన భయములను తొలగించే భగవంతుని దయాగుణ గానమయ పుణ్యకీర్తనలు అని చెప్పబడెను. ఏ నామస్మరణము ఏ విధమైన భయహారకము? అనే విషయంలో వేరువేరు వ్యాఖ్యానకర్తల అభిప్రాయాలలో స్వల్పవైవిధ్యము కనిపిస్తుంది. మొత్తానికి భగవానుని నామస్మరణము సకల భయాపహము అని మనము గ్రహింపవలసి ఉన్నది.

శ్రీ రాధకృష్ణశాస్త్రిగారు చక్కని తరణోపాయమును సెలవిచ్చారు. ఏ విధమైన భయములు గాని, కష్టములు గాని చుట్టుముట్టిన యెడల **'అశోకస్తారణస్తారః'** అని స్మరించినట్లయితే కష్టములనుండి బయటపడు మార్గము లభించి తీరును. ఈ భయములు ఆధ్యాత్మికము, అధిభౌతికము, అధిదైవికము అని మూడు విధములుగా శ్రీ భట్టులు వివరించారు. పిశాచములవల్ల, రాక్షసులవల్ల కలుగు భయము అధిదైవికము. శత్రువుల వలన, పాములు, పులులు వంటి జంతువులవలన సంభవించునది అధిభౌతికము. మాయ, ఆకలి, శోకము వంటివానివలన ఆధ్యాత్మిక భయము కలుగును.

ఇక వీటన్నింటిని మించినది జనన మరణ చక్ర బంధితమైన సంసార భయము. ఈ భయముల గురించి అందరికీ తెలుసు. కాని వానిని భగవంతుడెలా తొలగించును? అందుకు ధర్మచక్రము రచయిత చక్కని వివరణ చెప్పారు – మనము శరీరమునే జీవము అని భ్రమించుటవలన భయము కలుగును. ఆత్మజ్ఞానము

కలిగినవానికి ఆత్మ నశింపదని, దానిని అగ్ని దహింపలేదని తెలియును. వానికి భయముండదు. శ్రీమహావిష్ణు ధ్యానమే అట్టి జ్ఞానమునకు మార్గము.

శ్రీనివాసుని ఆర్తత్రాణ పరాయణత్వమును పెక్కురు భక్తులు పలువిధముల కీర్తించిరి. దేవతలకైనా, సామాన్య మానవులకైనా ఇడుములను హరించునది హరినామ స్మరణయే.

అన్నమయ్య కీర్తన

నీయంతటివారెవ్వరు నీకు నెదురేది యెందు
చాయల నీ సుద్ది విని శరణంటి నేను

కావలెనంటే దొల్లి కంభము చించుకవెళ్ళి
కైవశమై ప్రహ్లాదు గావవా నీవు
తేవలనంటే బ్రహ్మ దేవునికి వేదములు
నోవల సముద్రమయిన చొచ్చి తేవా నీవు

పట్టియెత్తవలెనంటే బాతాళాన బడ్డకొండ
తట్టియెత్తి పాలవెల్లి దచ్చవా నీవు
మట్టుపెట్టవలె నంటే మరి భూమి చాపగాగ
చుట్టుకపోతే దెచ్చి సొంపుగ నిలుపవా

పక్షపాతమయ్యేనంటే బాండవుల గెలుపించి
యీ క్షితి నేలించి చనవియ్యవా నీవు
రక్షించేనంటే గాచరావ శ్రీవేంకటాద్రి బ్ర
త్యక్షమై మావంటివారి దగ గరుణించవా

ఈ విధముగా బ్రహ్మాది మహాత్ములకు సంభవించిన విపత్తులను పరిహరించి బ్రోచువాడు అయిన శ్రీనివాసుడు శ్రీవేంకటాద్రిపై వెలసియున్నాడు. బ్రహ్మాదులకే కాదు. సామాన్యులు సదా చింతించు కష్టములను పరిమార్చు సాధనము శ్రీవేంకటేశుని పుణ్యనామమేయని అన్నమయ్య మరొకమారు కీర్తించారు.

ఆకటి వేళల అలపైన వేళలను
తేకువ హరినామమే దిక్కు మరి లేదు

కొఱమారియున్న వేళ కులము చెడిన వేళ
చెఱవడి వొరుల చేజిక్కినవేళ
వొఱపైన హరినామమొక్కటే గతి గాక
మఱచి తప్పిననైన మఱి లేదు తెరగు

ఆపద వచ్చిన వేళ ఆరడి బడిన వేళ
పాపపు వేళల భయపడిన వేళ
వోపినంత హరినామ మొక్కటే గతి గాక
మాపు దాకా పొరలిన మరిలేదు తెరగు

సంకెల బెట్టిన వేళ చంప బిలిచిన వేళ
అంకిలిగా నప్పుల వారాగిన వేళ
వేంకటేశు నామమే విడిపించ గతిగాక
మంకు బుద్ధి పొరలిన మరిలేదు తెరగు

ఇవన్నీ సామాన్యుని దిక్కు తోచని చీకటిలో క్రుంగదీయు కష్టములు. పడ్డవానికే తెలియవచ్చు ఇక్కట్లు. ఆకలి బాధ, అలసిపోయిన పరిస్థితి, పాపములో చిక్కుకొనుట, ఇక్కట్ల పాలగుట, చెరసాల పాలగుట, అప్పులవారు ఎదురైన దీనస్థితి – ఇట్టి ఇడుములు చుట్టుముట్టినపుడు హరినామస్మరణమే కాపాడు గతి. వేరెవ్వరును రక్షింపజాలరు. కనుకనే మన పట్ల దయతో ఏడుకొండలవాడు ఆపదమ్రొక్కులవాడై వెలసియున్నాడు.

ఇంక ఆపన్న ప్రసన్నుడు గజేంద్రుని రక్షించిన విధము పోతనగారి దయవలన తెలుగునాట సుప్రసిద్ధమైనది. గజేంద్రమోక్షములోని పద్యములు మేలిముత్యములు. భక్తిరసామృత పాత్రములు. నిత్యస్మరణ చేయదగిన వేదసారములు శ్రీవిష్ణుసహస్రనామ భావ భరితములు.

శ్రీమన్నామ। పయోద
శ్యామ। ధరా భృల్లలామ। జగదభిరామా।
రామా। జనకామ। మహో
ద్ధామ। గుణస్తోమ ధామ। దశరథ రామా।

నీరాటవనాటములకు
బోరాటంబెట్లుగలిగె పురుషోత్తముచే
నారాటమెట్లుమానెను
ఘోరాటవిలోన భద్రకుంజరమునకున్

ఒకనాడు గజేంద్రుడు తన పరివారముతోకూడి సరస్సునందు జలక్రీడలాడుచునుండగా

సరసిలోనుండి పొడగని సంభ్రమించి
యుదరి కుప్పించి లంఘించి హుంకరించి
భాను గబళించి పట్టు స్వర్భానుపగిది
నొక్క మకరేంద్రు డిభరాజు నొడిసి పట్టె.

కరి దిగుచు మకరి సరసికి
గరి దరికిని మకరి దిగుచు గరకరి బెరయన్
గరికి మకరి మకరికి గరి
భర మనుచును నతల కుతల భటు దరుదు పడన్.

మొసలి నోట చిక్కువడిన గజరాజు తన శక్తికొలది వేయేండ్లు ఆత్మరక్షణార్థమై పోరుసల్పెను.

అలయక సొలయక వేసట
నొలయక కరి మకరితోడ నుద్దండత రా
త్రులు సంధ్యలు దివసంబులు
సలిపెం బోరొక్క వేయి సంవత్సరముల్

అయినను ఆ గజేంద్రుడు మొసలి పట్టునుండి బయటపడలేకపోయెను. 'ఇంకేటికి? దీని గెల్వ సరి పోరం జాలరా దంచు' భావించి, 'పూర్వపుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో' ఇట్లు చింతించెను.

ఏ రూపంబున దీనిగెల్తు? నిట మీ దేవేల్పు జింతింతు? నె
వ్వారిం జీరుదు? నెవ్వరడ్డ? మిక ని వ్వారి ప్రచారోత్తమున్
వారింపం దగువార లెవ్వ? రఖిలవ్యాపార పారాయణుల్
లేరే మ్రొక్కెదదిక్కుమాలిన మొఱాలింపం బ్రపుణ్యాత్మకుల్?

'నీరాశ నిటేల వచ్చితి, భయం బెట్లోకదే యీశ్వరా' అని గజేంద్రుడు ఈశ్వరునే శరణువేడ నిశ్చయించెను.

ఎవ్వనిచే జనించు జగ, మెవ్వని లోపల నుండు లీనమై;
యెవ్వని యందు డిందు; పరమేశ్వరు డెవ్వడు; మూల కారణం
బెవ్వ; డనాదిమధ్యలయుడెవ్వడు; సర్వము దానెయైన వా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్.

ఒకపరి జగములు వెలి నిడి
యొకపరి లోపలికి గొనుచు నుభయము దానై
సకలార్థ సాక్షి యగు న
య్య కలంకుని నాత్మమూలు నర్థి దలంతున్.

లోకంబులు లోకేశులు
లోకస్థులు దెగిన తుది నలోకం బగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డే కాకృతి వెలుగు నతని నే సేవింతున్.

నర్తకుని భంగి బెక్కగు
మూర్తులతో నెవ్వఁడాడు? మునులు దివిజులుం
గీర్తింప నేర రెవ్వని
వర్తన మొరు లెఱుగ రట్టి వాని నుతింతున్.

ముక్తసంగులైన మునులు దిదృక్షులు
సర్వభూత హితులు సాధుచిత్తు
లసదృశ వ్రతాఢ్యులై కొల్తు రెవ్వని
దివ్యపదము వాడు దిక్కు నాకు.

భవము దోషంబు రూపంబు గర్మంబు నా
    హ్వయమును గుణము లెవ్వనికి లేక
జగముల గలిగించు సమయించు కొఱకునై
    నిజమాయ నెవ్వడిన్నియునుదాల్చు
నా పరేశునకు ననంత శక్తికి బ్రహ్మ
    కిద్ధరూపికి రూపహీనునకును
జిత్రచారునికి సాక్షికి నాత్మరుచికిని
    బరమాత్మునకు బరబ్రహ్మమునకు

మాటలన్నెఱుకల మనముల జేరంగ
గాని శుచికి సత్త్వగమ్యుడగుచు
నిపుణుడైన వాని నిష్కర్మతకు మెచ్చు
వాని కే నొనర్తు వందనములు.

శాంతున కపవర్గసౌఖ్య సంవేదికి
    నిర్వాణ భర్తకు నిర్విశేషు
నకు, ఘోరునకు గూఢునకు గుణధర్మికి
    సౌమ్యున కధికవిజ్ఞాన మయున
కఖిలేంద్రియ ద్రష్ట కధ్యక్షునకు బహు
    క్షేత్రజ్ఞునకు దయాసింధుమతికి
మూలప్రకృతి కాత్మ మూలున కఖిలేంద్రి
    య జ్ఞాపకునకు దు:ఖాంత కృతికి

నెఱిన సత్య మనెడి నీడతో వెలుగుచు
నుండు నొక్కటికి మహోత్తమునకు

నిఖిల కారణునకు, నిష్కారణునకు న
మస్కరింతు నన్ను మనుచు కొఱకు.

యోగాగ్ని దగ్ధకర్ములు
యోగీశ్వరు లే మహాత్ము నొండెఱుగక స
ద్యోగ విభాసిత మనముల
బాగుగ వీక్షింతు రట్టి పరము భజింతున్.

సర్వాగమామ్నాయ జలధికి నపవర్గ
మయునికి నుత్తమ మందిరునకు
సకల గుణారణిచ్ఛన్నబోధాగ్నికి
దనయంత రాజిల్లు ధన్యమతికి
గుణలయోద్దీపిత గురు మానసునకు
సంవర్తిత కర్మ నిర్వర్తితునకు
దిశ లేని నాబోటి పశువుల పాపంబు
లడచువానికి సమస్తాంతరాత్ము

డై వెలుంగువాని, కచ్ఛిన్ననకు, భగ
వంతునకు, దనుజ పశునివేశ
దారసక్తు లయినవారి కందగరాని
వాని కాచరింతు వందనములు.

మఱియును.

వరధర్మకామార్థ వర్జితకాములై
విబుధు లెవ్వాని సేవించి యిష్ట
గతి బొందుదురు? చేరి కాంక్షించువారి క
వ్యయ దేహ మిచ్చు నెవ్వాడు కరుణ?
ముక్తాత్ము లెవ్వని మునుకొని చింతింతు?
రానంద వార్ధి మగ్నాంతరంగు
లేకాంతు లెవ్వాని నేమియు గోరక
భద్రచరిత్రంబు బాడుచుందు?

రామహేశు నాద్యు నవ్యక్తు నధ్యాత్మ
యోగగమ్యు బూర్ణు నున్నతాత్ము
బ్రహ్మమైనవాని బరుని నతీంద్రియు

నీశు స్థూలు సూక్ష్మ నే భజింతు.

అని మఱియు నిట్లని వితర్కించె.

పావకుం డర్చుల భానుండు దీప్తుల
　　　　నెబ్భంగి నిగిడింతురెట్ల డంతు
రాక్రియ నాత్మకరావళిచేత బ్ర
　　　　హ్మాదుల వేల్పుల నఖిలజంతు
గణముల జగముల ఘన నామ రూప భే
　　　　దములతో మెఱయించి తగ నడంచు
నెవ్వడు మనము బుద్ధీంద్రియమ్ములు దాన
　　　　యై గుణ సంప్రవాహంబు బఱపు

స్త్రీ నపుంసక పురుష మూర్తి యును గాక
తిర్య గమర నరాది మూర్తియును గాక
కర్మ గుణ భేద స దసత్ప్రకాశి గాక
వెనుక నన్ని యు దా నగు విభు దలంతు.

కల డందురు దీనుల యెడ
గల డందురు పరమయోగి గణముల పాలం
గలడందు రన్నిదిశలను
గలడు కలం డనెడు వాడు గలడో లేడో

కలుగడే నాపాలి కలిమి సందేహింప
　　　　గలిమిలేములు లేక కలుగువాడు;
నా కడ్డపడ రాడె నలి న సాధువులచే
　　　　బడిన సాధుల కడ్డపడెడువాడు
చూడడే నా పాటు జూపుల జూడక
　　　　చూచువారల గృపజూచువాడు;
లీలతో నా మొఱాలింపడే మొఱగుల
　　　　మొఱ లెఱుంగుచు దన్ను మొఱగువాడు;

అఖిలరూపులు దన రూపమైన వాడు
నాదిమధ్యాంతములు లేక యడరువాడు
భక్తజనముల దీనుల పాలివాడు
వినడె చూడడె తలపడె వేగ రాడె;

విశ్వకరు విశ్వదూరుని
విశ్వాత్మకు విశ్వవేద్యు విశ్వు నవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మప్రభు
నీశ్వరునిం బరమ పురుషు నే భజియింతున్

(గజేంద్రుడు శ్రీ మహావిష్ణువును ప్రార్థించిన ఈ 14 పద్యములను మననము చేస్తే మూడు చక్కని విషయములు నాకు అనిపిస్తున్నవి -

1. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రములోని ఎన్నో నామములు, లేదా వాని భావములు ఈ ప్రార్థనలో పొందుపరపబడియున్నవి.
2. ఈ ప్రార్థనను ఏ మతమువారైనా, వారు పూజించు భగవంతునికి అన్వయించుకొనవచ్చును.
3. భవంతుడు అంటే ఏమిటి? దేవుడెలా ఉంటాడు? ఏమని ఆయనను పిలవాలి? అనే ప్రశ్నలకు చక్కని సమాధానం ఈ ప్రార్థనలో లభిస్తుంది.

- కా.సు. బాబు)

అని పలికి తన మనంబున నగ్గజేంద్రుండీశ్వర సన్నిధానంబు కల్పించుకొని యిట్లనియె.

లా వొక్కింతయు లేదు; ధైర్యము విలోలంబయ్యె; బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను; మూర్ఛ వచ్చె; దనువున్ డస్సెన్; శ్రమంబయ్యెడిన్;
నీవే తప్ప నితఃపరం బెఱుగ; మన్నింపందగున్ దీనునిన్;
రావే ఈశ్వర; కావవే వరద; సంరక్షింపు భద్రాత్మకా

విను దట జీవుల మాటలు
చను దట చనరానిచోట్ల శరణార్థుల కో
యను దట పిలిచిన సర్వము
గను దట సందేహ మయ్యె గరుణావార్థీ

ఓ కమలాప్తు! యోవరద! యో ప్రతిపక్ష విపక్షదూర! కు
య్యో! కవి యోగివంద్య సుగుణోత్తమ! యో శరణాగతామరా
నోకహ! యో మునీశ్వర మనోహర! యో విపులప్రభావ! రా
వే, కరుణింపవే, తలపవే, శరణార్థిని నన్ను గావవే.

అని పలికి, మఱియు నరక్షిత రక్షకుండైన యీశ్వరుం డాపన్నుండైన నన్నుం గాచుగాక యని, నింగి నిక్కి చూచుచు, నిట్టూర్పులు నిగిడింపుచు, బయలాలకింపుచు, నగ్గజేంద్రుండు మొఱ సేయుచున్న సమయంబున

విశ్వమయత లేమి వినియు నూరకయుండి
రంబుజాసనాదు లడ్డు పడక

విశ్వమయుడు విభుడు విష్ణుండు జిష్ణుండు
భక్తియుతున కడ్డ పడదలంచి

అల వైకుంఠ పురంబులో నగరిలో నామూల సౌధంబు దా
పల మందార వనాంతరామృతసరః ప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంక రమావినోది యగు నాపన్న ప్రసన్నుండు వి
విహ్వల నాగేంద్రము 'పాహి పాహి' యనఁగుయ్యాలించి సంరంభియై

సిరికిం జెప్పడు; శంఖ చక్ర యుగముం జేదోయి సంధింపడే
పరివారంబును జీర డభ్రగపతిం బన్నింప డాకర్ణికాం
తర ధమ్మిల్లము జక్క నొత్తడు వివాదప్రోత్థిత శ్రీ కుచో
పరి చేలాంచలమైన వీడడు గజ ప్రాణావనోత్సాహియై.

ఇట్లు భక్తజన పాలన పరాయణుండును, నిఖిల జంతు హృదయారవింద సదన సంస్థితుండును నగు నారాయణుండు, కరి కులేంద్ర విజ్ఞాపిత నానావిధ దీనాలాపంబు లాకర్ణించి, లక్ష్మీకాంతా వినోదంబులం దవిలి సాలించి, సంభ్రమించి, దిశలు నిరీక్షించి, గజేంద్రరక్షా పరత్వంబు నంగీకరించి, నిజ పరికరంబును మరల నవధరించి, గగనంబున కుద్గమించి వేంచేయు నప్పుడు;

తనవెంటన్ సిరి, లచ్చి వెంట నవరోధవ్రాతమున్, దాని వె
న్కను బక్షీంద్రుడు, వాని పొంతను ధను:కౌమోదకీ శంఖ చ
క్ర నికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండు దా వచ్చి రొ
య్యన వైకుంఠపురంబునం గలుగువా రాబాలగోపాలమున్.

తదనంతరంబ ముఖారవింద మకరంద బిందు సందోహ పరిష్యందమానానంద దిందిందిరయగు నయ్యిందిరాదేవి గోవింద కరారవింద సమాకృష్యమాణ సంవాద చేలాంచల యై పోవుచు

తన వేంచేయు పదంబు పేర్కొన; డనాథ స్త్రీ జనాలాపముల్
వినెనో, మ్రుచ్చులు మ్రుచ్చిలించిరో ఖలుల్ వేద ప్రపంచంబులన్,
దనుజానీకము దేవతానగరిపై దండెత్తెనో, భక్తులం
గని చక్రాయుధు డేడి చూపుడని దిక్కారించిరో దుర్జనుల్.

అని వితర్కించుచు.

తాటంకాచలనంబుతో, భుజనట ద్ధమ్మిల్ల బంధంబుతో,
శాటీముక్త కుచంబుతో, సదృఢ చంచత్కాంచితో, శీర్ణలా
లాటాలేపముతో, మనోహర కరాలగ్నోత్తరీయంబుతో

గోటీందు ప్రభతో, నురోజభర సంకోచద్వలగ్నంబుతోన్,

అడిగెద నని కడు వడి జను
నడిగిన దన మగడు నుడువడని నడ యుడుగున్
వెడవెడ చిడిముడి తడబడ
నడు గిడు; నడుగిడదు జడిమ నడు గిడునెడలన్

ఇలా సంశయముతో శ్రీలక్ష్మీదేవి 'మెఱుగుదీవయు బోలె జలదవర్ణు వెనక' చనుదెంచెను.

వినువీథిం జనుదేర గాంచి రమరుల్ విష్ణు సురారాతి జీ
వనసంపత్తి నిరాకరిష్ణు గరుణావర్ధిష్ణు యోగీంద్ర హృ
ద్వన వర్తిష్ణు సహిష్ణు భక్త జనబృంద ప్రాభవాలంకరి
ష్ణు నవోఢోల్లస దిందిరా పరిచరిష్ణున్ జిష్ణు రోచిష్ణునిన్.

ఇట్లు పొడగని

చనుదెంచెన్ ఘనుడల్లవాడె; హరిపజ్జం గంటిరే లక్ష్మి? శం
ఖ నినాదం బదె; చక్ర మల్లదె; భుజంగ ధ్వంసియున్ వాడె క్ర
న్నన నేతెంచె నటంచు వేల్పులు <u>నమోనారాయణా</u> యేతి ని
స్వనులై మ్రొక్కిరి మింట హస్తిదురవస్థావక్రికిం జక్రికిన్.

గజేంద్ర పరిరక్షణ – 18వ శతాబ్దపు చిత్రం. వికీపీడియానుండి

ఆ య్యవసరంబునం గుంజరేద్ర పాలన పారవశ్యంబున దేవతా నమస్కారంబు లంగీకరింపక, మనస్సమాన సంచారుండై పోయి పోయి, కొంతదూరంబున శింశుమార చక్రంబునుం బోలె గురు మకర కుళీర మీన మిథునంబై, కిన్నరేంద్రుని భాండాగారంబునుంబోలె స్వచ్ఛవరకచ్ఛపంబై, భాగ్యవంతుని భాగధేయంబునుం బోలె సరాగజీవనంబై, వైకుంఠ పురంబునుంబోలె శంఖచక్ర కమలాలంకృతంబై, సంసార చక్రంబునుం బోలె ద్వంద్వసంకుల పంక సంకీర్ణంబై యొప్పు న ప్పంకజా కరంబు బొడగని.

కరుణా సింధుడు 'బహు విధ బ్రహ్మాండ భాండచ్ఛటాంతర నిర్వక్రము, పాలితాఖిల సుధాంధశ్చక్రము'నైన చక్రమును ప్రయోగించెను. ఆ సుదర్శనము 'హృద్వేగమై, భీమంబై తల ద్రుంచి' గ్రాహము తల ద్రుంచెను.

కరుణా సింధుడు సౌరి వారి చరమున్ ఖండింపగా బంపె స
త్వరితాకంపిత భూచక్రము మహోద్యద్వి స్ఫులింగ చ్ఛటా
పరిభూతాంబర శుక్రమున్ బహు విధ బ్రహ్మాండ భాండచ్ఛటాం
తర నిర్వక్రము బాలితాఖిల సుధాంధశ్చక్రముం జక్రమున్.

అంభోజాకర మధ్య నూతన నళిన్యాలింగన క్రీడనా
రంభుండైన వెలుంగుఱేని చెలువారన్ వచ్చి నీటన్ గుభుల్
గుంభధ్వానముతో గొలంకును గలంకం బొందగా జొచ్చి దు
ష్టాంభోవర్తి వసించు చక్కటికి డాయంబోయి హృద్వేగమై.

భీమంబై తల ద్రుంచి ప్రాణముల బాపెం జక్ర మాశు క్రియన్
హేమక్ష్మాధర దేహముం జకితవన్యేభేంద్ర సందోహముం
గామ క్రోధన గేహమున్ గరటి రక్త స్రావ గాహంబు ని
స్సీమోత్సాహము వీత దాహము జయశ్రీ మోహమున్ గ్రాహమున్.

ఇట్లు నిమిష స్పర్శనంబున సుదర్శనంబు మకరి తల ద్రుంచు నవసరంబున.

మకర మొకటి రవి జొచ్చెను
మకరము మఱియొకటి ధనదు మాటున డాగెన్;
మకరాలయమున దిరిగెడు
మకరంబులు కూర్మరాజు మఱువున కరిగెన్.

తమముం బాసిన రోహిణీ విభుక్రియన్ దర్పించి సంసారదుః
ఖము వీడ్కొన్న విరక్త చిత్తుని గతిన్ గ్రాహంబు పట్టూడ్చిన పా
దము లల్లార్చి కరేణుకావిభుడు సౌందర్యంబుతో నొప్పె సం
భ్రమదాశాకరిణీ కరోజ్ఝిత సుధాంభస్స్నాన విశ్రాంతుడై.

పూరించెన్ హరి పాంచజన్యము గృపాంభోరాశి సౌజన్యమున్

భూరిధ్వాన చలాచలీకృత మహాభూత ప్రచైతన్యమున్
సారోదారసిత ప్రభాచకిత వర్జన్యాది రాజన్యమున్
దూరీభూత విపన్నదైన్యమును దిర్ధూతద్విషత్సైన్యమున్.

నిడుద యగు కేల గజమును
మడువున వెడలంగ దిగిచి మదజల రేఖల్
దుడుచుచు మెల్లన పుడుకుచు
నుడిపెన్ విష్ణుండు దుఃఖ ముర్వీనాథా!

శ్రీ హరి కర సంస్పర్శను
దేహము దాహంబు మాని ధృతి గరిణీ సం
దోహంబు దాను గజపతి
మోహన ఘీంకార శబ్దములతో నొప్పెన్.

కరమున మెల్లన నివురుచు
గర మనురాగమున మెఱసి కలయం బడుచుం
గరి హరికతమున బ్రదుకుచు
గర పీడన మాచరించె గరిణుల మరలన్.

శాపవిముక్తుడై, గ్రాహరూపంబు మాని, 'హూహూ' నామ గంధర్వుడప్పుడు నిర్మల తనువు దాల్చి 'హరికి నవ్యయునకు నతిభక్తితో మ్రొక్కి, తవిలి కీర్తించి' దళితపాపుడగుచు తన లోకమునకేగెను.

అరవింద మందిరయగు నయ్యిందిరాదేవి మందస్మిత చంద్రికా వదనారవింద యగుచు ముకుందునకిట్లనియె.

దీనుల కుయ్యాలింపను
దీనుల రక్షింప మేలు దీవన బొందన్
దీనావన! నీకొప్పును
దీన పరాధీన! దేవదేవ! మహేశా!

ఈ కృష్ణానుభావమైన గజరాజమోక్షణ కథ వినువారికి యశములిచ్చును. కల్మష మపహరించును. దుస్స్వప్న నాశన మొనర్చును. దుఃఖము సంహరించును. విభవమమరును. సంపదలు కలుగును. పీడలు శాంతించును. సుఖము సిద్ధించును. శోభనములు వర్ధిల్లును. మోక్షము అందివచ్చును. ముదము చేరును. అనుచు విష్ణుడు ప్రీతుడై యానతిచ్చెను.

గజరాజ మోక్షణంబును
నిజముగ బఠియించునట్టి నియతాత్ములకున్
గజరాజ వరదుడిచ్చును

గజ తురగ స్యందనములు గైవల్యంబున్

ఇది శ్రీ పరమేశ్వర కరుణాకలిత కవితా విచిత్ర కేసనమంత్రిపుత్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రణీతంబైన శ్రీమహాభాగవత పురాణంబను మహాప్రబంధంబునందు కరిమకరి యుద్ధంబును, గజేంద్ర రక్షణంబును నను కథలుగల యష్టమ స్కంధము సంపూర్ణము,.

(పద్యములు వికీసోర్సునుండి కాపీ చేయడమైనది.
మరియు శ్రీయుతులు వాడపల్లి శేషతల్పశాయి, కాలెపు నాగభూషణరావులు నిర్వహిస్తున్న 'ఆంధ్రభారతి' వెబ్ సైటును కూడ సంప్రదించాను http://www.andhrabharati.com/)

---

338. అశోకః

- శోకములను నాశనము చేయువాడు (శ్రీ భట్టుల వ్యాఖ్య)
- శోకము లేని మూర్తి (శ్రీ శంకరుల వ్యాఖ్య).

ఓం అశోకాయ నమః

శ్రీ శంకరుల వ్యాఖ్య, శ్రీ భట్టుల వ్యాఖ్యలందున్న స్వల్ప భేదము భగవానుని సచ్చిదానంద స్వభావమును రెండు కోణములనుండి ప్రకాశింపజేయుచున్నవి.

అశోకః శోకమోహాది నాశకః పరికీర్తితః – దుఃఖము, మోహము, భయము, ఆకలి వంటి బాధలను నాశనము చేయువాడు గాన భగవంతుడు అశోకుడు.

శోకాది షడూర్మి రహితః అశోకః – శోకము, మోహము, ఆకలి, దప్పిక, జర, మరణము అనే ఆరింటినీ 'షడూర్ములు' అంటారు. ఇట్టివి లేనివాడు గనుక ఈశ్వరుడు అశోకుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్యననుసరించి ఈ నామముల ప్రభావము ఇలా ఉన్నది.

(337) **పురందరః** – అధిదైవిక భయములను హరించు పుణ్యనామము.

(338) **అశోకః** – ఆధ్యాత్మిక భయములను హరించు దివ్యనామము.

(339) **తారణః** – అధిభౌతిక భయములను హరించు శుభ నామము.

(340) **తారః** – సంసార సాగరమును దాటించు మంగళనామము.

పురందరః అశోకః తారణః తారః – అనే నామములు కలిపి సకల భయములను పరిహరించి శుభములు చేకూర్చు అభయ మంత్రము.

ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదాం
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్.

339. తారణః

దరి చేర్చువాడు. ఆపదలను హరించువాడు.

ఓం తారణాయ నమః

తారయతి ఇతి తారణః – భయములనుండి రక్షించువాడు తారణుడు. సంసార సాగరమును దాటించువాడు. కష్టములనుండి కడతేర్చు కొండలరాయని కరుణాస్వభావ కీర్తనను కొనసాగిస్తూ శ్రీ భట్టులు ఈ 'తారణః' అను నామము అధిభౌతిక దుఃఖములను పరిమార్చునని వ్యాఖ్యానించారు.

సంసార సాగరమును దాటించు గుణమును ఈ 'తారణః' నామము చాటుచున్నదని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. అయితే అదే గుణమును శ్రీ భట్టులు తరువాతి నామమైన 'తారః'కు అన్వయించారు.

శ్రీ చిన్మయానంద ఈ 'తారణః', 'తారః' నామములలోని సూక్ష్మ భేదమును ఇలా వివరించారు – సంసార సాగరమును దాటుటకు సాయము చేయువాడు అని ఒక నామము, స్వయముగా దాటించువాడు అని మరొక నామము తెలుపును. కొన్ని సందర్భములలో భక్తి మార్గము అనుసరించినవానికి, అచ్యుతునకు శరణాగతుడైనవానికి లభించే చేయూతలలోని భేదమును ఈ నామముల అన్వయములో గ్రహింపవచ్చును.

తెలుగులో కొన్ని పాటలు –

- అందరిని దరిజేర్చు మారాజువే, అద్దరిని చేర్చమని అడుగుతుండావే.
- పడవెళ్ళి పోతోందిరా మానవుడా, దరి చేరే దారేదిరా.
- నడిపించు నా నావా, నడి సంద్రమున దేవా.
- సుడిగాలిలో దీపంలా ఉన్నామయా, నీ నీడవల్లనే నిలిచేమయ్యా

340. తారః

రక్షించువాడు. భయంకరమగు గర్భనరకమునుండి జీవులను కాపాడువాడు.

ఓం తారాయ నమః

ఈ నామము రెండుమార్లు వచ్చినది.

37వ శ్లోకము. 340వ నామము. తారః – **అశోకః తారణః తారః శూరః శౌరిర్జనేశ్వరః**

404వ శ్లోకము. 968వ నామము. తారః – **భూర్భువస్స్వస్తరుస్తరుః తారః సవితా ప్రపితామహః**

తార స్సంసార భయతో నిత్యం తారయతీతి సః – గర్భ జన్మ జరా మరణ సంసార సాగర మహాభయాత్ తారయతి తస్మాత్ ఉచ్యతే తారః – గర్భావాసము, జన్మము, ముసలితనము, మరణము ఇవి మరల మరల

సంభవించు క్లేశములు. అట్టి క్లేశములతో కూడిన సంసార సాగరములో చిక్కుకొని పోవు భయమునుండి రక్షించువాడు తారుడు.

జన్మ దుఃఖం జరాదుఃఖం జాయా దుఃఖం పునఃపునః
సంసార సాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత

పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనమ్
ఇహ సంసారే బహుదుస్తారే కృపయా పారే పాహి మురారే
భజ గోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే.

341. శూరః

పరాక్రమశీలి. విజయ స్వరూపుడు.

ఓం శూరాయ నమః

శ్రీ శంకరుల పాఠం ప్రకారం 'శూరః' అనే నామం ఒక్కమారు వస్తుంది. అది ఈ 37వ శ్లోకంలోని 341వ నామము – **అశోకః తారణః తారః శూరః శౌరిః జనేశ్వరః.**
69వ శ్లోకం మొదటిపాదం శ్రీ శంకరుల పాఠంలో **'కాలనేమినిహా వీరః శౌరిః శూరజనేశ్వరః'** అని ఉండగా, శ్రీ భట్టుల పాఠంలో **'కాలనేమినిహా శౌరిః శూరః శూరజనేశ్వరః'** అని ఉంది. కనుక శ్రీ భట్టుల పాఠం ప్రకారం 'శూరః' నామము రెండుమార్లు వస్తుంది.
37వ శ్లోకం. 341వ నామము. శూరః – **అశోకః తారణః తారః శూరః శౌరిః జనేశ్వరః**
69వ శ్లోకము. 650వ నామము. శూరః – **కాలనేమినిహా శౌరిః శూరః శూరజనేశ్వరః**
341వ నామమును భగవంతుని శౌర్యగుణం పరంగాను, 650వ నామమును రామావతారపరంగాను శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

'శు' అనే ధాతువునకు 'ముందుకు పోవుట' అనే అర్థమున్నది. దీనినుండి విజయేచ్ఛను గ్రహింపవచ్చును. విక్రమము విజయమునకు సాధనము. **విజిగీషు తయా జైత్య సమర్థ శ్శూర ఉచ్యతే** – జయించు కోరిక గలవాడు శూరుడు. శత్రువులను నిర్జించువాడు. నమ్మినవారిని కాచువాడు. అపజయ మెరుగనివాడు.

'శు' – ముందుకు పోవుట – అనే లక్షణమును వక్కాణిస్తూ శ్రీ వి.వి. రామానుజన్ దివ్యప్రబంధములనుండి ఉదాహరణలు చెప్పారు.
తిరుప్పావై 24 – **శెన్రంగు తెన్నిలంగై శెత్తామ్ తిఱళ్ పోత్తి** – మిక్కిలి సంపదతో గర్వించియున్న లంకాపురిని ధ్వంసము చేసిన మీ మహాబలమునకు మంగళము.

పెరియాళ్వార్ తిరుమొళి 5.3.4 – **శెన్టంగు వాణనై ఆయిరమ్ తోళిమ్ తెన్టిత్తిసై తిసై వీడచెట్టై**
రెండుచోట్లా 'శేన్టు' అన్న పదమును గమనించదగును.

దైనందిన జీవనములో ఈ నామస్మరణ ప్రాశస్త్యమును ధర్మచక్రము రచయిత వివరించారు. దేవదానవ పోరాటములలో ముందుగా దానవులు గెలిచినట్లనిపించినప్పటికీ, దేవతలు శ్రీమహావిష్ణువును శరణుజొచ్చి, ఆయన కృపతో అంతిమ విజయమును పొందుతారు. ఇదే విధముగా మన జీవితములో దుర్గుణములు చాలా బలవత్తరముగా మనిషిని లొంగదీసికొనుచుండును. అప్పుడు శూరుడైన నారాయణుని శరణువేడి మనిషి సద్గుణ సంపన్నుడు కావచ్చును.

ఖరకర వంశజా విను మఖండిత భూత పిశాచ ఢాకినీ
జ్వర పరితాపము సర్వభయ వారకమైన భవత్పదాబ్జ వి
స్ఫుర వజ్ర పంజరము జొచ్చితి నీయెడ దీన మానవో
ద్ధర బిరుదాంక యేమఱకు దాశరధీ కరుణా పయోనిధీ.
సూర్యవంశజా! రామా! శ్రీరామా! సీతారామా! భయంకరమగు భూత ప్రేత పిశాచ వ్యాధి సర్ప భయములను తొలగించు నీ పాదముల శరణు జొచ్చితిని. కరుణాపయోనిధీ! కాపాడు.

342. శౌరిః

- వసుదేవుడు, దశరధుడు వంటి శూరులకు పుత్రునిగా జన్మించినవాడు (శ్రీ భట్టుల వ్యాఖ్య).
- శూరుని వంశములో జన్మించినవాడు. శూరసేనుని పుత్రుడు వసుదేవుడు. వసుదేవుని పుత్రుడు శ్రీకృష్ణుడు. (శ్రీ శంకరుల వ్యాఖ్య).
- యాదవులందు 'శూర' సంతతికి చెందినవాడు (శ్రీ రాధాకృష్ణ శాస్త్రి వ్యాఖ్య).

ఓం శౌరయే నమః

ఈ నామము రెండుమార్లు వచ్చును.
37వ శ్లోకము. 342వ నామము. శౌరిః – **అశోకస్తారణస్తారః శూరః శౌరిః జనేశ్వరః**
67వశ్లోకములో 'శౌరిః' నామము వచ్చే క్రమం శ్రీ భట్టుల పాఠములోను, శ్రీ శంకరుల పాఠములోను కొంత భేదం కనిపిస్తుంది.
కాలనేమినిహా శౌరిః శూరః శూరజనేశ్వరః (శ్రీ భట్టుల పాఠము ప్రకారము)
కాలనేమినిహా వీరః శౌరిః శూరజనేశ్వరః (శ్రీ శంకరుల పాఠము ప్రకారము)
కనుక ఎలా చూసినా 'శౌరిః' నామము రెండుమార్లు వస్తుంది.

మొదటి అర్థము (శూరుల పుత్రుడు)ను వివరిస్తూ శ్రీ వి.వి. రామానుజన్ చెప్పిన ఉదాహరణ –

ఒడతతోల్ వలియన్ నందగోపకుమరన్

దయరఱక్కు మగనాయిత్ తోన్టి

శ్రీ శంకరుల వ్యాఖ్య (శూర వంశము) – **శూరస్య గోత్రాపత్యం పుమాన్ శౌరిః – శూర కులోద్భవాత్ శౌరిః** యాదవులలో ఒక వర్గమును 'శూరులు' అనేవారు. వసుదేవుడు ఆ వర్గము(గోత్రము)నకు చెందినవాడు. కనుక వసుదేవుని పుత్రుడు 'శౌరి' అని శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరించారు.

కృష్ణోపనిషత్తు (అధర్వణ వేదాంతర్గతము)నందు చెప్పబడినట్టి శ్రీకృష్ణావతార కారణము (డా. క్రోవి పార్థసారధి విష్ణు సహస్ర నామ భాష్యము 'శ్రీకైవల్య సారధి' నుండి).

రామావతారములో సర్వాంగసుందరుడైన రామచంద్రుని చూచి మునీశ్వరులంతా – శ్రీరామచంద్రా! నిన్న ఆలింగనము చేసుకొనే భాగ్యము మాకు ప్రసాదించ వలసినది – అని వేడుకున్నారు. ఆ మాటలు విన్న శ్రీరామచంద్రుడు – కృష్ణావతార సమయమున మీరు గోపికలుగా జన్మించండి. మీ కోరిక తప్పక నెరవేరుతుంది – అన్నాడు. దానికి వారంతా గోపికలు, గోపాలురుగా జన్మించడానికి సంతోషముగా ఒప్పుకొన్నారు.

నందుడు – పరమానందము; యశోద – ముక్తి కాంత; దేవకి – వేదములచే చెప్పబడిన బ్రహ్మపుత్రిక; వేదము – వసుదేవుడు; వేదార్థము – కృష్ణుడు; ఋక్కులు – గోపికలు, గోవులు; బ్రహ్మ – గోవులను కట్టివేసే కర్ర; రుద్రుడు – వెదురుకర్ర; ఇంద్రుడు – శిరస్సు; దేవతలు – స్నేహితులు; వైకుంఠము – గోపకులము; మహర్షులు – అక్కడి చెట్లు; రాక్షసులు – క్రోధము, లోభము; తిరస్కరింపబడువాడు – కవి; శ్రీకృష్ణుడు – సాక్షాత్తు మహావిష్ణువు;

ఋక్కులు, ఉపనిషత్తులు – స్త్రీలు; ద్వేషము – చాణూర మల్లుడు; మత్సరము – ముష్టికుడు; దర్పము – కువలయాపీడనము (ఏనుగు); గర్వము – బకాసురుడు; దయ – రోహిణీమాత; భూదేవి – సత్యభామ; మహావ్యాధి – అఘాసురుడు; కలిపురుషుడు – కంసుడు; శమము – సుదాముడు; సత్యము – అక్రూరుడు; దమము – ఉద్ధవుడు

ఆదిశేషుడే బలరాముడు. సత్యము, నిత్యము అయిన పరబ్రహ్మమే శ్రీకృష్ణుడు. పాలసముద్రములో పుట్టిన మేఘధ్వని కల శంఖము లక్ష్మీరూపమైన విష్ణువు.

పాలసముద్రము – పాలకుండలు; చక్రము – బ్రహ్మ; చామరము – అక్కడి వాయువు; ఖడ్గము – మహేశ్వరుడు; కశ్యపుడు – రోలు; అదితి – త్రాడు; కాళిక – గద; విష్ణుమాయ – శార్ఙ్గమనే ధనుస్సు; శరత్కాలము – భోజనము; జగద్బీజము – తామరకాడ; గరుడుడు – వటవృక్షము; బృందాదేవి – భక్తి

శ్రీమహావిష్ణువు బాలుడై పాలకుండలతో క్రీడించాడు. శత్రువులను సంహరించడానికి, మిత్రులను రక్షించడానికి, అన్ని జీవులయందు దయ చూపడానికి కృష్ణుడైనాడు. సాక్షాత్తు వైకుంఠమే భూమికి

దిగివచ్చింది. ఈ విధంగా దేవకీ వసుదేవులకు పుత్రుడై అవతరించిన శ్రీమన్నారాయణుడు పుట్టీపుట్టగానే తన మహిమలు చూపించిన శౌరి. హరేకృష్ణ.

343. జనేశ్వరః

- జనులకు, సకలప్రాణులకు ప్రభువు.
- జనులకు ఐశ్వర్యమును ప్రసాదించువాడు.

ఓం జనేశ్వరాయ నమః

జనానాం జంతూనాం ఈశ్వరః – జన్మించిన, సృష్టింపబడిన సకల ప్రాణులకు శ్రీమన్నారాయణుడే ప్రభువు. **వినా వేంకటేశం న నాథో న నాథః** – అందరికీ దారి చూపువాడు భగవానుడే. కష్టాలలో ఉన్నవారు కూడ భగవంతునికి మ్రొక్కి పునీతులగుదురు.

రెండవ అర్థము – జనులకు ఐశ్వర్యమును ప్రసాదించువాడు జనేశ్వరుడు – శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఈ అర్థాన్ని చెప్పారు.

344. అనుకూలః

హద్దులలో, అందుబాటులో ఉండువాడు. భక్తసులభుడు.

ఓం అనుకూలాయ నమః

'కూలము' అనగా ఒడ్డు, దరి. **కూలమ్ వర్తతే ఇతి అనుకూలః** – హద్దులలో ఉండువాడు అనుకూలుడు. భక్తికి చిక్కువాడు. ఇది ఆయన అనుకూల్య స్వభావము. భగవానుడు సర్వేశ్వరుడు,అనంతుడు, అమితవిక్రముడు, జనేశ్వరుడు అయినాగాని అందరికీ అందెడివాడు కూడాను (శ్రీ అణ్ణంగారాచార్య స్వామి వివరణ).

శ్రీ వి.వి. రామానుజన్ – **యది శక్నోషి గచ్ఛత్వమ్ అతి చంచల చేష్టితః** – నీకు చేతనైతే విడిపించుకోరా అల్లరి కన్నా! అని యశోద బాలగోపాలుని రోట బంధించెను.

స్వభావతో మహత్వేఽపి మద విస్మయ వర్జనాత్
భక్తైక ప్రవణో నిత్యం అనుకూల ఇతి స్మృతః

సహజమైన మహత్వము కలిగియుండికూడా ఆ పరమేశ్వరుడు గర్వము లేనివాడు, మరియు భక్తులకు అందియుండేవాడు కనుక అనుకూలుడు.

శ్రీరాముడు **'వీర్యవాన్ న చ వీర్యేణ మహతాస్వేన విస్మితః'** మహావీరుడైనా గాని తన వీరత్వము గురించి స్మృతి లేనివాడు (పట్టించుకొననివాడు).

శ్రీ చిన్మయానంద – సర్వసాక్షియైన భగవానుడు అంతటినీ చూచుచున్నాగానీ, మౌనముగానుండును (అడ్డము రాడు). అలా ఆయన హద్దులలోనుండు అనుకూలుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – 'అనుకూలము' అనగా దరికి వోవునది. సంసార సాగరమును దాటుటకు సాయము చేయువాడు అనుకూలుడు.

ధర్మచక్రము రచయిత – భగవానుడు అంతర్యామి. మనోసాక్షి. కనుక అందరికీ అందుబాటులోనుండును. మనము చేయు పనిలోని తప్పును మనస్సాక్షి హెచ్చరిస్తూనే ఉంటుంది. ఇలా మనకు తప్పొప్పులు తెలియజేయు దగ్గరి గురువు గనుక భగవంతుడు అనుకూలుడు.

345. శతావర్తః

నూరు ఆవర్తనములు (సుడులు) గలవాడు, అనగా

- ధర్మ సంస్థాపనార్థము అనేక అవతారములు ధరించినవాడు.
- శరీరములోనున్న శతాధిక నాడులయందు ప్రాణరూపమున సంచరించువాడు.
- విజృంభించి, సుడులు తిరుగుచున్న అనేక ఐశ్వర్యములు గలవాడు.
- సంసార చక్రము, గ్రహచక్రము, నక్షత్రచక్రము, యుగచక్రము వంటి ఎన్నో చక్రములను సంచరింపజేయువాడు.

ఓం శతావర్తాయ నమః

శత – నూరు – అన్న పదమునకు 'లెక్క లేనన్ని' అనే అర్థాన్ని గ్రహించాలి. 'ఆవర్తనము' అనగా భ్రమణము, చక్రము, సంచలనము, పునరావృతము. **ధర్మ సంస్థాపనార్థాయ యుగే యుగే** – అన్న గీతావాక్యానుసారము భగవానుడు ధర్మసంస్థాపనము కొరకు, దుష్టశిక్షణ కొరకు, శిష్ట రక్షణ కొరకు మరల మరల అవతరించును. ఆయన అవతారములకు, విభూతులకు లెక్క లేదు.

నాడీ శతే ప్రాణరూపేన వర్తతా ఇతి వా – శరీరములో వందలాది నాడులలో ప్రాణరూపమున సంచరించును గనుక శతావర్తుడు. పై రెండు అర్థములును శ్రీ శంకరుల వ్యాఖ్యానుసారమున్నవి. వీనిని (శతావర్త లక్షణమును) వివరిస్తూ పెక్కు రచనలున్నవి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ మరియు ధర్మ చక్రము రచయిత – భగవానుని శతావర్త గుణ సంపదను ఎల్లెడలా మనము అనుభవింపవచ్చును. ఆయన సూర్యభగవానుడై ప్రతిదినము దర్శనమిచ్చి ప్రాణులను వోషించును. **సర్వస్య ఆవృతమ్ అనావర్తే** (అధర్వణ వేదము 10.5.37). భగవానుడు పాండవులను ఎన్నో ఆపదలనుండి మరల మరల కాపాడిన ఆత్మబంధువు. ద్రౌపదిని కురుసభలో మానభంగము కాకుండా,

అరణ్యవాసములో అతిథిగా వచ్చిన దూర్వాసుని శాపమునకు గురి కాకుండా సంరక్షించినవాడు. హరి సర్వోపగతుడన్న ప్రహ్లాదుని మాట పొల్లుపోకుండా స్తంభమునుండి శ్రీనారసింహమూర్తియై అవతరించి తన భక్తుని కాచినాడు. కృష్ణుడై గోవులను, గోపాలురను, యాదవులను కాచెను.

ఐశ్వర్య జృంబితాభిఖ్యాః ఆవర్తా నిత్యశః
శతం సంతి శతావర్తః వస్వర్ణో భక్తిముక్తిదః
'ఆవర్త' అనగా సుడిగుండము. అనంతములైన ఆయన ఐశ్వర్యములు సుడులు తిరుగుచున్నవి. కనుక ఆయన శతావర్తుడు. ఈ అష్టాక్షరీ పుణ్యనామ మంత్రమును జపించినయెడల భుక్తి, ముక్తి లభించునని శ్రీ భట్టుల వ్యాఖ్య. అనంతైశ్వర్యసంపన్నుడైనా ఆయన ఎంతో ప్రేమతో భక్తులకు అందుబాటులో నుండును.
ఓం శతావర్తాయ నమః.

శాంతోదిత విజ్ఞాన ప్రాణాయ – ప్రశాంతమైన మరియు వృద్ధి చెందుతున్న జ్ఞానము, ప్రాణము అయినవానికి – అని పరవాసుదేవుని స్మరించు మంత్రము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ 'ఆవర్త' అనగా చక్రము అనే అర్ధములో ఇలా వ్యాఖ్యానించారు. సంసార చక్రమున జన్మలను పరిభ్రమింపజేయువాడు, కాలచక్రమును త్రిప్పువాడు, నక్షత్రగ్రహ మండలములను పరిభ్రమింప జేయువాడు భగవానుడు శతావర్తుడు.

334 నుండి 345వరకు – 'వాసుదేవ' నుండి 'శతావర్త' వరకు – నామములు భగవంతుని పరవాసుదేవ తత్వమును తెలియజేయును. 346వ నామము 'పద్మీ' నుండి – భగవంతుని పరవాసుదేవ స్వరూపమును వర్ణించు నామములు ప్రారంభమగునని శ్రీభట్టుల విశ్లేషణ.

346. పద్మీ

పద్మమును చేత ధరించినవాడు.

ఓం పద్మినే నమః

భగవంతుడు శంఖ చక్ర గదా పద్మ ధారి. ఆయన ధర్మ, జ్ఞాన, వైరాగ్య, ఐశ్వర్య గుణములలోని సాత్వికత్వమునకు ఈ పద్మము చిహ్నము.

శ్రీ చిన్మయానంద – పద్మము జ్ఞానమునకు సంకేతము. అది అందుకొనమని శంఖనాదముతో మనకు తెలియజెప్పును. పెడదారి బట్టినవారిని చక్రముతోను, గదతోను ఖండించును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – నిజమైన జ్ఞానమునకు నిలయము గనుక భగవానుడు పద్మి. (ఇక్కడ 'పద్మము' అనగా జ్ఞానము అని అర్థము. సంకేతము కాదు.)

347. పద్మనిభేక్షణః

పద్మమువంటి కన్నులు గలవాడు. చల్లని చూపులు గల స్వామి.

ఓం పద్మనిభేక్షణాయ నమః

భగవంతుని చూపు చల్లనిది. తాపములను హరించునది. జ్ఞానము నొసగునది. మోక్షమును ప్రసాదించునది.

శ్రీ వి.వి. రామానుజన్ ప్రబంధములనుండి ఉదాహరించారు.

నాచియార్ తిరుమొళి (2.4) – **ఉన్ ముగమ్ మైయాల్ ఎట్టై మయక్కుమ్ మాయ మందిరమ్ తాన్ కోలో? చెయ్య తామరాయిక్ కణ్ణినాయ్.**

తిరుపైమోళి (6.2.7) – **ఉవగైయాల్ నేన్జమ్ ఉళ్ళురుగి ఉనతామరాయి క్కణ్ విడిగళిన్ అగవలైప్పడుప్పన్.**

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – **అనుకూలః శతావర్తః పద్మీ పద్మనిభేక్షణః** – అనే నామములు వరుసలో వచ్చుటవల్ల భగవానుని ఆపన్న శరణాగత రక్షణా గుణమును తెలియజెప్పడమైనది.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

పద్మనాభోఽరవిందాక్షః పద్మగర్భః శరీరభృత్ |
మహర్ధిర్బుద్ధో వృద్ధాత్మా మహాక్షో గరుడధ్వజః || (38)

348. పద్మనాభః

- పద్మమువంటి నాభి (బొడ్డు) కలవాడు.

- హృదయపద్మము నడుమనుండువాడు.

- జ్ఞానులకు వికసించిన జ్ఞానము. అజ్ఞానులకు కానరానివాడు.

ఓం పద్మనాభాయ నమః

ఈ నామము మూడుమార్లు వస్తుంది.

6వ శ్లోకము -48వ నామము -పద్మనాభః – **అప్రమేయో హృషీకేశః పద్మనాభః అమరప్రభుః**

21వ శ్లోకము - 198వ నామము -పద్మనాభః – **హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః**

38వ శ్లోకము -348వ నామము - పద్మనాభః – **పద్మనాభః అరవిందాక్షః పద్మగర్భః శరీరభృత్**

ప్రస్తుత (348వ) నామము పరవాసుదేవుని దివ్య సౌందర్యమును వివరించు సందర్భమున చెప్పబడినది. 'పద్మనాభః' అనగా బొడ్డున తామరపూవు గలవాడు. మరొక వివరణ – అందరి హృదయపద్మమునకు మధ్యనుండువాడు. ఇంకొక వివరణ – శ్రీవాసుదేవుని నాభినుండి సకల విశ్వము అష్టదళ పద్మమువలె ఉద్భవించినది. అందు మధ్యమున మేరుపర్వతమున్నది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ వ్యాఖ్యానము మరల విలక్షణముగా నున్నది – 'పూవు' (పద్మ) అనగా వికసించి, రంగులతో రాజిల్లి, అందరకూ కనుపించి, కనువిందు చేయునది. 'నాభ్' అనగా అంతగా కనుపించనిది. మరుగైనది. కనుక 'పద్మనాభుడు' అనగా విరుద్ధములనిపించే రెండు భిన్నగుణములను ఒకేమారు

ప్రదర్శించువాడు. ఘటనాఘటనశీలి. జ్ఞానులలో విద్య, అజ్ఞానులకు మోహము. భక్తులకు దర్శనమిచ్చే భక్తసులభుడు, ఇతరులకు తెలియరానివాడు. పగలు వికసించి, రాత్రి ముకుళించు పద్మము వంటివాడు. పద్మనాభుడు.

349. అరవిందాక్షః

- అరవిందము (తామరపూవు) వంటి కన్నులు గలవాడు.
- సూర్యచంద్రులు తన కన్నులైనవాడు.

ఓం అరవిందాక్షాయ నమః

అరవింద సదృశే అక్షిణి అస్య ఇతి అరవిందాక్షః – తామరపూవువంటి కన్నులు గలవాడు అరవిందాక్షుడు. **రామః కమలపత్రాక్షః** (సుందరకాండము). ఇంకా శ్రీ వి.వి. రామానుజన్ దివ్య ప్రబంధములనుండి చాలా ఉదాహరణలిచ్చారు. 40వ నామము '**పుండరీకాక్షః**' భావము కూడ ఇలాంటిదే.

శ్రీ చిన్మయానంద – సూర్యోదయమున వికసించి, రాత్రి ముకుళించు అరవిందము వలెనే భగవంతుడు భక్తులపట్ల చల్లని చూపును ప్రసాదించును. భక్తులు కానివారికి పెడమొగమగును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'అర్' అనగా గతి, చలనము, భ్రమణము. 'విందతి' అనగా 'ప్రాప్నోతి' అనగా కలిగియున్నవాడు. పరిభ్రమించు సూర్యచంద్రులే తన కన్నులుగా కలవాడు గనుక శ్రీవాసుదేవుడు అరవిందాక్షుడు.

అనాది మధ్యాంతమనంత వీర్యమ్ అనంత బాహుమ్ శశిసూర్యనేత్రమ్
పశ్యామి త్వాం దీప్త హుతాశ వక్త్రం స్వతేజసా విశ్వమిదం తపంతమ్ – గీత 11.19
ఆదిమధ్యాంత రహితుడవు. అపరిమితశక్తిశాలివి. అసంఖ్యాకములైన భుజములు గలవాడవు. సూర్యచంద్రులు నీ నేత్రములు. అగ్నివలె నీ ముఖము ప్రజ్వరిల్లుచున్నది. నీ తేజస్సుతో ఈ జగమును సంతప్తమొనర్చుచున్నావు. అట్టి నిన్ను నేను చూచుచున్నాను.

350. పద్మగర్భః

- పద్మమునందు వసించియున్నవాడు.
- హృదయపద్మము మధ్యభాగమున విరాజిల్లువాడు.

ఓం పద్మగర్భాయ నమః

మృదువైన, సుగంధభరితమైన, సుందరమైన పద్మమునందు ఉన్నట్లుగా శ్రీపద్మావతీవల్లభుని ఆరాధింతురు. నారాయణుడు '**సరసిజాసన సన్నివిష్టః**' అని నిత్యస్తోత్రములందు చెప్పబడినది. **పద్మేన గౌర్యతే స్వాంతః అవస్థాప్యతే ఇతి** పద్మగర్భః.

తనను ధ్యానించు యోగుల హృదయకమలమున నుండువాడు. **దహరమ్ విపాప్మమ్ పరవేశ్మ భూతమ్ యత్ పుండరీకమ్.**

తణ్డామరై సుమక్కుమ్ పాద ప్పెరుమాన్ – తిరువైమొళి 4.5.8

శ్రీ శంకరుల వ్యాఖ్యానానుసారము – హృదయపద్మమున నిలుపుకొని ధ్యానింపదగినవాడు – **పద్మస్య మధ్యే ఉపాస్యత్వాత్** పద్మగర్భః.

351. శరీరభృత్

- యోగుల శరీరముల తానై కాపాడువాడు (పోషించువాడు).
- అన్నమువంటి ప్రాణరూపములతో శరీరముల పోషించువాడు.
- ధర్మరక్షణార్థమై వివిధ శరీరములను ధరించువాడు.

ఓం శరీరభృతే నమః

యోగి హృన్మధ్య కంజస్థ స్వదేహం తంబి భర్తియః శరీర భృత్వ కథితః వస్వర్ణో భుక్తి ముక్తిదః – యోగీశ్వరుల హృదయమునందు తన శరీరమునుంచి (తానై వసించి), వారికి భుక్తిని, ముక్తిని ప్రసాదించువాడు శరీరభృత్.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **శరీరం, స్వశరీరం భూతం ఉపాసకం బిభక్తి పుష్ణాతీతి శరీరభృత్** – యోగులు భగవంతుని గుణములను ధ్యానింతురు. ఆ గుణములే వారిని పోషించును. అనగా భగవంతుడు యోగులనే తన శరీరములుగా భావించి, వారి హృదయ కమలమున వెలసి, వారిని రక్షించును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **పోషయన్ అన్నరూపేణ ప్రాణరూపేణ వా శరీరిణామ్ ధారయతి ఇతి శరీరభృత్** – పరమేశ్వరుడు అన్నము రూపమునను, ప్రాణము రూమునను జీవుల శరీరములను ధరించును (నిలుపును) కనుక ఆయన శరీరభృత్.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – ధర్మ రక్షణకు, దష్కృతులను నాశనము చేయుటకు వివిధ రూపములలో అవతరించును గనుక ఆయన శరీరభృత్.

తరువాతి కొన్ని నామములు భగవంతుని మహోన్నతత్వమును కీర్తించుచున్నవి.

352. మహర్ధిః

అపారమైన బుద్ధి, ఐశ్వర్యము, విభూతులు గలవాడు. తరగని సంపద కలవాడు.

ఓం మహర్ధయే నమః

మహతీ బుద్ధిః విభూతిః అస్య ఇతి మహర్ధిః – అని శ్రీ శంకరుల వ్యాఖ్య. ఇక్కడ 'బుద్ధి' అనగా ఐశ్వర్యము, శక్తి, వైభవము కలిసిన విభూతి. అనంత శ్రీయుతుడు, అపారమైన శక్తిమంతుడు, లక్ష్మీనాధుడు, భక్తుల పాలిట కల్పవృక్షము, మహదైశ్వర్య సంపన్నుడు మహర్ధి.

భక్తుల యోగక్షేమములను వహించడానికై తరగని విభూతి కలవాడు మహర్ధి. **తద్యోగక్షేమ వహనే నిస్సీమ విభూతిః మహర్ధిః** – అని శ్రీ భట్టుల వ్యాఖ్య. తిరువైమొళి(4.5.1)నుండి శ్రీ వి.వి. రామానుజన్ చెప్పిన ఉదాహరణ – **విట్రిరిందు ఎళ్ ఉలగమ్ తనిక్కోల్ శెల్ల ఆళుమ్ అమ్మాన్.**

ధర్మచక్రము రచయిత రెండు విధాలైన ఐశ్వర్యాలను ప్రస్తావించారు. ఐహికమైన ధన కనక వస్తు వాహనాది సంపద (పోరుళ్ సెల్వమ్), సుగుణ కరుణాపూరితమైన సంపద (అరుళ్ సెల్వమ్). మొదటి విధమైన గుణసంపద ఎవరివద్దనైనా (మంచివారు గాని, చెడువారుగాని) ఉండవచ్చును. రెండవ విధమైన సంపద సత్పురుషులకు మాత్రమే స్వంతము.

రెండు విధాలైన ఐశ్వర్యాలు అనంతముగా కలిగినవాడు శ్రీమహావిష్ణువు. ఆయనను 'మహర్ధిః' అని ధ్యానించినవారికి ఉభయవిధైశ్వర్యములను ఆయన పుష్కలముగా ప్రసాదించును.

గజరాజ వరదుడిచ్చును

గజ తురగ స్యందనములు గైవల్యంబున్.

353. ఋద్ధః

- భక్తులయొక్క సమృద్ధిచేత తానుకూడ సమృద్ధుడగువాడు.

- విశ్వరూపుడై వర్ధిల్లుచుండువాడు.

ఓం ఋద్ధాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

30వ శ్లోకము. 279వ నామము. ఋద్ధః – **ఋద్ధః స్పష్టాక్షరో మంత్రః చంద్రాంశుః భాస్కరద్యుతిః**

38వ శ్లోకము. 353వ నామము. ఋద్ధః – **మహర్ధిః ఋద్ధో వృద్ధాత్మా మహాక్షో గరుడధ్వజః**

ఇంతకుముందు 279వ నామముగా 'ఋద్ధః' నామమునకు చెప్పిన భావము – అన్ని ఉత్తమ గుణములు సమృద్ధిగా కలిగిన పరిపూర్ణుడు. 'సమృద్ధి' అనే లక్షణము ఆధారముగానే 352వ నామము 'ఋద్ధః'కు కూడా భాష్యకర్తలు అర్థము చెప్పారు. **తత్సమృద్ధ్యాయః సమృద్ధస్స్వర్ధ ఉచ్యతే** – భక్తుల బాగోగులే భగవంతునికి నైవేద్యములు. భక్తులు వృద్ధినొందినపుడు భగవానుడు సంతసించి తృప్తుడై భాసిల్లును.

అభిషిచ్యచ లంకాయాం రాక్షసేంద్రం విభీషణం

కృతకృత్యః తదారామః విజ్వరః ప్రమోదహ

లంకకు రాక్షసరాజుగా విభీషణునికి పట్టాభిషేకం జరిపి, శ్రీ రామచంద్రుడు చింతలన్నీ తీరిపోయినాయని సంతసించాడు.

ప్రపంచ రూపేణ వర్ధమానత్వాత్ ఋద్ధః – విశ్వరూపమున విస్తరించుచుండును గనుక విశ్వేశ్వరుడు ఋద్ధుడు – అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు.

ధర్మచక్రము రచయిత – ఎవరికీ ఊహకందనంతగా దేవదేవుడు వర్ధిల్లును. ఈ సమృద్ధ గుణమును ధ్యానించినవారికే భగవానుడు అందివచ్చును.

354. వృద్ధాత్మా

మిక్కిలి పురాతనమైనవాడు. సంపూర్ణముగా వృద్ధిచెందినవాడు.

ఓం వృద్ధాత్మనే నమః

అత్యంత పురాతనమైన (వృద్ధమైన) ఆత్మ కలిగినందున (ఐనందున) భగవానుడు వృద్ధాత్ముడు. సృష్టికంటె ముందుగానున్నవాడు.

మహిమానాం చుళకయన్ సమృద్ధస్సర్వతోఽధికమ్

ఆత్మా స్వరూపమ్ యస్యేతి స వృద్ధాత్మేతి కథ్యతే

ఈ మహిమ అంతా ఒక మూల ఉండేటట్లుగా సర్వాధికముగా పెరిగిన దివ్యమైన ఆత్మస్వరూపము గలవాడు.

ధర్మచక్రము రచయిత వివరణ – గర్భావాసము, జననము, బాల్యము, యౌవనము, వృద్ధాప్యము, మరణము – ఇవి సాధారణ సంసార చక్రక్రమము. కాని శ్రీమహావిష్ణువును స్మరించి, మోక్షమార్గము నవలంబించి, వైకుంఠమును చేరినవారికి మరల జన్మము లేదు. అనగా వారు పరమపదమును చేరుకున్నారన్నమాట. అట్టివారే సంసారమునుండి సంపూర్ణమైన వృద్ధిని సాధించినవారగుదురు. కాని భగవంతుడు సృష్టికంటె ముందున్నవాడు. సంసారచక్రమున కతీతుడు గనుక వృద్ధాత్ముడు.

355. మహాక్షః

- గొప్ప (ఇరుసున్న) రథము గలవాడు. గరుడ వాహనుడు.
- గొప్పకన్నులు గలవాడు. అనంత నయనుడు.
- అందరికిని దారి చూపువాడు.

ఓం మహాక్షాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య అలంకారపరంగా సాగింది.

అక్ష స్తుతార్యోవహనాత్ రథాయవ సామ్యతః

మహాపూజ్యస్స యస్యాస్తి స మహాక్ష ఇతి స్మృతః

'అక్షము' అనగా ఇరుసు. ఒక వస్తువులోని భాగమును ఆ పూర్తివస్తువును సూచించే దానిగా చెప్పే అలంకారమును (పప్పన్నం ఎప్పుడు పెడతావు? ఎర్ర జెండా వచ్చింది. లాగా) అనుసరించి ఇరుసును 'రథము'ను సూచించేదానిగా వాడవచ్చును. మళ్ళీ 'రథము' అంటే 'వాహనము' అని గమనించాలి. కనుక బ్రహ్మాండమైన, పూజింపదగిన వాహనము గలవాడు. గరుడునిపై ఊరేగువాడు. మహాక్షుడు.

గరుత్మంతుడు మహావీరుడు. శ్రీమహావిష్ణువును సేవించే భాగ్యమును పొందినవాడు. అధర్వణ వేదములోని 'గరుడోపనిషత్తు'లో వైనతేయుడు విషాపహారి అని చెప్పబడినది. గరుత్మంతుడు వేదస్వరూపుడు – **దక్షిణ పాదము స్వస్తికము, ఎడమ పాదము కుంచితముగా ఉండి నమస్కరిస్తున్న గరుడుని నే ధ్యానింతును. హరికి ఇష్టుడైన గరుడుని ధ్యానింతును. నాగులచే సేవింపబడుతున్న కపిలాక్షుడు, బంగారు కాంతి గలవాడు, పొడవైన బాహువులు, పెద్ద మూపు గలిగి, నాగాభరణ భూషితుడై, మోకాళ్ళనుండి బంగారు రంగు గలవాడు, మొలపైన తెలుపు రంగు, కంఠమువరకు ఎరుపు రంగు, వంద చంద్రుల కాంతి గల ముక్కు, కిరీటముగల, విష్ణువునకు వాహనమైన గరుడునికి నమస్కారము.**

'అక్షి' అనగా కన్ను. ఈ అర్థములో శ్రీ శంకరులు – **మహతీ అక్షిణీ అస్య ఇతి మహాక్షః** – అని వ్యాఖ్యానించారు. భగవానుని అనంత నయనములు సకలమును బయట, లోపల కూడ చూచుచునే యుండును. **మహాన్తి అక్షిణి అస్య ఇతి మహాక్షః** – అని మరొక వ్యాఖ్యను కూడ శ్రీ శంకరులు చెప్పారు. దీని అర్థము – దివ్యమైన, శరీరముతో పనిలేని, అనంత ఇంద్రియములు గలవాడు. అంతటా కన్నులున్నవాడు.

ధర్మచక్రము రచయిత వివరణ – శ్రీమన్నారాయణుని చూపు పడినంతనే అజ్ఞాన మోహాంధకారములు పటాపంచలై జ్ఞానము విరాజిల్లును. మహాక్షుని ధ్యానించినవారికి ఆశామోహములు నశించి, జ్ఞానము లభించును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ‘అక్ష’ – ఇరుసు – రథము – నడిపించువాడు. అందరికి తీరు, దారి, తోడు, బలము అయినవాడు మహాక్షుడు.

356. గరుడధ్వజః

గరుత్మంతుడు ధ్వజము(పతాకము)గా గలవాడు.

ఓం గరుడధ్వజాయ నమః

గరుత్మంతుడు శ్రీమహావిష్ణువునకు వాహనమేగాక పతాకచిహ్నము కూడ. వినీలాకాశమున ఎగిరే గ్రద్ద భూమిమీది చిన్న వస్తువును కూడ చూడగలదు. అదే విధముగా భగవంతుని చూపు భక్తుని హృదయములో దురాలోచనలు ప్రవేశింపకుండ రక్షించును. మహాభారతగాధ ప్రకారము గరుత్మంతుడు తన తల్లి వినత దాస్యమును అంతము చేయటకొఱకు దేవతలతో పోరాడి అమృతమును తేవలసివచ్చినది. అప్పుడు గరుత్మంతుడు శ్రీమహావిష్ణువును ప్రార్థించెను. నారాయణునికంటె ఎత్తున ఉండుట కొఱకు. ఆ విధముగా గరుడుడు శ్రీనివాసుని ధ్వజచిహ్నము, వాహనముకూడ అయ్యెను.

ధర్మచక్రము రచయిత – పరమాత్ముని సేవించుటయే జీవాత్మ లక్ష్యము కావలెను. గరుత్మంతుడు శ్రీహరికి వాహనమగుట ఇందుకొఱకే. ఆ సేవయందే తరించినవారు పరమాత్మను చేరుదురని జటాయువు కథ తెలుపుచున్నది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఆకాశమున గ్రద్ద ఎగురుచున్నపుడు దానిదృష్టికే భయపడి విషసర్పములు పారిపోవును. అదే విధముగా భగవంతుని చూపు భక్తుల పాపములను హరించును.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీమద్రామాయణము – యుద్ధకాండము – నాగపాశవిమోచన ఘట్టము

(ఈ రచనలనుండి గ్రహించినది.

1. సుందర కాండము. పారాయణ గ్రంథము – శ్రీమాన్ ఎస్.టి.పి.వి. కోనప్పాచార్యులు

2. వాల్మీకి రామాయణము. సరళ సుందర వచనము – బ్రహ్మశ్రీ కొంపెల్ల వేంకట రామశాస్త్రి)

భీకరమైన యుద్ధంలో అంగదునివల్ల పరాభవం పొందిన ఇంద్రజిత్తు మాయమైనాడు. రామునిమీదా, లక్ష్మణునిమీదా ఇంద్రజిత్తు ఘోరమైన నాగాస్త్రాన్ని ప్రయోగించి వారిని బంధించివేయగలిగాడు. అదృశ్యరూపంలో ఇంద్రజిత్తు వేసే శరపరంపరకు రామలక్ష్మణుల శరీరాలు బాణాలతో నిండిపోయాయి. వారిదేహంనుండి రక్తం పర్వతం మీదినుండి సెలయేళ్ళు ప్రవహించినట్లు ప్రవహించింది. మూర్ఛిల్లిన సోదరులను చూచి వానరులంతా విచారంలో మునిగిపోయారు. ధర్మాత్ముడైన విభీషణుడు బాణములచేత అంతటా గ్రుచ్చబడిన రామలక్ష్మణుల శరీరములు చూచి అప్పుడు చాల వ్యధ చెందెను. అతడు నీళ్ళతో తడిసిన తన చేతితో వారి కన్నులు తడిచి, విలపించెను. ఏ రామలక్ష్మణుల పరాక్రమమును ఆశ్రయించి నేను రాజ్యమును పొందవలెనని కోరుకుంటినో అట్టి ఈ మానవశ్రేష్ఠులు ప్రాణములను విడచుటకై పడియున్నారని శోకించెను.

సుగ్రీవుడు విభీషణుని కౌగిలించుకొని – ధర్మజ్ఞా, విభీషణా! నీవు లంకారాజ్యమును పొందగలవు. సందేహము లేదు. ఈ రామలక్ష్మణులు కేవలము మోహము చెందియున్నారు. వీరు పాశవిముక్తులై యుద్ధములో రావణుని చంపగలరు – అన్నాడు. తరువాత సుగ్రీవుడు తన మామయైన సుషేణునితో – నీవు ఈ రామలక్ష్మణులను తీసికొని పరివారంతో కిష్కింధకు వెళ్ళిపో. నేను రావణుని, అతని పుత్రులను, బంధువులను సంహరించి సీతమ్మను తీసికొని వచ్చెదను – అని చెప్పెను. సుషేణుడు తాను చూచిన దేవాసుర యుద్ధంలో దేవతలపై బృహస్పతి వాడిన ఔషధాలు తేవడానికి హనుమంతుడిని పంపమని సుగ్రీవునకు చెప్పాడు.

ఇంతలో మేఘాలనూ, సముద్రాలనూ కల్లోలం చేసే తీవ్రమైన వాయువు వీచింది. భూమి కంపించింది. పెద్దపెద్ద చెట్లన్నీ ఆ గాలి వేగానికి పెళ్ళగిల్లి సముద్రంలో పడ్డాయి. సముద్రంలోనున్న సర్పములన్నీ భయపడినాయి. జలజీవాలన్నీ సముద్రం అడుగుకు వెళ్ళిపోయాయి. మరుక్షణం మండే అగ్నివలెనున్న, మహాబలిశాలియైన వినతాకుమారుడు గరుత్మంతుడు వానరులకు కనబడెను. బాణముల రూపమున రామలక్ష్మణులను బంధించియున్న మహానాగములన్నియు గరుత్మంతుని రాకతో పారిపోయెను. నేలమీద వాలిన గరుత్మంతుడు తన రెండు చేతులతో రామలక్ష్మణుల సర్వావయవాలను నిమిరాడు. మరుక్షణంలో వారి గాయాలన్నీ మానిపోయినాయి. వారి దేహాలకు తొల్లిటి వర్చస్సు వచ్చింది. మీదుమిక్కిలి వారి తేజమూ, బల వీర్య పరాక్రమాలూ, ఓజస్సూ, ఉత్సాహమూ, బుద్ధీ, స్మృతీ పూర్వంకంటె ద్విగుణీకృతమయ్యాయి.



పక్షీంద్రుడు వారిని ఆప్యాయంగా కౌగిలించుకొన్నాడు. అతనితో రాముడు – నీ అనుగ్రహంవల్ల మేము ఆపదనుండి విముక్తులమై, పూర్వపు బలము పొందాము. నిన్ను చూడగా మా తండ్రి దశరధ మహారాజునూ, మా తాత అజమహారాజునూ చూచినట్లు మా హృదయం ప్రసన్నమగుచున్నది. నీవు రూపసంపన్నుడవు. దివ్యవస్త్రాభరణ సుగంధములను ధరించిన నీవెవ్వరవు మహాపురుషా! – అని అడిగెను. అప్పుడా వైనతేయుడు ఇట్లనెను.

అహం సఖా తే కాకుత్స్థ ప్రియః ప్రాణో బహిశ్చరః
గరుత్మానిహ సంప్రాప్తో యువయోః సాహ్యకారణాత్

రామా! నేను నీ ప్రియమిత్రుడను. బయట సంచరించు ప్రాణమువంటివాడను. నా పేరు గరుత్మంతుడు. మీకు సాయపడడానికి వచ్చాను. ఇంద్రజిత్తు మాయవల్ల బాణాలై మిమ్ములను బంధించిన ఈ నాగులనుండి దేవేంద్రాదులు కూడా విడిపించలేరు. నువ్వు ధర్మజ్ఞుడవూ, సత్యపరాక్రముడవూ గనుక నాగబంధమునుండి మీరు విముక్తులైనారు. కపట స్వభావులైన రాక్షసులపట్ల ఎన్నడును మీరు ఏమరుపాటుగా నుండరాదు.

గరుత్మంతుడు స్నేహముతో రాముని కౌగిలించుకొని – మిత్రుడా! నేను వెళ్ళుట కనుజ్ఞనిమ్ము. మన యిద్దరి స్నేహము ఎలా ఏర్పడినది అని తెలిసికొనుటకు నీవిపుడు అభిలాష చూపవద్దు. యుద్ధమునందు శత్రుసంహారము పూర్తిచేసిన పిదప నీకు తెలియగలదు. బాలురనూ, స్త్రీలనూ, వృద్ధులనూ మాత్రమే మిగిల్చి నీ బాణాలతో లంకను నాశనం చేసి, రావణుణ్ణి సంహరించి నువ్వు సీతను పొందడం తథ్యం – అనిచెప్పి, రామలక్ష్మణులకు ప్రదక్షిణ చేసి, కౌగిలించుకొని, వాయువువలె ఆకాశమున ప్రవేశించెను.

ఇలాగ పునరారోగ్యవంతులైన రామలక్ష్మణులను చూచి వానరులు ఆనందముతో గెంతి, సింహనాదాలు చేశారు. తోకలెగరేశారు. భేరీలు, శంఖాలు పూరించారు. భుజాలు చరచారు. వేలాది వృక్షాలను పెరికి యుద్ధానికై లంకాద్వారాలమీదికి దూకారు. వారి సింహనాదాలు ఆ నిశిరాత్రి సమయంలో ప్రళయకాలంనాటి ఉరుముల్లాగా రాక్షసులను భయకంపితులుగా చేశాయి.

(గరుత్మంతుడు బొమ్మ వికీపీడియా నుండి)

అతులః శరభో భీమః సమయజ్ఞో హవిర్హరిః |
సర్వలక్షణలక్షణ్యో లక్ష్మీవాన్ సమితింజయః || (39)

357. అతులః

సాటిలేనివాడు. పోల్చరానివాడు.

ఓం అతులాయ నమః

గరుడధ్వజ సత్వాద్ధి అతులోऽనుపమ స్మృతః – గరుడధ్వజము కలవాడు కాబట్టి లోకమునందు సాటిలేని మేటి అవుతున్నాడు.

తులనము అనగా (తక్కెడలో తూచినట్లుగా) మరొకదానితో పోల్చుట. భగవంతుడొక్కడే. ఆయనవంటి మరేమియును లేదు. ఆయనను వేరొకరితో పోల్చుట సాధ్యము కాదు. కనుక ఆయన అతులుడు.
తులోపమానం అస్య న విద్యత ఇతి అతులః – అని వ్యాఖ్యానించి, శ్రీ శంకరులు శ్వేతాశ్వరోపనిషత్తు (4.19) నుండి ప్రమాణము చెప్పారు.
నైన మూర్ధ్వం నతిర్యంచం న మధ్యే పరిజగ్రభతు
న తస్య ప్రతిమాస్తి యస్య నామ మహద్యశః
ఈ పరమాత్మను ఊర్ధ్వ దిక్కులయందుగాని, అధోదిక్కులయందుగాని గ్రహించడానికి వీలులేదు. అనంతకీర్తితో వెలుగొందుచున్న ఆ పరమాత్మతో పోల్చడానికి మరెవరూ లేరు.

గీత 1.43 – **న త్వత్సమోऽస్త్యభ్యధికః కుతోऽన్యో లోకత్రయేऽప్య ప్రతిమ ప్రభావః** – నీవు గురువువు. సర్వశ్రేష్ఠుడవు. ముల్లోకాలలోనూ నీతో సమానులెవరూ లేరు. ఇంక నీకన్న అధికులెలా ఉంటారు? సర్వేశ్వరా!

నీవు గురువులకు గురువువు. బ్రహ్మకు జనకుడవు. పూజ్యులైనవారికి పూజ్యుడవు. మహాగుణములు, ఐశ్వర్యము, మహిమలు గల నీతో సరితూగగలవాడు ఈ లోకంలో ఎవరూ లేరు. నీకు నీవే సాటి.

తిరువైమొళి (6.3.9)నుండి శ్రీ వి.వి.రామానుజన్ ఉదహరించినది – **తాన్ ఒప్పారిల్ అప్పన్.**

ధర్మచక్రము రచయిత – కనుక మనము సాయము కోరి ఎవరో సామాన్యుని కీర్తింప తగదు. సర్వేశ్వరుడైన శ్రీమహావిష్ణువునే స్మరింపనగును. ఆయనను స్మరించినవారు ప్రవర్ధమానులు అగుదురు. అట్లు కానివారు దిగజారుదురు.

358. శరభః

- ధర్మము హద్దునతిక్రమించినవారిని శిక్షించువాడు.
- అంతరాత్మయై వెలుగువాడు.
- శరభావతారమునెత్తిన పరమేశ్వరుడు.

ఓం శరభాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **శృణాతీతి శరభః** – 'శృ' అనే ధాతువునకు గాయపరచుట, ఖండించుట అన్న అర్థముల నుండి – తన ఆజ్ఞను మీరినవారిని ఆయన శిక్షించును. ఆయన ఆజ్ఞ ప్రకారమే సకల భూతములు తమతమ విధులను నిర్వహించును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శీర్ణమగునది, అనగా నశించునది, శిధిలమగునది శరము. **శీర్యమానాత్ శరః** – శరీరము అశాశ్వతము గనుక శరము. 'భ' ధాతువునుండి 'ప్రకాశమానము' (భాతి) అనే భావమును గ్రహింపనగును. శరీరములో జ్యోతియై వెలుగువాడు శరభుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి శరభోపనిషత్తునుండి చెప్పిన ప్రమాణము – **శర జీవస్తదంగేషు భాతి నిత్యమ్ హరిః స్వయమ్ బ్రహ్మైవ శరభ సాక్షాత్.** శ్రీ రాధాకృష్ణశాస్త్రి మరొక అర్థము కూడా చెప్పారు. శరము అనగా బాణము. శరీరమును బాణముగా చేసికొని పరమాత్మునిపైపు గురిచూచినయెడల అశాశ్వతమైన దేహము కూడ భగవంతుని ప్రభావమువలన మరల ప్రకాశించును.

శ్రీ పెమ్మరాజు రాజారావు, డా. క్రోవి పార్థసారధిల రచనలలో ఇచ్చిన మరొక అర్థము – పరమేశ్వరుడు ఒకప్పుడు ఎనిమిది కాళ్ళుగల మహామృగముగా అవతరించెను. కనుక భగవానుడు శరభుడయ్యెను. (ఆ మహామృగము పేరు 'శరభము'.)

359. భీమః

భయంకరుడు. భయమును కలిగించువాడు.

ఓం భీమాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

39వ శ్లోకము. 359వ నామము. భీమః – **అతులః శరభో భీమః సమయజ్ఞో హవిర్హరిః**

101వ శ్లోకము. 948వ నామము. భీమః – **జననో జనజన్మాదిః భీమో భీమపరాక్రమః**

బిభ్యతి ఇతి భీమః – 'భీ' అనగా 'భయము' అనే ధాతువునుండి – భీముడు అనగా భయము కలుగజేయువాడు. భగవంతుని ఆజ్ఞను అతిక్రమించడానికి అందరూ భయము చెందెదరు.

తైత్తరీయారణ్యకము (8) – **భీషాస్మాత్ వాతః పవతే** – ఆయనకు భయపడి గాలి వీచును.

భయాదేవ అగ్నిస్తపతి భయాత్తపతి సూర్యః
భయాత్ ఇంద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః – కఠోపనిషత్తు (2.6.3)
అయన శిక్షించుననే భయముతోనే అగ్ని, సూర్యుడు, ఇంద్రుడు, వాయువు, మృత్యువు తమ తమ విధులను నిర్వర్తించును.
బ్రహ్మసూత్రము (1.3.40)లోని 'కంపనాత్' అనే పదము ఈ భావములోనే వాడబడింది.

శ్రీ వి.వి.రామానుజన్ దివ్యప్రబంధములనుండి మరికొన్ని ఉదాహరణలు చెప్పారు. శ్రీనారసింహుని ఆవిర్భావమున హిరణ్యకశిపుడు భయముతో కంపించిపోయెను. లంకలో యుద్ధము జరిగినపుడు శ్రీరాముని శరధాటికి రాక్షసులు సింహమును చూచిన తోడేళ్ళవలె పరుగులు తీసిరి. (తిరువైమొళి 7.6.8).

ధర్మచక్రము రచయిత – భగవంతుని తత్వము తెలియనివారిని, భగవంతుని నమ్మనివారిని కట్టడి చేసేది భయమే. భగవంతునిపై మనస్సు నిలిపినవారికి భయముండదు.

'అభీమ' అనే పాఠాంతరమును కూడ శ్రీ శంకరులు పేర్కొన్నారు. సన్మార్గములో చరించువారికి భయము లేకుండ చేయువాడు అభీముడు.

360. సమయజ్ఞః

- నియమము, కాలము, వ్రతము తెలిసినవాడు
- సమభావము కలిగినవాడు.

ఓం సమయజ్ఞాయ నమః

ఈ నామమును భాష్యకారులు రెండు విధాలుగా వ్యాఖ్యానించారు.

సమయ-జ్ఞ – సమయము తెలిసినవాడు. ఇక్కడ సమయము అనగా కాలము అని, నియమము అని కూడ అర్థములు చెప్పబడినవి.

సమ-యజ్ఞః – సమమైన వ్రతము కలవాడు.

సూర్య చంద్ర సమో ధాతా యథా పూర్వకమ్ అకల్పయత్.

అగ్న్యాదీనాం చ సమయః ఊర్ధ్వాగ్ర జ్వలనాధికమ్
యో జానాత్యధికారం చ సమయజ్ఞ స్స కీర్తితః

అగ్ని ఎప్పుడు మండాలి? మంట పైకి ఎలా వెళ్ళాలి? ప్రళయానంతరం సృష్టి ఎలా జరగాలి? సూర్యచంద్రుల గతులెలా ఉండాలి? ఈ నియమాలను, సమయాలను విధించినవాడు, తెలిసినవాడు, పాలించువాడు సమయజ్ఞుడు.

శ్రీ భట్టులు మరొకవిధంగా కూడా వ్యాఖ్యానించారు. ఎప్పుడు తన భక్తుల కోర్కెలను కరుణించాలో, ఎప్పుడు తాను వారికి అందిరావాలో తెలిసినవాడు సమయజ్ఞుడు.

శ్రీ శంకరులు కూడా రెండువిధాల వ్యాఖ్యలను ప్రసాదించారు. సృష్టి, స్థితి, లయముల సమయము నెఱింగినవాడు గనుక భగవానుడు సమయజ్ఞుడు. అందరినీ సమముగా చూచు వ్రతము గలవాడు గనుక సమయజ్ఞుడు.

శ్రీ వి.వి. రామానుజన్ తిరువైమొళి (2.8.9)నుండి చెప్పిన ఉదాహరణ. శ్రీనృసింహావతారమున స్తంభమునుండి బయల్పడవలసిన సమయము తెలిసినవాడు గనుక అచ్యుతుడు సమయజ్ఞుడు – **ఇరణియాన్ తూణ్ పుడై ప్పాంగు అప్పొడుదే అవన్ వీయత్ తోన్డియ ఎన్ సింగప్పిరాన్.**

పోతన భాగవతంలో ఈ ఘట్టానికి సంబంధించిన పద్యం

హరి సర్వాకృతులన్ గలండనుచు ప్రహ్లాదుండు భాషింప స
త్వరుడై ఎందును లేడు, లేడని సుతున్ దైత్యుండు తర్జింప శ్రీ
నరసింహాకృతినుండె నచ్యుతుడు నానా జంగమ స్థావరో
త్కర గర్భంబుల నన్నిదేశముల నుద్దండ ప్రభావంబుతోన్.

యుద్ధకాలమున ఒక రాజు అవలంబింపవలసిన ఆరు విధములైన వ్యూహములను శ్రీ రాధాకృష్ణశాస్త్రి ప్రస్తావించారు – యుద్ధము, సంధి, ఇతరుల సహకారము, ఇద్దరు శత్రువుల మధ్య పోరు, దండయాత్ర,

వేచియుండుట – ఇవన్నీ పాండవుల విజసారధియై శ్రీకృష్ణభగవానుడు నిరూపించెను గనుక ఆయన సమయజ్ఞుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతుడే భూత భవిష్యద్ వర్తమానములు తెలిసినవాడు. షడృతువులను ప్రవర్తిల్లజేయును. గ్రహముల గతులెరిగినవాడు. జనన మరణ సమయము తెలిసినవాడు. కనుక సమయజ్ఞుడు.

361. హవిర్హరిః

యజ్ఞములందు అర్పించిన హవిస్సులను స్వీకరించు హరి.

ఓం హవిర్హరయే నమః

ఈ నామమును 'హవిర్హరిః' అనే ఒకే నామముగానూ, 'హవిః', 'హరిః' అనే రెండు నామములుగానూ కూడా వ్యాఖ్యానకర్తలు పరిగణించారు.

హవిర్హరిః

'యజ్ఞేషు హవిర్భాగం హరతి ఇతి హవిర్హరిః' – యజ్ఞములందు అర్పించిన హవిస్సులను హరించువాడు హవిర్హరి – ఇందుకు ప్రమాణంగా గీత (9.2.4)నుండి – **అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ** – అని శ్రీ శంకరులు ఉదాహరించారు. సకలయజ్ఞములకును భోక్తను, స్వామిని కూడా తానేనని శ్రీకృష్ణభగవానుడు సెలవిచ్చెను. సకలదేవతలు హరియవతారములు. యజ్ఞయాగాదులలో అర్పించు హవిస్సులను ఆయా దేవతల రూపమున శ్రీహరియే గ్రహించును. హవిర్భాగమును తీసుకొనే దేవతల సంఖ్య 33 అని బృహదారణ్యకోపనిషత్తులో చెప్పబడింది.

ఏకాదశ రుద్రులు	-	11
ద్వాదశాదిత్యులు	-	12
అష్టవసువులు	-	8
ఇంద్రుడు, ప్రజాపతి	-	2
మొత్తము	-	**33**

'హు' అనే ధాతువునుండి 'హవిస్' అనే పదము వస్తుంది. దీనికి 'ఇచ్చుట' అనీ, 'తీసికొనుట' అనీ రెండర్థములు చెప్పవచ్చును. భగవంతుని సేవించి భక్తులు సంతసింతురు. భక్తులను అనుగ్రహించి భగవంతుడు సంతసించును. ఈ విధంగా కూడా ఆయన హవిర్హరి.

సమయం శృతిసిద్ధం యో జ్ఞాత్వా తేభ్య శ్రియం ముదా
దత్తే హుతం హవిస్తైశ్చ దీయతే స హవి స్మృతః

హరతీతి హరిర్విఘ్నాన్ అన్నదానేషు నిత్యశః

హవిర్హరిరితి ప్రోక్తః హ్యష్టార్ణశ్చైక నామతః

(ఇక్కడ 'సమయజ్ఞ' నామముతో సంబంధము కలుపబడినది!) వేదోక్తమయిన సమయము తెలిసి, తన భక్తులకు సంపదలు ఇచ్చి ఆనందించువాడు. ఆ భక్తులు అగ్నియందు అర్పించు హవిస్సును తీసికొనువాడు. భక్తులొనరించు అన్నదానమువంటి పుణ్యకార్యములకు కలిగే విఘ్నాలను పోగొట్టువాడు గనుక 'హవిర్హరి'యని చెప్పబడును.

హవిః

(శ్రీకైవల్య సారథి నుండి) పురుషసూక్తంలో - **అబధ్నన్ పురుషం పశుం** – అని చెప్పబడినది. దేవతలు తాము చేసే యజ్ఞానికి విరాట్పురుషునే పశువుగా బంధించారట. ఈ విధముగా భగవంతుడే హవి.

హరిః

పాపములను హరించువాడు శ్రీమన్నారాయణుడు.

హరియను రెండక్షరములు

హరియించును పాతకముల నంబుజనాభా

హరి నీ నామహిమము

హరి హరి పొగడంగ వశమె హరి శ్రీకృష్ణా

ప్రోమ్యఘుమ్ చ స్మర్తృణామ్ హవిర్భాఘుమ్ క్రతుష్వహమ్

వర్ణశ్చ మే హరిర్శ్వేతి తస్మాద్ హరిరహమ్ స్మృతః – మహాభారతము. శాంతిపర్వము. 330.3

నన్ను స్మరించినవారి పాపములను హరింతును. ఇంకా యజ్ఞములలో హవిర్భాగమును స్వీకరింతును. నావర్ణము కూడ నీలము (హరివర్ణము). కనుక నన్ను 'హరి'యందురు.

362నుండి 379వరకు నామములు పరవాసుదేవుని లక్ష్మీపతిత్వమును స్తుతించు నామములుగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

శ్రీసూక్తము (ఋగ్వేదము. సౌభాగ్యలక్ష్మి ఉపనిషత్తు)

తమకు సౌభాగ్యలక్ష్మీవిద్యను ఉపదేశించమని కోరిన దేవతలకు శ్రీమహావిష్ణువు ఇలా చెప్పాడు – దేవతలారా! తురీయ, తురీయాతీత, సర్వోత్కట, సర్వమంత్రాసనగత, పీఠ, ఉపపీఠ, దేవతాపరివృత, చతుర్భుజ అయిన లక్ష్మి (శ్రీ)ని హిరణ్మయము చేసి 15 ఋక్కులలో ధ్యానము చేయండి.

శ్రీ గణేశాయ నమః

అథ శ్రీమహాలక్ష్మ్యై నమః

హిరణ్యవర్ణామితి పంచదశర్చస్య సూక్తస్య
ఆనంద కర్దమ చిక్లీతేన్దిరాసుతా ఋషయః
శ్రీరగ్నిశ్చేతుభ్యే దేవతే
ఆద్యాస్తిస్రోఽనుష్టుభః
చతుర్థీ బృహతీ
పంచమీ షష్ఠ్యౌ త్రిష్టుభౌ
తతోఽష్టా వనుష్టుభః
అన్త్యా ప్రస్తార పంక్తిః
జపే వినియోగః

(ఈ శ్రీసూక్తానికి ఆనంద, కర్దమ, చిక్లీత, ఇందిరాసుతులు ఋషులు. శ్రీరిత్యాదులు ఋక్కులు. 14 ఋక్కులకు ఆనందాదులు ఋషులు. 'హిరణ్యవర్ణాం'తో మొదలగు మూడు ఋక్కులకు ఛందస్సు 'అనుష్టుప్'. 'కాంసోస్మిత' ఋక్కునకు ఛందస్సు 'బృహతీ'. తరువాతి రెండింటికి ఛందస్సు 'త్రిష్టుప్'. తరువాతి ఎనిమిదింటికి ఛందస్సు 'అనుష్టుప్'. చివరి ప్రసార పంక్తికి దేవత అగ్ని. బీజము 'హిరణ్యవర్ణాం' అనునది. కాంసోస్మితి ఇతి శక్తిః.)

చిత్రంలో – కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి

హరిః ఓం

హిరణ్య వర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం
చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహ
అగ్నిదేవా! సువర్ణకాంతివంటి ఛాయగలదీ, పాపాలను హరించివేసేదీ, బంగారు వెండి హారాలను అలంకరించుకొన్నదీ, చంద్రునివంటి ఆహ్లాదం కలదీ, సువర్ణమయమైనదీ అయిన మహాలక్ష్మిని నా కొరకు ఆవాహన చెయ్యి!

తాం మ ఆవహ జాతవేదో లక్ష్మీమనపగామినీమ్
యస్యాం హిరణ్యం విందేయం గామశ్వం పురుషానహమ్
ఓ అగ్నిదేవా! ఎవరి కృపాకటాక్షంతో నాకు బంగారం, గోవులు, గుర్రాలు, బంధువులు సంప్రాప్తమైనవో ఆ మహాలక్ష్మిని నాకడకు ఆవాహన చెయ్యి. ఆమె నావద్దనుండి వీడిపోనట్లు చూడు.

అశ్వపూర్వాం రథమధ్యాం హస్తినాద ప్రబోధినీమ్
శ్రియం దేవీముపహ్వయే శ్రీర్మా దేవీర్జుషతామ్

గుర్రాలు పూన్చిన రథం మధ్యన ఆసీనురాలైనదీ, తన రాకను ఏనుగు ఘీంకారంతో సూచిస్తూ వున్నదీ అయిన శ్రీదేవిని ఆహ్వానిస్తున్నాను. శ్రీదేవీ! నీవు నావద్ద సంతోషంగా నెలకొనియుండువుగాక!

కాం సోస్మితాం హిరణ్యప్రాకారా మార్ద్రాం జ్వలంతీం తృప్తాం తర్పయంతీమ్
పద్మే స్థితాం పద్మవర్ణాం తామిహోపహ్వయే శ్రియమ్
చిరుదరహాసంతో కూడినదీ, బంగారుకోటలో వసించునదీ, కరుణాస్వరూపిణీ, తేజస్స్వరూపిణీ, ఆనందస్వరూపిణీ, ఆనందం ప్రసాదించునదీ, పద్మంలోఆసీనురాలయినదీ, పద్మంవంటి ఛాయగలదీ అయిన ఆ శ్రీదేవిని ఇక్కడ సాక్షాత్కరింపమని ప్రార్థిస్తున్నాను.

చంద్రాం ప్రభాసాం యశసా జ్వలంతీం శ్రియం లోకే దేవజుష్టాముదారామ్
తాం పద్మినీమీం శరణమహం ప్రపద్యేऽలక్ష్మీర్మే నశ్యతాం త్వాం వృణే
చంద్రునితో పోలినదీ, తేజోవంతమైనదీ, తన కీర్తిచంద్రికలవలన దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నదీ, దేవతలచే పూజలు అందుకొనునదీ, కరుణాస్వరూపిణీ, పద్మాన్ని ధరించినదీ, 'ఈం' అనే బీజమంత్రానికి భావంగా విరాజిల్లుతూన్నదీ అయిన మహాలక్ష్మిని నేను శరణుజొచ్చుతాను. ఓ దేవీ! నిన్ను ప్రార్థిస్తున్నాను. నా దారిద్ర్యం తీరిపోయేలా కరుణించు.

ఆదిత్యవర్ణే తపసోऽధిజాతో వనస్పతిస్తవ వృక్షోऽథ బిల్వః
తస్య ఫలాని తపసానుదన్తు మాయాంతరాయాశ్చ బాహ్యా అలక్ష్మీః
సూర్యుని వన్నె కలదానా! వనానికి అధిపతియైన బిల్వవృక్షం నీ తపోమహిమచే ఉద్భవించింది. నీ తపస్సంభూతాలైన దాని ఫలాలు అజ్ఞానమైనలోపలి ఆటంకాన్నీ అమంగళకరమైన బాహ్య ఆటంకాన్నీ తొలగిస్తాయి గాక!

ఉపైతు మాం దేవసఖః కీర్తిశ్చ మణినా సహ
ప్రాదుర్భూతోऽస్మి రాష్ట్రేऽస్మిన్ కీర్తిమృద్ధిం దదాతు మే
కుబేరుడూ, కీర్తిదేవుడూ ఐశ్వర్యాలతో నన్ను వెన్నంటి రావాలి. నీ అనుగ్రహం పూర్తిగా సంతరించుకొన్న ఈ దేశంలో నేను జన్మించాను. కీర్తిని, ఐశ్వర్యాన్ని నాకు ప్రసాదించు.

క్షుత్పిపాసామలాం జ్యేష్ఠామలక్షీం నాశయామ్యహమ్
అభూతి మసమృద్ధిం చ సర్వాం నిర్ణుద మే గృహాత్
ఆకలి దప్పులతో కృశించినదీ, శ్రీదేవికంటే ముందుగా జన్మించినదీ అయిన జ్యేష్ఠాదేవిని (అలక్ష్మిని) నేను నాశనం చేస్తాను. నా గృహంనుండి అభాగ్య, అసమృద్ధులను పూర్తిగా నిర్మూలించి అనుగ్రహించు.

గంధద్వారాం దురాధర్షాం నిత్యపుష్టాం కరీషిణీమ్
ఈశ్వరీగం సర్వభూతానాం తామిహోపహ్వయే శ్రియమ్
సుగంధానికి ఆలవాలమైనదీ, జయింపనలవి కానిదీ, సతతం పౌష్టికతనిచ్చునదీ, సకల సంపన్నురాలూ, సమస్త జీవులకు నాయకురాలైనదీ అయిన మహాలక్ష్మిని ఇక్కడ ఆవాహన చేస్తున్నాను.

మనసః కామమాకూతిం వాచః సత్యమశీమహి
పశూనాం రూపమన్నస్య మయి శ్రీః శ్రయతాం యశః
శ్రీదేవీ! మనస్సులో జనించే ఉదాత్త ఆకాంక్షలను, సంతోషాన్ని, వాక్కులో సత్యాన్ని, గోసమృద్ధిచేత, ఆహార సమృద్ధిచేత కలిగే ఆనందాన్ని నేను చవి చూడాలి. నాకు కీర్తి కలుగుగాక!

కర్దమేన ప్రజాభూతా మయి సంభవ కర్దమ
శ్రియం వాసయ మే కులే మాతరం పద్మమాలినీమ్
కర్దమ మహర్షీ! నీకు పుత్రికగా జన్మించిన మహాలక్ష్మి నాకు సాక్షాత్కరించాలి. తామరపువ్వుల మాల దాల్చినదీ, సిరిసంపదలకు అధిదేవతా, తల్లీ అయిన ఆమెను నా కులంలో సతతం వసింపచేయాలి.

ఆపః సృజంతు స్నిగ్ధాని చిక్లీత వస మే గృహే
ని చ దేవీం మాతరం శ్రియం వాసయ మే కులే
శ్రీదేవి పుత్రుడవైన ఓ చిక్లీతా! నీరు చక్కని ఆహారపదార్థాలను ఉత్పాదన చేయనీ. నా యింట నువ్వు వసించాలి. దేవీ, నీ మాతా అయిన శ్రీదేవి నా కులంలో నిరంతరం వసింప అనుగ్రహించు!

ఆర్ద్రాం పుష్కరిణీం పుష్టిం పింగలాం పద్మమాలినీమ్
చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహ
అగ్నిదేవా! కరుణాపూరిత మనస్సు గలదీ, పద్మవాసినీ, ఆహారం ఒసగి లోకాన్ని పోషించేదీ, కుంకుమవన్నె గలదీ, తామరపువ్వుల మాలాధారిణీ, చంద్రునిలా ఆహ్లాదకారిణీ, బంగారుమయమైనదీ అయిన మహాలక్ష్మిని నా నిమిత్తం ఆవాహన చేయి.

ఆర్ద్రాం యః కరిణీం యష్టిం సువర్ణాం హేమమాలినీమ్
సూర్యాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహ
అగ్నిదేవా! దయార్ద్రహృదయురాలూ, గంభీరమూర్తీ, దండం చేబట్టినదీ, అందమైన మేనిచ్ఛాయగలదీ, సూర్యునిలా ప్రకాశమాన అయినదీ, బంగారుమయమైనదీ అయిన మహాలక్ష్మిని నాకోసం ఆవాహన గావించు.

తాం మ ఆవహ జాతవేదో లక్షీమనపగామినీమ్
యస్యాం హిరణ్యం ప్రభూతం గావో దాస్యోఽశ్వాన్ విందేయం పురుషానహమ్
అగ్నిదేవా! ఎవరివలన నేను అపరిమిత బంగారం, గోవులు, సేవకురాండ్రు, గుర్రాలు, సేవకులను ప్రాప్తించుకొంటానో అట్టి మహాలక్ష్మి నన్ను వదలివెళ్ళిపోకుండా కృపచూపు.

యః శుచిః ప్రయతో భూత్వా జుహుయాదాజ్యమన్వహమ్
సూక్తం పంచదశర్చం చ శ్రీ కామః సతతం జపేత్
ఎవరు లక్ష్మీదేవి కృపాకటాక్షార్థం ప్రార్థిస్తున్నారో వారు శుచిగా, ఇంద్రియాలు నిగ్రహించినవారిగా ఉంటూ ప్రతిరోజు నేతితో హోమం చేయాలి. పైన తెలిపిన లక్ష్మీదేవియొక్క పదిహేను మంత్రాలను సదా జపిస్తూ ఉండాలి.

ఆనన్దః కర్దమశ్చైవ చిక్లీత ఇతి విశ్రుతాః
ఋషయస్తే త్రయః ప్రోక్తా స్వయాం శ్రీరేవ దేవతా
సుప్రసిద్ధులూ, ఋషులూ అయిన ఆనందుడు, కర్దముడు, చిక్లీతుడు ముగ్గురూ ఈ సూక్తంలోని ఋషులు.
మహాలక్ష్మియే దేవత.

పద్మాననే పద్మఊరూ పద్మాక్షీ పద్మసంభవే
త్వం మాం భజస్వ పద్మాక్షీ యేన సౌఖ్యం లభామ్యహమ్
పద్మంవంటి ముఖమూ, పద్మంవంటి ఊరువులూ, పద్మంవంటి కన్నులూ గలదానా, పద్మంనుండి ఉద్భవించినదానా,
నేను దేనివలన సుఖిస్తానో దాన్ని నువ్వు నాకు అనుగ్రహించు.

అశ్వదాయీ గోదాయీ ధనదాయీ మహాధనే
ధనం మే జుషతాం దేవి సర్వకామాంశ్చ దేహి మే
గుర్రాలను సమర్పించేదీ, గోవులను సమర్పించేదీ, సంపదలను సమర్పించేదీ, ధనానికి అధిదేవతాయైన మహాలక్ష్మీ!
అభీష్టాలన్నీ నెరవేరేటప్పుడు కలిగే సుఖాన్ని ఇచ్చే సంపదను నాకు ప్రసాదించు.

పుత్రపౌత్ర ధనం ధాన్యం హస్త్యశ్వాదిగవే రథమ్
ప్రజానాం భవసి మాతా ఆయుష్మంతం కరోతు మామ్
పుత్రులు, పౌత్రులు, ధనధాన్యాలు, ఏనుగులు గుర్రాలు ఇత్యాదులు, గోవులు, రథాలు సకలం ప్రసాదించు. జనులకు
నువ్వు తల్లిగా భాసిస్తున్నావు. నన్ను ఆయుష్మంతునిగా ఒనరించాలి.

ధనమగ్నిర్ధనం వాయుర్ధనం సూర్యో ధనం వసుః
ధనమింద్రో బృహస్పతిర్వరుణం ధనమశ్నుతే
అగ్నిదేవుడూ, వాయుదేవుడూ, సూర్యభగవానుడూ, అష్టవసువులూ, దేవేంద్రుడూ, దేవగురువైన బృహస్పతీ,
వరుణదేవుడూ తమ తమ సంపదలను నీ కృపతో అనుభవిస్తున్నారు.

చంద్రాభాం లక్ష్మీమీశానాం సూర్యాభాం శ్రియమీశ్వరీమ్
చంద్రసూర్యాగ్ని వర్ణాభాం శ్రీ మహాలక్ష్మీముపాస్మహే
చంద్రునిలా ఆహ్లాదంగా ప్రకాశిస్తున్నదీ, దేవతల శక్తిగా విరాజిల్లుతూన్నదీ, సూర్యునిలా తేజస్సుతో ప్రకాశిస్తూన్నదీ,
శ్రీదేవీ, ఈశ్వరీ, చంద్ర సూర్య అగ్నుల ముప్పురినీ తన మహత్తుగా కలదీయైన శ్రీమహాలక్ష్మిని ఆరాధిస్తాం.

వైనతేయ సోమం పిబ సోమం పిబతు వృత్రహా
సోమం ధనస్య సోమినో మహ్యం దదాతు సోమినః
ఓ గరుత్మంతుడా! సోమరసం గ్రోలు. వృత్రాసురుని సంహరించిన ఇంద్రుడు సోమరసం గ్రోలనీ. సోమయాగం నిర్వర్తింప
ఆశిస్తూన్న నాకు పుష్కలంగా ధనాన్ని ప్రసాదించనీ.

న క్రోధో న చ మాత్సర్యం న లోభో నాశుభామతిః
భవంతి కృతపుణ్యానాం భక్తానాం శ్రీసూక్తం జపేత్సదా
పుణ్యం చేసిన భక్తులకు కోపం రాదు, మాత్సర్యం ఉండదు, లోభం నశిస్తుంది, దుర్బుద్ధి పుట్టదు. వారికి అశుభం కలుగదు. భక్తిని పొంది వారు శ్రీసూక్తాన్ని సదా జపం చేయాలి.

వర్షంతు తే విభావరి దివో అభ్రస్య విద్యుతః
రోహంతు సర్వబీజాన్యవ బ్రహ్మ ద్విషో జహి
నీ కృపతో విద్యుల్లతాయుక్తాలైన మేఘాలు రేయింబవళ్ళు వర్షించనీ! విత్తనాలు యావత్తు చక్కగా మొలకెత్తి ఏపుగా పెరుగనీ! భగవంతుని నిందించేవారు నిష్క్రమించనీ!

పద్మప్రియే పద్మిని పద్మహస్తే పద్మాలయే పద్మ దళాయతాక్షి
విశ్వప్రియే విష్ణుమనోऽనుకూలే త్వత్పాదపద్మం మయి సన్నిధత్స్వ
పద్మమంటే ఇష్టపడేదానా, పద్మకుమారీ, పద్మాన్ని చేత ధరించినదానా, పద్మనివాసినీ, తామర రేకులవంటి విశాలమైన కన్నులు గలదానా, లోకానికి ప్రియమైనదానా, విష్ణువు మనస్సుకు అనుకూలురాలైనదానా, నీ పాదపద్మాలను నాపై మోపి నన్ను అనుగ్రహించు.

యా సా పద్మాసనస్థా విపులకటితటీ పద్మపత్రాయతాక్షీ
గంభీరావర్తనాభిః స్తనభరనమితా శుభ్రవస్త్రోత్తరీయా
లక్ష్మీర్దివ్యైర్గజేంద్రై మణిగణఖచితై స్నాపితా హేమకుంభైః
నిత్యం సా పద్మహస్తా మమ వసతు గృహే సర్వమాంగల్యయుక్తాః
పద్మంమీద ఆసీనురాలై ఉన్నదెవరో, విస్తారమైన పిరుదులుగలవారెవరో, తామరరేకులవంటి నేత్రాలు గలవారెవరో, లోతైన నాభి గలవారెవరో, స్తనాలభారంతో వంగివున్నవారెవరో, స్వచ్ఛమైన వలువలు ఉత్తరీయం ధరించినవారెవరో, రత్నాలు పొదిగిన బంగారు కలశాల జలంతో దేవలోకంలోని శ్రేష్ఠతమ గజరాజులచే అభిషేకింపబడుచున్నదెవరో, పద్మాన్ని చేత ధరించినవారెవరో, సర్వమంగళ స్వరూపిణియైనదెవరో, అట్టి మహాలక్ష్మి నా గృహంలో సదా సర్వవేళలా నివసించనీ!

లక్ష్మీం క్షీరసముద్రరాజతనయాం శ్రీరంగధామేశ్వరీమ్
దాసీభూత సమస్తదేవవనితాం లోకైకదీపాంకురామ్
శ్రీమన్మందకటాక్షలబ్ధ విభవద్బ్రహ్మేంద్రగంగాధరామ్
త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుందప్రియామ్
భాగ్యానికి ఆలవాలమైనది, క్షీరసముద్రరాజ తనయా, శ్రీరంగంలో వెలసిన దేవీ, దేవలోక స్త్రీలందరినీ దాసీజనంగా చేసుకొన్నదీ, లోకానికి ఏకైక దీపంగా భాసిస్తున్నదీ, ఎవరి మృదుల కటాక్షంతో బ్రహ్మ ఇంద్రుడు గంగాధరుడు వైభవం సంతరించుకొన్నారో ఆమే, మూడులోకాలను తన కుటుంబంగా చేసుకొన్నదీ, తామర కొలనులో ఉద్భవించినదీ, మహావిష్ణువుకు ప్రియాతిప్రియమైనదీ అయిన నీకు నమస్కరిస్తున్నాను.

సిద్ధలక్ష్మీర్మోక్షలక్ష్మీర్జయలక్ష్మీస్సరస్వతీ
శ్రీలక్ష్మీర్వరలక్ష్మీశ్చ ప్రసన్నా మమ సర్వదా
తలచిన మాత్రాన కోరికలను నెరవేర్చే సిద్ధలక్ష్మిగాను, ముక్తిని అనుగ్రహింపగల మోక్షలక్ష్మిగాను, విజయాన్ని సిద్ధింపజేసే జయలక్ష్మిగాను, పద్మకాసారంలో ఉద్భవించినదీ, సంపదలిచ్చే శ్రీదేవిగాను, వరాలు ప్రసాదింపగల వరలక్ష్మిగాను విరాజిల్లుతూన్న నువ్వు సదా సర్వవేళలా నాకు ప్రసన్నురాలవుగా ఉండుగాక!

వరాంకుశౌ పాశమభీతిముద్రాం కరైర్వహంతీం కమలాసనస్థామ్
బాలార్క కోటి ప్రతిభాం త్రిణేత్రాం భజేహమాద్యాం జగదీశ్వరీం త్వామ్
వర, అభయ ముద్రలు చేత దాల్చినదీ, పాశ అంకుశాలను చేత ధరించినదీ, పద్మనివాసినీ, కోటి బాలసూర్యుల ప్రకాశం కలదీ, మూడు కన్నులు కలదీ, ఆదిశక్తీ, జగదీశ్వరీ అయిన ఆమెను నేను స్తుతిస్తాను.

సర్వమంగల మాంగల్యే శివే సర్వార్థసాధికే
శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోఽస్తు తే
నారాయణి నమోఽస్తు తే
నారాయణి నమోఽస్తు తే
మంగళాలకల్లా మంగళకరమైనదానవు, మంగళం ప్రసాదించేదానవు, సకల శుభాలను సాధించి ఇచ్చేదానవు, శరణు పొందడానికి యుక్తమైనదానవు, మూడు కన్నులున్నదానవు అయిన దేవీ! నారాయణీ! నీకు నా నమస్కారము. నారాయణీ! నీకు నా నమస్కారము. నారాయణీ! నీకు నా నమస్కారము.

సరసిజ నిలయే సరోజహస్తే ధవలతరాంశుక గంధమాల్యశోభే
భగవతి హరివల్లభే మనోజ్ఞే త్రిభువనభూతికరి ప్రసీదమహ్యామ్
పద్మవాసినీ, చేత పద్మాన్ని పవిత్రమైన తెల్లని వస్త్రాలను సుగంధపూరిత మాలను ధరించి శోభించేదానా, భగవతీ, హరి అర్ధాంగీ, కోరికలనెరిగి యీడేర్చుదానా, ముల్లోకాలను పోషించి కాపాడేదానవైన నువ్వు నన్ను అనుగ్రహించు.

విష్ణుపత్నీం క్షమాం దేవీం మాధవీం మాధవప్రియామ్
విష్ణోః ప్రియసఖీం దేవీం నమామ్యచ్యుతవల్లభామ్
విష్ణుపత్నీ, భూదేవీ, తులసిమొక్కగా అలరారుతున్నదీ, మాధవుని ప్రియురాలూ, విష్ణువు ప్రియసఖీ, విష్ణువుతో కూడిన దేవీ, నేను నమస్కరిస్తున్నాను.

ఓం మహాలక్ష్మీ చ విద్మహే విష్ణుపత్నీ చ ధీమహి
తన్నో లక్ష్మీః ప్రచోదయాత్
మహాలక్ష్మిని తెలుసుకొందాం. విష్ణుపత్నియైన ఆమెను అందుకై ధ్యానిద్దాం. ఆ లక్ష్మీదేవి మనలకు ప్రేరణనిచ్చుగాక.

శ్రీవర్చస్యమాయుష్యమారోగ్యమావిధాత్ పవమానం మహీయతే
ధనం ధాన్యం పశుం బహుపుత్రలాభం శత సంవత్సరం దీర్ఘమాయుః
ఋణరోగాదిదారిద్ర్యపాపక్షుదపమృత్యవః

భయశోకమనస్తాపా నశ్యంతు మమ సర్వదా

మహాలక్ష్మీ! వర్చస్సు, లోటులేని జీవితం, మంచి ఆరోగ్యం నాకు ప్రసాదించే పవనాలు సదా సర్వవేళలా వీచనీ. ధనధాన్యాలు, పశుసంపద, పుత్రులు, నూరేళ్ళ దీర్ఘాయుస్సు నాకు చేకూరనీ. అప్పు, రోగం, దారిద్ర్యం, ఆకలి, అకాలమరణం, భయశోకాలు, మానసిక వ్యధలు ఇత్యాదులు నశించనీ.

శ్రియే జాత శ్రియ ఆనిర్యాయ శ్రియం వయో జరితృభ్యో దధాతు
శ్రియం వసానా అమృతత్వమాయన్ భజన్తి సద్యః సవితా విదధ్యూన్
శ్రీదేవి చేరేవారిని ఐశ్వర్యం వరిస్తుంది. సంపద, దీర్ఘాయువు చేకూరుతుంది. వారు ఐశ్వర్యంలో తులతూగుతూ మరణంలేని స్థితికి చేరుకొంటారు. సత్వరమే వారు కీర్తిని, విజయాన్ని పొందుతారు.

శ్రియ ఏవైనం తచ్ఛ్రియామాదధాతి
సంతతమృచా వషట్ కృత్యం సంధత్తం సంధీయతే ప్రజయా పశుభిః
య ఏవం వేద
మంచివి అన్నీ లక్ష్మీ దేవియే – ఇలా తెలుసుకొన్నవాడు లక్ష్మీదేవిని చేరుకొంటాడు. మంత్రయుక్తంగా ఎల్లప్పుడూ యాగం చేయాలి. అలాచేసేవాడికి పుత్రసంపద, పశుసంపద లభిస్తుందని గ్రహించాలి.

ఓం మహాదేవ్యై చ విద్మహే విష్ణుపత్నీ చ ధీమహి
తన్నో లక్ష్మీః ప్రచోదయాత్
~ ఓం శాంతిః శాంతిః శాంతిః ~
మహాదేవియైన లక్ష్మీదేవిని తెలుసుకొందాము. విష్ణుపత్నియైన ఆమెను అందునిమిత్తం ధ్యానిద్దాం. ఆ లక్ష్మీదేవి మనలకు ప్రేరణనిచ్చుగాక!

సూక్తము http://kadambakusumam.blogspot.com నుండి కాపీ చేసినది. తెలుగు అనువాదము స్వామి జ్ఞానానంద రచన (శ్రీరామకృష్ణ మఠం ప్రచురణ) నుండి కాపీ చేసినది

---

362. సర్వలక్షణ లక్షణ్యః

- సకల శుభలక్షణములకును నిలయమైనవాడు.
- అన్ని సద్గుణములకును ప్రమాణము.
- అన్ని విశ్లేషణల వల్లనూ పరమ సత్యమని చెప్పబడువాడు.
- సకల వస్తురూపమున దర్శించుకొనదగినవాడు.

ఓం సర్వలక్షణ లక్షణ్యాయ నమః

భగవంతుని సకల శుభలక్షణములను తెలుపుతూ శ్రీభట్టులు ఉదాహరించిన ధ్యానశ్లోకము –

ధ్యాయేత్ కమల గర్భాభమ్ దేవమ్ లక్ష్మీపతిస్తతః

కమలాలయ హేతీశ విభూషిత కరద్వయమ్

కమలమునకు అంతర్భాగమువలె ఉన్నవాడు, ఒక చేత శ్రీలక్ష్మీనిలయమగు పద్మమును, మరొకచేత ఆయుధముల రాజయిన చక్రమును ధరించినవాడును అయిన లక్ష్మీపతిని ధ్యానింతును.

శ్రీ భట్టులు ప్రస్తావించిన మంత్రము –

పుండరీకాక్ష! సకల సుఖ సౌభాగ్య వారిధే!

శ్రీ వి.వి. రామానుజన్ తిరువైమొళి (1.9.1)నుండి ఉదాహరించారు. ఇంకా విష్ణుపురాణములో చెప్పినది – **పశ్యతామ్ సర్వదేవానామ్ యయౌ వక్షస్థలమ్ హరేః** – పాలకడలినుండి వెలువడిన లక్ష్మీదేవి శ్రీమహావిష్ణువు వక్షస్థలము నలరించినది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – అన్ని విధములైన లక్షణములు (ప్రమాణములు) ద్వారా స్పష్టముగా తెలియబడువాడు. అనగా జ్ఞానమువల్ల, భక్తివల్ల, యోగమువల్ల, తర్కమువల్ల – అన్ని శోధనలవల్లను ఆ పరమాత్ముడే సత్యముగా అవగతమగును.

ధర్మచక్రము రచయిత వివరణ. ఏమైనా విషయము తెలిసికొనడానికి 4 మార్గములున్నవి.

ప్రత్యక్ష ప్రమాణము – స్వయముగా ఇంద్రియ జ్ఞానముతో తెలియుట.

యుక్తి ప్రమాణము – పరోక్షముగా తెలియుట (పొగవల్ల నిప్పు).

శాస్త్ర ప్రమాణము – వేదములవంటి శాస్త్రములు చెప్పినది.

అనుభవ ప్రమాణము – అనుభవమువల్ల తెలియునది (తలనొప్పి వంటి విషయాలు)

ఈ అన్ని ప్రమాణములద్వారాను భగవంతుని తెలిసికొనిన మహానుభావుడు శ్రీరామకృష్ణపరమహంస. ఆయన భగవంతుని చూడగలిగిరి. భగవంతుని ఎడబాటు భరింపలేకుండిరి (గాలి లేకపోతే మనము భరింపలేనట్లు). శాస్త్రములవల్లను, గురువులవల్లను భగవంతుని తెలిసికొనిరి. సమాధిస్థితిలో భగవంతుని ఐక్యమయ్యిరి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – లోకములో అన్ని వస్తువులు, కార్యములు భగవంతుని సూచించును. అన్నింటికిని ఆయనే కారణము. అన్నింటా దేవుడున్నాడు.

363. లక్ష్మీవాన్

సదా శ్రీలక్ష్మీదేవితో కూడియుండువాడు. సిరిగలవాడు. శ్రీనాధుడు. శ్రీనివాసుడు.

ఓం లక్ష్మీవతే నమః

ముందుమాట – శ్రీ భట్టుల వ్యాఖ్యను ఆచార్య శ్రీనివాస రాఘవన్ అనువదించారు. ఆ సమయంలో ఆయన చెప్పిన విషయము – భగవంతునకు, లక్ష్మీదేవికి గల అనుబంధపు తత్వమును గురువు కృపవలన తెలిసికొనవలసినది.

లక్ష్మ్యా చ నిత్య యుక్తత్వాత్ లక్ష్మీవానితి కథ్యతే – శ్రీదేవితో నిత్యము కూడియుండువాడు లక్ష్మీవాన్. ఆ తల్లి జగన్మాత. శ్రీరంగనాధునికి నిత్యానపాయిని. వేంకటరమణుని పట్టపురాణి. జనని, జానకి, జగమేలు తల్లి.

నిత్యము, సత్యము అయినవి, ఆద్యంతములు లేనివి రెండు – భగవంతుడు, ప్రకృతి. ఈ ప్రకృతియే జగన్మాతృక, శ్రీలక్ష్మి. పురుషుడే నారాయణుడు. ప్రకృతి, పురుషుల వలన సకల నామరూపాత్మకమగు విశ్వము ఉద్భవించి, ప్రవర్తిల్లుచున్నది. సత్వరజస్తమో గుణములవల్ల ప్రకృతి పరిణామము చెందుచున్నట్లు అనిపించును. మూలప్రకృతియే మహాలక్ష్మి.

శ్రీ భట్టులు ఉదాహరించిన ప్రమాణము –
ద్వయమ్ దేవీ పరిణయే లీలాయైవ సమర్పయన్
ప్రకాశయన్ అనాదిత్వమ్ ఆత్మనా ప్రకృతే సహ
మత్కరైః అనువిద్ధేయమ్ ప్రకృతిః ప్రకృతైరహమ్
యతోఽహమ్ ఆశ్రితశ్చ అస్య మూర్తిః మయి ఏతదాత్మికా
శ్రీదేవితో నా పరిణయము జరిగిన సమయమున నేను సంతసించి లీలాస్వరూపమును అందరికిని చెప్పితిని. ఈ పరమ సత్యము లక్ష్మీనారాయణుల జంటయేగాని వేరువేరుగా కాదు. నావలెనే లక్ష్మి కూడ అనాది తత్వము. అంత్యరహితము. నేను, ఈ ప్రకృతి రెండు చేతుల ఆలింగనము చేసికొంటిమి. మేమిరువురము అప్పటినుండి ఒకటే.

శ్రీ చిన్మయానంద కూడ ఇదే భావమును వివరించారు. లక్ష్మి ప్రకృతి స్వరూపము. విష్ణువు పురుష స్వరూపము. ప్రకృతియొక్క శక్తి పురుషుని దీప్తిచే చైతన్యవంతమై మనకు కనుపించే నామరూపాత్మక విశ్వమై శోభిల్లుచున్నది. కనుక భగవానుడు 'లక్ష్మీవాన్' అనబడును.

364. సమితింజయః

- అసంఖ్యాక సైన్య సమూహమును జయించినవాడు.
- భగవంతుని ఎడబాటుచే బాధపడు భక్తుల హృదయములను జయించి, వారిని తనకడకు తీసికొనువాడు.

ఓం సమితింజయాయ నమః

సమితిం యుద్ధం జయతి ఇతి సమితింజయః – ఇక్కడ 'సమితి' అనగా 'యుద్ధము' అనే అర్ధములో శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. శత్రుసమూహములను జయించువాడు గనుక సమితింజయుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భక్తుల కష్టములను నాశనము చేయువాడు. భక్తుల మనసులను జయించి, పరమాత్మునినుండి దూరమైన జీవాత్మలకు ఆనందము కూర్చువాడు.

శ్రీ రాధాకృష్ణ శాస్త్రి – 'సమితి' అనగా 'సమూహము'. ఎందరు శత్రువులు దండెత్తినాగాని వారిని జయించువాడు సమితింజయుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ మద్రామాయణము – అరణ్యకాండము నుండి.
బ్రహ్మశ్రీ కొంపెల్ల వెంకటరామశాస్త్రిగారి సరళ సుందర వచన గ్రంధమునుండి సంక్షిప్త పరచినది.
శ్రీరామునిచేత పద్నాలుగు వేలమంది రాక్షసులు నశించుట.

రామలక్ష్మణులచేత భంగపడిన శూర్పణఖ తన సోదరుడైన ఖరునితో మొరపెట్టుకొన్నది. వెంటనే ఖరుడు యముళ్ళలాంటి పద్నాల్గురు రాక్షసులను పిలిచి రామలక్ష్మణులను చంపిరమ్మని ఆజ్ఞాపించాడు. వాళ్ళు శూర్పణఖతోడుగా వెళ్ళి, సీతతోనూ, లక్ష్మణునితోనూ పర్ణశాలలో కూచుని ఉండిన రాముడిని చూశారు. రాముడు వాళ్ళను చూసి, సంగతి అంతా గ్రహించి, "తమ్ముడూ! నీవు సీత దగ్గర ఉండు. శూర్పణఖ మాటమీద వచ్చిన వీళ్ళను నేనిప్పుడే సంహరించి వస్తాను" అని చెప్పాడు. లక్ష్మణుడు సరేనన్నాడు.

పదునాల్గురు రాక్షసులు రాముణ్ణి చూసి, శూలాలు విసిరారు. పదునాల్గు బాణాలతో రాముడు ఆ పదునాల్గు శూలాలనూ ముక్కలు చేసేశాడు. ఇంకా క్రుద్ధుడై ఎండదేవుడిలా మండిపడిపోతూ పదునాలుగు బాణాలు తొడిగి, కొండమీద వజ్రాయుధం వేసినట్లు వాళ్ళమీద విడిచిపెట్టాడు. వెంటనే వాళ్ళు నేలకూలారు. వాళ్ళ రక్తంతో నేల అంతా తడిసిపోయింది. అంతా చూసి శూర్పణఖ బావురుమంటూ మళ్ళీ పరుగెత్తిపోయి ఖరునిముందు కూలబడింది. ఖరుడిని ఎత్తిపొడిచి మాట్లాడింది.

రోషంతో మండిపడి ఖరుడు దూషణుడనే సేనాధిపతిని చూచి "మన పద్నాలుగువేల సైన్యమునూ సిద్ధం చెయ్యి. నేనే ముందుగా దుర్వినీతుడైన రాముణ్ణి సంహరించడానికి వెడతాను. నా రధం సిద్ధం చెయ్యి" అని చెప్పాడు.

భీమవిక్రములైన రాక్షసులు ఖరుణ్ణీ, దూషణుణ్ణీ పరివేష్ఠించి నిలిచారు. వాళ్ళంతా ఆ మహారణ్యం అంతా దద్దరిల్లిపోయేటట్టు బొబ్బలు పెడుతూ బయలుదేరారు. రథనేమి ధ్వనితో ఆకాశం బద్దలయిపోయింది. అప్పుడు రాక్షసులకు అమంగళకరంగా, భయోత్పాతంగా దుర్నిమిత్తాలు కానవచ్చాయి.

మృత్యుముఖంలో ఉన్న రాక్షససేనను చూచి మహర్షులూ, దేవతలూ, గంధర్వులూ, సిద్ధులూ, చారణులూ ఆకాశాన ఉండి "గోవులకూ, బ్రాహ్మణులకూ, లోకకళ్యాణం కోరేవారందరికిన్నీ మంగళం అగుగాక. సుదర్శన చక్రధారి అయిన శ్రీమహావిష్ణువు అసురులను సంహరించేటట్టు శ్రీరామచంద్రుడు ఈ రాక్షసులనందరినీ సంహరించి విజయం పొందాలి" అన్నారు. గ్రహాలన్నీ రవిచంద్రులను చేరినట్టు ఆ రాక్షసులందరూ రామలక్ష్మణులను సమీపించారు.

ఆకాశంలో పుట్టిన ఉత్పాతాల్ని లక్ష్మణునకు చూపుతూ రాముడు "తమ్ముడూ! ఈ మహోత్పాతాలు చూశావా! ఇవి రాక్షస వినాశానికి వచ్చాయి. మనకు జయమూ, శత్రువునకు పరాజయమూ కూడా తప్పదని అనిపిస్తోంది" అని, చెట్ల గుబురుగులో దుర్గంలా ఉన్న పర్వతగుహను చూపి "నీవు ధనుష్పాణివై సీతను అక్కడికి తీసుకువెళ్ళి జాగ్రత్తగా చూస్తూ ఉండు" అని చెప్పాడు. వెంటనే లక్ష్మణుడు మారు చెప్పకుండా, ధనుర్బాణాలు పుచ్చుకొని, సీతను వెంటబెట్టుకొని గుహలోకి వెళ్ళిపోయాడు.

అగ్నిలాగ వెలిగిపోతున్న రాముడు కవచం తొడుక్కొని, ధనుస్సు చేతబుచ్చుకొని, దిక్కులు పిక్కటిల్లేట్లు నారి మ్రోగిస్తూ ఇవతలికి వచ్చాడు. అప్పుడు క్రోధావేశంతో యుద్ధానికి సిద్ధంగానున్న రాముణ్ణి చూసి సమస్తభూతాలూ గడగడలాడిపోయాయి. పరవళ్ళు తొక్కుతూ సాగరంలా పొంగివస్తున్న ఖరునిసైన్యం రాముణ్ణి సమీపించింది. కౌశికుని శిష్యుడు, రణపండితుడు అయిన రాముడు ఒక్కసారి ఖరసైన్యాన్ని కలయచూశాడు. దుర్నిరీక్ష్యుడైన రాముణ్ని చూసి రాక్షసులుకూడా వణికిపోయారు. అప్పుడు రాముని రూపం దక్షుని యజ్ఞం నాశనం చెయ్యబూనిన పినాకపాణి రౌద్రరూపంలా ఉంది.

ఖరుడూ, పన్నెండుమంది రాక్షసులూ తీక్షణమైన ఆయుధాలతో రాముణ్ణి ముట్టడించారు. గాయపడిన రాముడు మిక్కిలి క్రోధం తెచ్చుకొని రాక్షసులమీద వేలాది బాణాలు విడిచాడు. అవి యమపాశాల్లాగా రాక్షసుల ప్రాణాలు తీశాయి. రాక్షససైన్యం ఎండిపోయిన అరణ్యంలా అయిపోయింది. అనేకులు చావగా మిగిలినవారు ఖరుని శరణుజొచ్చారు. దూషణుడు క్రోధోద్రిక్తుడై రాముని మీదికివచ్చి కవ్వించాడు. కోపించిన రాముడు బాణాలతో దూషణుని ధనుస్సునూ, గుర్రాలనూ, సారథినీ, ఆపై దూషణుని గుండెలనూ, చేతులనూ చీల్చేశాడు.

క్రుద్ధుడైన ఖరుడూ, వాని పన్నెండుగురు సేనాధిపతులు – శ్యేనగ్రామీ, పృథుగ్రీవుడూ, యజ్ఞశత్రువూ, విహంగముడూ, దుర్జయుడూ, కరవీరాక్షుడూ, పరుషుడూ, ఆలకర్ముకుడూ, మేఘమాలీ, మహామాలీ, సర్పముఖుడూ, రుధిరాశనుడూ – రాముని మీదికురికారు. వజ్రసమానమైన రాముని బాణాలకు ఆ రాక్షసులందరూ కవచాలు బ్రద్దలయిపోయి, ధనుస్సులూ, బాణాలూ ముక్కలయి, రక్తం వోడ్చుకుంటూ భూమిమీద పడిపోయారు. ఆ వనం అంతా రాక్షసుల రక్తమాంసాలతో నిండిపోయింది.

రాముని చేతిలో ఇలాగ పధ్నాలుగువేలమంది రాక్షసులు కూలిపోగా ఖరుడు, త్రిశిరుడు మాత్రమే యుద్ధభూమిలో మిగిలియున్నారు. రామునిమీదికి బయలుదేరిన ఖరుని ఆపి త్రిశిరుడు యుద్ధానికి వచ్చాడు. అలా వచ్చిన త్రిశిరునిపై

వాడిబాణాలు వేసి వానిని యమునికి అతిథిగా పంపించాడు రాముడు. అది చూసి ఖరుడు నిజంగా భయపడ్డాడు. కాని అంతలో రోషం తెచ్చుకొని రామునిమీదికి వురికాడు. వారిద్దరి బాణాలతోను ఆకాశం నిండిపోయి దిగ్భేదం తెలియకుండా అయిపోయింది. ఆ శరజాలంతో సూర్యబింబం కూడా కప్పబడిపోయింది. ఒక మద్దిచెట్టును పెరికి ఖరుడు రామునిమీదికి విసిరేశాడు. ఆ చెట్టును తునకలు చేసి, రాముడు బాణాలతో ఖరుని శరీరం అంతా తూట్లుతూట్లుగా కొట్టాడు. రాముని బాణాల దెబ్బకు ఖరుని శరీరాన రక్తం కాల్వలు కట్టింది. వాడి మనస్సు చలించింది. తన నెత్తురు వాసనకే మత్తుకలిగి వాడి తల తిరిగిపోయింది. వెంటనే ఏమి చేస్తున్నదీ తెలియక రామునిమీదికురికాడు. రక్తం వోడ్చుకుంటూ ఖరుడు మీదికి వచ్చేటప్పటికి వెంటనే దాశరధి అగ్నిలా మెరుస్తున్న బాణం తొడిగి విడిచాడు. మరుక్షణంలో ఖరుడు నేలమీద పడిపోయాడు.

ఆకాశంలో దేవదుందుభులు మ్రోగిస్తూ దేవతలు పూలవాన కురిపించారు. "ఓహో! రాముడొక్కడే క్షణంలో పధ్నాలుగువేలమంది రాక్షసులను సంహరించాడు. ఆహా! శ్రీమహావిష్ణువు శక్తిసామర్ధ్యాలు శ్రీరామునిలో కనబడుతున్నాయి" అని దేవతలు ప్రశంస చేస్తూ యథేచ్ఛగా వెళ్ళిపోయారు. విజయఘోష విని లక్ష్మణుడు సీతను వెంటబెట్టుకొని గుహలోనుండి ఆశ్రమానికి వచ్చాడు. ఎందరో మునులు వెంటరాగా రాముడూ ఆశ్రమంలో ప్రవేశించాడు. వెంటనే లక్ష్మణుడతన్ని పూజించాడు. రాముడు రాక్షసులనందరినీ సంహరించడమూ, అపాయమేమీ లేకుండా క్షేమంగా వుండడమూ చూసి సీత చాలా సంతోషించి అతన్ని మిక్కిలి ప్రస్తుతించింది.

శ్రీరామ! రామ! రఘునందన! రామ! రామ!
శ్రీరామ! రామ! భరతాగ్రజ! రామ! రామ!
శ్రీరామ! రామ! రణకర్కశ! రామ! రామ!
శ్రీరామ! రామ! శరణం భవ! రామ! రామ!

శ్రీ సీతారాములకు నమస్కారములు. శ్రీలక్ష్మణస్వామికి నమస్కారములు. శ్రీ భరత శత్రుఘ్నులకు నమస్కారము. జై వీరాంజనేయ.

విక్షరో రోహితో మార్గో హేతుర్దామోదరస్సహః |
మహీధరో మహాభాగో వేగవానమితాశనః || (40)

365. విక్షరః

- క్షీణత లేనివాడు.

- భక్తులయెడ తరగని ప్రేమ గలవాడు.

ఓం విక్షరాయ నమః

విగతః క్షరః యస్య స విక్షరః – అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. 'క్షరము' అనగా తరిగిపోవుట. క్షరము లేనివాడు విక్షరుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ఉక్త స్నేహస్యాక్షరణాత్ విక్షరః పరికీర్తితః** – భగవంతునకు భక్తులపైనున్న ప్రేమ అపారము. వారు చేయు తప్పులను క్షమించి, వారిపై కరుణను వర్షించు అమృతమయుడు విక్షరుడు.

366. రోహితః

- పద్మము లోపలివలె ఎర్రని వర్ణము గలవాడు.

- శ్రీ మత్స్యావతార మూర్తి.

- ప్రావిర్భవించువాడు.

ఓం రోహితాయ నమః

కమల గర్భత్వాత్ రోహితః – కమలము లోపలివలె ఎర్రనివాడు. శ్రీ వి.వి. రామానుజన్ తిరువైమొళి (8.4.7) నుండి ఉదాహరించారు – **తిరుచ్చెయ్య కమలక్కణ్ణుమ్ సెవ్వాయుమ్ సెవ్వాడియుమ్ సెయ్యకైయుమ్ తిరుచ్చెయ్య కమల ఉందియుమ్ సెయ్య కమల మార్పుమ్.**

'రోహిత' అనేది ఒక జాతి చేప. ఈ అర్థాన్ని పురస్కరించి శ్రీ శంకరులు చెప్పిన వ్యాఖ్య – ఎర్రని చేపగా అవతరించినవాడు గనుక రోహితుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'రుః' అనే ధాతువునకు **'ప్రాదుర్భావే చ'** – పెరుగుట, విస్తరించుట, అందుకొనుట అనే భావమున్నది. **ప్రాదుర్భవతి ఇతి రోహితః** – ప్రాదుర్భవించువాడు రోహితుడు. విశదపరచువాడు. తెలియజెప్పువాడు.

367. మార్గః

- వెదకబడువాడు. అనుసరింపబడువాడు.
- మోక్షమునకు దారి చూపువాడు.
- ప్రళయానంతరము పునఃసృష్టికి మార్గమైనవాడు.

ఓం మార్గాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

40వ శ్లోకము. 367వ నామము. మార్గః – **విక్షరో రోహితో మార్గో హేతుర్దామోదరస్సహః**

43వ శ్లోకము. 399వ నామము. మార్గః – **రామో విరామో విరతో (విరజో) మార్గో నేయో నయోనయః**

తిరువైమొళి నూట్ఱందాడి (91) నుండి శ్రీ వి.వి. రామానుజన్ చెప్పిన ఉదాహరణ – **తాళ్ అడైందార్ తంగట్కు తానే వడిత్తుణైయామ్ కాళమేగత్తై** – తనకు శరణాగతులైనవారికి తాను తోడుగానుండి దారి చూపును.

శ్రీ శంకరులు మరొక అర్థము కూడా చెప్పారు – మోక్షమునకు దారి చూపువాడు గనుక మార్గము.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి చెప్పిన మరొక భావము – ప్రళయకాలానంతరము జగత్తు అంతరించినపుడు (ఆయనలో లీనమైనపుడు) పునఃసృష్టికి ఆయనే మార్గము.

గజేంద్రుని ప్రార్థన –

ముక్త సంగులైన మునులు దిద్రుక్షులు

సర్వ భూత హితులు సాధుచిత్తులు

అసదృశ వ్రతాఢ్యులై కొల్తురెవ్వని

దివ్యపదము వాడు దిక్కు నాకు.

సంసార బంధనాలు విడిచి, బ్రహ్మసాక్షాత్కారము కోసము శరీరాన్ని నియమనిష్టలతో శుష్కింపజేసి, వ్రతాలు, దీక్షలు ఆచరిస్తూ ఉండే మహర్షులు ఎవని దివ్య పాదారవిందములను పూజిస్తారో అతడిని నేను శరణు వేడుచున్నాను.

368. హేతుః

కారణము.

ఓం హేతవే నమః

'కారణము' అనే అర్థమును రెండు విధాలుగా వ్యాఖ్యానించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – వాంఛితార్థముల సిద్ధికి కారణమైనవాడు. కొండలంత వరములు గుప్పెడువాడు. ఇహపరముల నొసగువాడు. కామితార్థ ప్రదాయకుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – సకలమునకు ఉపాదాన కారణము, నిమిత్త కారణము అయినవాడు. సృష్టించువాడును, సృష్టియును శ్రీమన్నారాయణుడే. కారణము, కార్యమును ఆయనే.

కార్యము	**ఉపాదాన కారణము**	**నిమిత్త కారణము**
ఏదైనా పని	ముడి పదార్థము	పని చేయువాడు
కుండ	మట్టి	కుమ్మరి
సకల సృష్టి	శ్రీనివాసుడు	శ్రీనివాసుడు

ధర్మ చక్రము రచయిత వివరణ – సామాన్యముగా మనకు ప్రభావములు తెలియవచ్చును గాని కారణములు కనిపించవు. విశ్వములో మనము నివశించుదుము, పంచ భూతములను వినియోగించుదుము. కాని కారణము మనకు తెలియరాదు. శరీరము కనిపించును గాని దానికి మూలమైన పంచభూతములను తెలిసికొనము. యోగులు, జ్ఞానులే హేతువు నెఱుగుదురు.

369. దామోదరః

- సకల భువనములు (దామములు) తన యుదరమునందు కలిగివాడు.
- యశోదచేత దామము (త్రాడు)చే కట్టివేయబడినవాడు.
- భక్తుల కొరకు ఆనందమును కలిగినవాడు.
- 'దమము' వంటి సాధనములచేత పొందబడువాడు.

ఓం దామోదరాయ నమః

'దామము' అన్న పదమునకు త్రాడు, లోకము, ఆనందము అనే వేర్వేరు అర్థములున్నవి. 'ఉదరము' అనగా పొట్ట.

దామాని లోకనామాని హ్యుదరే యస్య సంతినః

దామోదర ఇతి ఖ్యాతో యశోదా ధదామ బంధనాత్

దేవానాం సుఖ శంసిత్వాత్ దామోదరోఽపివా

ఉదరే దామాని అస్య ఇతి దామోదరః – లోకములన్నింటిని తన బొజ్జయందు నిలుపుకొన్నవాడు దామోదరుడు. తన నోట యశోదాదేవికి సకల భువనములను చూపినవాడు. ఇందుకు వ్యాసుడు చెప్పినట్లుగా ఉదాహరించిన ప్రమాణము –

దామాని లోకనామాని తాని యస్య ఉదరాంతరే

తేన దామోదరో దేవః శ్రీధరః శ్రీసమాశ్రితః

త్రాడుచే నడుమునకు కట్టబడినవాడు దామోదరుడు. వ్రతములకు, తపములకు చిక్కని పరమాత్ముడు యశోదాదేవి చేత చిక్కగా ఆమె అతనిని రోట బంధించినది.

దదర్శ చాల్ప దంతాస్యం స్మితహాసంచ బాలకమ్

తయోర్మధ్యగతం బద్ధం దామ్నా గాఢం తదోదరే

తతశ్చ దామోదరతాం సయమో దామబంధనాత్ – బ్రహ్మపురాణము 76.14

చిన్న దంతములు కలిగి, చిరునవ్వు నవ్వుతూ, యశోదాదేవిచే కట్టబడినవాడై, నలకూబరుడు మరియు మణిగ్రీవుడు అనే మద్దిచెట్ల మధ్యనుంచి పోయిన బాలుని గోపబాలురు చూశారు. అప్పటినిండే అతడు దామోదరుడని పిలువబడ్డాడు. శ్రీ శ్రీనివాస రాఘవాచార్యస్వామిగారు 'శ్రీ నృసింహప్రియ' పత్రిక (తమిళ వ్యాఖ్యానం)లో చెప్పిన విషయం – పరమాత్ముడు గోపబాలుడై యశోదచేత ముద్దులు తిని, ఆమెచే కట్టుబడినాడు. పరమాత్ముడు భక్తపరతంత్రుడని ఈ ఘటనవలన తెలియుచున్నది.

శ్రీ శంకరులు చెప్పిన మరొక అర్థము – **దమాది సాధనేన ఉదర (ఉత్కృష్ట) మతిః (యా తయా గమయత) ఇతి దామోదరః** – దమము (నిగ్రహము) వంటి సాధనములవలన మనసును స్వచ్ఛము (ఉదరము, ఉత్కృష్టము) చేసికొనినయెడల తెలియవచ్చువాడు. మహాభారతము ఉద్యోగపర్వము(5.69.8)లో **'దామాత్ దామోదరో విదుః'** అని చెప్పబడినది.

ఈ నామ వివరణలో ధర్మచక్రము రచయిత చక్కని వ్యాఖ్య చెప్పారు – త్రాటిచే రోట కట్టబడినవానిని తెలిసికొనుటకు ఒకే మార్గమున్నది. పంచేంద్రియములను అటునిటు తిరుగకుండ నిర్బంధించి భాగవతసేవయను ఒకేమార్గమున నడిపించుట.

శ్రీ రాధాకృష్ణమూర్తి – అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు గోపాలకుడై భక్తులకు కొంగుబంగారమై అందినాడు. భగవంతుడు భక్త సులభుడు.

370. సహః

సహించువాడు. ఓర్పుగలవాడు. యశోదమ్మ తనను రోట బంధించినపుడు సహించినవాడు.

ఓం సహాయ నమః

సహతే ఇతి సహః – సహించువాడు సహుడు.

యశోదాకృత బంధాది సహనాత్ సహ ఈరితః – యశోదమ్మ రోట బంధించినపుడు సహించినవాడు. యశోదాకృష్ణుడు. అని శ్రీ భట్టులు ఈ నామమును ఇంతకుముందరి నామము 'దామోదరుడు'తో అనుసంధించారు.

సహతే సర్వాన్ అభిభవతి ఇతి సహః –భక్తుల తప్పిదములను సహించువాడు – అని శ్రీ శంకరుల వ్యాఖ్య.

అజ్ఞానినా మయా దోషాన్ అశేషాన్ విహితాన్ హరే
క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైల శిఖామణే
భక్తులకు కనువిప్పు కలుగువరకు వారి అపరాధములను సహించువాడు. జన హితమునకై భూభారము వహించువాడు. జగములను భరించువాడు. శిశుపాలుని నూరు తప్పులను కాచినవాడు.

371. మహీధరః

భూమిని ధరించినవాడు.

ఓం మహీధరాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

34వ శ్లోకము. 319వ నామము. మహీధరః – **క్రోధహా క్రోధకృత్కర్తా విశ్వబాహుః మహీధరః**

40వ శ్లోకము. 371వ నాము. మహీధరః – **మహీధరో మహాభాగో వేగవానమితాశనః**

ఇంతకుముందు 319వ నామము 'మహీధరుడు' అనగా – భూమిపై దుర్జనులను శిక్షించి, సజ్జనులను పరిరక్షించి, భక్తుల పూజాదికములను పరిగ్రహించువాడు – అని చెప్పడమైనది. ఇప్పుడు 'మహీధరుడు'

అనగా – కులపర్వతముల రూపమున భూమిని నిలుపువాడు – అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. విష్ణుపురాణము(2.12.37)లో **'వనాని విష్ణుర్గిరాదియో దిశశ్చ'** అందుకు ప్రమాణము. విష్ణువే అడవులు, పర్వతాలు, దిశలు, అన్ని లోకములకు ఉపాదాన కారణము.

శ్రీ వరాహమూర్తియై భూమిని తన కోరలమధ్య నిలిపినవాడు మహీధరుడు అని శ్రీ వి.వి. రామానుజన్ వ్యాఖ్యానించారు.

శ్రీ కైవల్యసారధినుండి –
శింశుమారాత్మనా విష్ణుః భూరాదీ నూర్ధ్వతస్థితాన్ దధ్రే శేష తయా లోకాన్ సప్తలోకాన్ అథస్థితాన్
శ్రీ మహావిష్ణువు మొసలి రూపంలో ఊర్ధ్వలోకాలను, ఆదిశేషుని రూపంలో అధోలోకాలను ధరిస్తున్నాడు.

అస్మిన్ మహతి బ్రహ్మండ ఖండయోః మధ్యే ... . **ఆధారశక్తి, శ్రీకూర్మ, వరాహ, వైష్ణ, అనంత, నాగ, శేష, తక్షక అష్టదిగ్గజో పరివేష్టితే** .... – పెద్ద బ్రహ్మండపు తునక నడుమ 1. ఆధారశక్తి 2. శ్రీకూర్మము 3. వరాహము 4. వైష్ణవము 5. అనంతము 6. నాగ 7. శేష 8. తక్షక – అనే అష్టదిగ్గజాలు ఎనిమిది దిక్కులందు నిలువగా ఊర్ధ్వలోకాలకు క్రిందభాగాన, అధోలోకాలకు పైభాగాన

చక్రవాళ శైల మధ్యగత మహాసుమేరోః సహస్ర శిఖరానువర్తిని మహానాయమాన ఫణిరాజ రాజస్య శేషస్య సహస్ర ఫణామణిమండం మండితే – చక్రవాళము మొదలైన పర్వతములను కులపర్వతములంటారు. ఈ కులపర్వతాల రూపంలో పరమేశ్వరుడు ఈ భూమిని మోస్తున్నాడు. అందుచేతనే ఆయన మహీధరుడు.

372. మహాభాగః

- మహాసౌభాగ్యమును పొందువాడు.
- ప్రతి అవతారమునందు ఉత్తమమైనదానిని పొందువాడు.
- నైవేద్యములో, యజ్ఞములో హవిర్భాగమును స్వీకరించువాడు.

ఓం మహాభాగాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **రుక్మిణ్యాది బహుస్త్రీభిః మహాభాగ స్స్వయంవృతః** – నీలాదేవి, పేలాది ఉత్తమ గోపకాంతలు, రుక్మిణి, సత్యభామ, జాంబవతి వంటి ఉత్తమ స్త్రీలచే వరింపబడినవాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – తన ఇష్టానుసారము ఉత్తమ రూపములు దాల్చి అవతరించువాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతునకు నివేదించినదానిలో ప్రధానభాగమును స్వీకరించువాడు మహాభాగుడు. గోపాలురు గోవర్ధనగిరిని పూజించి, నైవేద్యములు అర్పింపగా శ్రీకృష్ణభగవానుడు గిరిశిఖరమున దర్శనమిచ్చి నైవేద్యముల నారగించెను.

తిరుప్పావై 19వ పాశురము – గోదాదేవి బృందము నీలాదేవిని నిదుర లేపుట.

1. శ్రీ భమిడిపాటి రాధాకృష్ణమూర్తి వ్యాఖ్య 2. డా. వేదవ్యాస వ్యాఖ్య – ఈ రెండింటినుండి సంగ్రహించినది.

భగవంతునకు భక్తుని పొందు పరవశం కలుగజేస్తుంది. **నీలాతుంగస్తన గిరితటీ సుప్తముద్బోధ్య కృష్ణం** – అని శ్రీ పరాశరభట్టు వర్ణించారు.

గుత్తుల దీపారాధన జ్యోతులు వేయిచుట్లు వెలుగుతూవుండగా అందమైన ఏనుగు దంతపు కోళ్ళమంచంపై చల్లగా పాలనురుగువలె, తెల్లగా మెత్తగా హంసతూలికా తల్పంపై పడుకొని ఘుమ్మని పరిమళించే పూలగుత్తు సిగముడిలో ధరించుకొని, బంగారు కలశమువంటి స్తనములపై హాయిగా పవళించిన మెత్తని వక్షస్థలం కలవాడా! పలుకే బంగారమయిందా? నోరు తెరచి పలుకవయా!

ఓ విశాలమైన కాటుక కన్నులుగల సొగసుగత్తె! నీ ప్రియుడు ఎక్కడకు పోతాడో అని క్షణమైనా వదలలేకుండా కౌగిలించుకొని లేవనీయవా ఏమి? కాస్తయినా ఆయనను నీవు విడిచిపెడితేగదా మాకు శ్రీవారు దర్శనమిచ్చేది? ఇంత స్వార్థము నీకు తగదమ్మా! – అని ఈ పాశురములో నీళాదేవి కౌగిటిలో మైమఱచి నిదురించిన కృష్ణయ్యను కాస్త విడిచిపెట్టమని మేలుకొలుపుతో ప్రార్థిస్తున్నది గోదామాత!

ఆడుచు పాడుచు నందొక చేడియ మంజీర మంజు శింజిత మమరం గూడి హరికరము సనుగవపై డాయవిడిచె జఘన భారాలసయై (పోతన భాగవతము. దశమస్కంధము).

నీలాదేవి రతిశ్రమతనూవివశయై నిదురించుచున్నది. ఆమెను మేల్కొలుపుటకు **'పన్దార్ విరలి'** (బంతితో నిండిన చేతులు-వ్రేళ్ళు కలదానా!) అని పిలిచింది గోదాబృందం. నీలాదేవి తన లాలసకు తాను కొంచెం సిగ్గిలినప్పటికీ, లేచి తలుపు తీయవలెననుకొన్నది. కాని, ఆమె శయ్యపైనుండి లేవలేకపోయినది. కారణము బైటనున్నవారు తేలికగా ఊహించగలుగుచున్నారు. ఆమె **'కన్దమ్ కమళమ్ కుళలీ'** – సుగంధమును వెదజల్లుచున్న కేశపాశములు కలిగియుండుట ఒక కారణము. నీలాదేవి తాను వచ్చి తలుపు తెరవవలెననుకొన్నది. ఒక్క ఉదుటను లేవనుంకించినది. కాని ఆమెపైని కృష్ణుని చేయి అదిమియున్నది. లేవనుంకించిన ఆమె తిరిగి వివశయైనది.

లేవబోయిన నీలాదేవిని తిరిగి శయ్యపై పరుండజేసి తత్సుఖాపాదితమైన తన్మయతతో తిరిగి నిద్రాలాలసుడయ్యెను. బైట గోపికల పిలుపు విని శ్రీకృష్ణుడు లేవబోయిన ఆమె లేవనీయలేదు. ఇప్పుడు ఇద్దరినీ మేల్కొలపవలసివచ్చింది. అన్యోన్యాలింగన సౌఖ్యమునందు మునిగితేలుతున్న నీలాదేవిని 'ఇది నీకు తగునా' అని నిలదీయుచున్నారు గోపకాంతలు – కాటుక కన్నులదానా! నాథుని లేవదీయవా ఏమి? ఈ ఓర్వలేనితనము నీ స్వభావము కాదుగదా!

373. వేగవాన్

మిక్కిలి వేగము గలవాడు.

ఓం వేగవతే నమః

దుర్వార పరమైశ్వర్య ప్రసరత్వాద్విశేషతః

మనుష్యధర్మే బాల్యేऽపి వేగానితి (వేగవానితి?) శబ్ద్యతే

శ్రీ భట్టులవ్యాఖ్య – బాలునిగానున్నపుడే దుర్వారమగు పరమైశ్వర్యశక్తిని ప్రదర్శించినవాడు. పూతన ప్రాణమును హరించిన నందనందనుడు. శకటాసురుని మట్టుబెట్టిన యశోదానంద వర్ధకుడు. గోవర్ధనగిరినెత్తిన గోపబాలుడు.

శ్రీ చిన్మయానంద వ్యాఖ్య – తలచినంతనే అందివచ్చు భక్తసులభుడు. ద్రౌపది ఆక్రందన విన్నంతనే వచ్చి ఆమెను రక్షించినవాడు. మొరలిడిన కరిరాజును గాచుటకై సంరంభమున వెడలిన వైకుంఠవాసుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య ఈశావాస్యోపనిషత్తు ఆధారముగా సాగినది.

అనేజదేకం మనసో జనీయోనైనద్దేవా ఆప్నువన్ పూర్వమర్షతు

తద్ధావతోऽన్యానత్యేతి నిష్ఠ త్తస్మినపోమాతరిశ్వా దధాతి

ఆత్మ చలనరహితమైనది. అయినప్పటికీ అది మనసుకంటె వేగంగా పోతుంది. ఇంద్రియాలకు అందదు. స్థిరమైనది అయినాగానీ పరుగుతీసేవానికన్నా ముందుకు పోతుంది. ఆత్మ తన సన్నిధిమాత్రం చేత ప్రాణికోటుల కార్యకలాపాలను భరించడానికి ప్రాణశక్తిని సమర్ధం చేస్తున్నది.

ఆత్మస్వరూపుడైన పరమాత్ముడు వేగవతి. మనసునకు అందజాలనివాడు.

374. అమితాశనః

- అమితముగా భుజించినవాడు.

- ప్రళయకాలమున సమస్తమును కబళించువాడు.

- సృష్టిలో సకల జీవులకు ఆహారము ప్రసాదించువాడు.

ఓం అమితాశనాయ నమః

అమితం అన్నం అశ్నాతి ఇతి అమితాశనః – అమితముగా అన్నమును భుజించినవాడు అమితాశనుడు. 304వ నామము 'మహాశనః'కు కూడా ఇదే విధంగా అర్థము చెప్పబడినది.

ఇంద్రాయ కల్పితం గోపైః అమితం చాశనం స్వయమ్ భుక్తవాన్ యశ్చ నిశ్శేషం ప్రోచ్యతే సోఽమితాశనః – గోపజనులు గోవర్ధనగిరికి అర్పించిన మహాప్రసాదమును అంతటిని ఆరగించిన గోపీజనప్రియుడు. అదిచూచి గోపాలురు **'దేవో దానవో వా త్వమ్'** (విష్ణుపురాణము 5.13.121) అని అబ్బురపడిరి. ఇది శ్రీ భట్టుల వ్యాఖ్య.

శ్రీ వి.వి. రామానుజన్ దివ్యప్రబంధములనుండి ఉదాహరించారు – పెరియాళ్వార్ తిరుమొళి 3.5.1 – కొండవలెనున్న అన్నపురాశి, ఏరువలెనున్న పెరుగు, చెరువువలెనున్న నెయ్యి – అన్నింటినీ క్షణమాత్రమున ఆరగించిన వెన్నదొంగయే అమితాశనుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్యానుసారము ప్రళయకాలమున అంతటినీ ఆరగించువాడు అమితాశనుడు. ఆయనకు అరగనిది లేదు. ఆయనే జఠరాగ్ని. **అహం వైశ్వానరో భూత్వా … …. పచామ్యన్నమ్ చతుర్విధమ్** (గీత 15.14).

ధర్మచక్రము రచయిత – భోజనము ఎంత అవుసరమో అరుగుదల అంతే అవుసరము. అరుగుటకు జఠరాగ్ని కారణము. ఆ అగ్నిస్వరూపుడే అమితాశనుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠగారు పై భావములతోపాటు మరొక అదనపు అర్థమును చెప్పారు – **అమితాన్ ప్రాణినః ఆశ్యతి = భోజయతి ఇతి అమితాశనః** – అంతులేని ప్రాణులన్నింటికిని భోజనము ప్రసాదించువాడు అమితాశనుడు,

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.